
బుధవారం 5 ఆగస్టు 2026

https://www.telugudesam.org



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు




## నైతిక విలువలతోనే విద్యా వికాసం

లోకేష్‌తో భేటీలో చాగంటి కోటేశ్వరరావు

- వివరాలు 4 లో..

## డబుల్ ఇంజిన్ సర్కార్...

# ట్రిపుల్ రీజియన్ ప్రణాళిక




- రాష్ట్రాన్ని అభివృద్ధి బాట పట్టిస్తున్నాం
- శ్రమకోర్చి వ్యవస్థలను గాడిన పెడుతున్నాం
- సంక్షేమం-అభివృద్ధిని బ్యాలెన్స్ చేస్తున్నాం
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై శ్వేతపత్రం విడుదల చేసిన సీఎం

2

*రాష్ట్రానికి విభజన కంటే కూడా **2019-24** మధ్య జరిగిన విధ్వంసం వల్లే కోలుకోలేని దెబ్బతగిలింది. నా సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎన్నడూ లేనంత కష్టాన్ని గత రెండేళ్లలో అనుభవించాను అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర సచివాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఆర్థిక శాఖపై శ్వేతపత్రం, కూటమి ప్రభుత్వ పాలనపై 'ప్రోగ్రెస్ రిపోర్ట్' విడుదల చేశారు. ఆర్థిక వెసులుబాటు లేకపోయినా ఒకవైపు అభివృద్ధిని, మరోవైపు సంక్షేమాన్ని పక్కాగా బ్యాలెన్స్ చేస్తూ రాష్ట్రాన్ని మళ్లీ ప్రగతిబాట పట్టించామని, పోయిన బ్రాండ్‌ను పునరుద్ధరించామని అంకెలు-ఆధారాలతో వివరించారు.*

# అగాధం నుంచి అభివృద్ధి వైపు!

- సంక్షేమానికి రూ.1.49 లక్షల కోట్లు
- అభివృద్ధికి రూ.1.34 లక్షల కోట్లు
- రుణాల రీ షెడ్యూల్‌తో రూ.8,269 కోట్ల ఆదా
- 'ప్రాజెక్టు రిపోర్టు' విడుదల చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు



3

*గత ప్రభుత్వ హయాంలో కుప్పకూలిన రాష్ట్ర ఆర్థిక వ్యవహారాలను చక్కదిద్ది ఆంధ్రప్రదేశ్‌ను తిరిగి అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు చేపట్టిన చర్యలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు **46** పేజీల సుదీర్ఘ 'ప్రాజెక్టు రిపోర్టు' విడుదల చేశారు.*

*రాష్ట్ర విభజన నాటి సవాళ్ల నుంచి **2019-2024** మధ్య జరిగిన విధ్వంసం... తదనంతరం చేపట్టిన సంస్కరణలను అంకెలు, ఆధారాలతో సహా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మీడియాకు పూసగుచ్చినట్టు వివరించారు. గత రెండేళ్లలో సంక్షేమం కోసం రూ.**1.49** లక్షల కోట్లు, అభివృద్ధికి రూ.**1.34** లక్షల కోట్లు వెచ్చించామన్నారు. పెండింగ్ బకాయిలను తీరుస్తూ నూతన పెట్టుబడి విధానాలతో ఆంధ్రప్రదేశ్‌ను అగాధం నుంచి అభివృద్ధి వైపు నడిపిస్తున్నామని చెప్పారు. రాబోయే రోజుల్లో దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టడమే లక్ష్యంగా కష్టపడుతున్నామని స్పష్టం చేశారు.*



## నాన్ ఆక్వా జోన్‌కూ రాయితీ విద్యుత్

4

- యూనిట్ రూ.1.50 చొప్పున ఈ నెల నుంచే
- ఆఫ్ స్టైల్ పొగాకుపై కిలోకు రూ.10 మద్దతు
- రైతులకు ఎల్‌నినో సంక్షోభ నివారణ ప్రణాళిక
- 7 నుంచి అవగాహన కార్యక్రమాలు
- అధికారులతో సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



## ఒక్కరోజే 3 లక్షలకు పైగా ఇళ్ల సందర్శన

- 9వ రోజుకు "ఇంటింటికీ తెలుగుదేశం"
- కేటాయించిన జిల్లాల్లో తప్పనిసరిగా పర్యటించాలని ఇన్‌చార్జి మంత్రులకు వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ ఆదేశం
- కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జోనల్ ఇన్‌చార్జులు, పరిశీలకులు, పార్లమెంటరీ అధ్యక్షులకు దిశానిర్దేశం

6

## గుంటూరు సమీపంలో... రూ.100 కోట్లతో కేంద్ర యోగా పరిశోధన సంస్థ

స్థలాన్ని పరిశీలించి ఓకే చెప్పిన కేంద్ర బృందం

మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి



10


## అమరావతిలో కీలక అభివృద్ధి పనులకు

# సీఆర్డీఏ అథారిటీ అనుమతి మంజూరు

### వివరాలు వెల్లడించిన మంత్రి నారాయణ

అమరావతి (చైతన్యరథం): రాజధాని అమరావతి ప్రాంతంలో కీలకమైన పలు అభివృద్ధి పనులకు సీఆర్డీఏ అనుమతులు మంజూరు చేసిందని మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. మంగళవారం సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన 64వ సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో ఆమోదించిన నిర్ణయాలను ఆయన మీడియాకు వెల్లడించారు. అమరావతిని గ్లోబల్ టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా రూ.1,280 కోట్ల భారీ అంచనా వ్యయంతో నిర్మించనున్న క్వాంటం ఫెసిలిటీ ప్రాజెక్టు టెండర్‌ను ప్రముఖ నిర్మాణ సంస్థ ఎల్ అండ్‌టీ దక్కించుకుందన్నారు. రాజధాని అనుసంధానానికి అత్యంత కీలకమైన ఇన్నర్ రింగ్ రోడ్డు, నూతన రైల్వే లైన్ నిర్మాణానికి భూమి సేకరించాల్సి రాగా గుంటూరు జిల్లా మోతడక గ్రామస్తులు ముందుకొచ్చి 2,344 ఎకరాల భూమిని ల్యాండ్ పూలింగ్ కింద ఇచ్చేందుకు ఏకగ్రీవ తీర్మానం చేశారన్నారు. విజయవాడ నగరంలో ట్రాఫిక్ రహిత రవాణాతో పాటు పర్యాటకాన్ని ప్రోత్సహించేలా పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ మోడల్‌లో విజయవాడ రైల్వే స్టేషన్ నుంచి పండిట్ నెహ్రూ బస్టాండు వరకు, బస్టాండు నుండి ఇంద్రకీలాద్రి శ్రీ కనకదుర్గమ్మ ఆలయం వరకు, దుర్గమ్మ గుడి వద్ద నుంచి కృష్ణా నది ఒడ్డున ఉన్న పున్నమి ఘాట్ వరకు... అక్కడి నుంచి భవాని ఐలాండ్ వరకు... అక్కడి నుంచి అమరావతిలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం వరకు ఐకానిక్ రోప్‌వే ప్రాజెక్టు చేపడతామన్నారు.

20 మెగావాట్ల బృహత్తర సామర్థ్యంతో డేటా సెంటర్ ఏర్పాటుకు టెండర్లు పిలవడంతో పాటు నగరమంతటా హైస్పీడ్ నెట్‌వర్క్




అందించేందుకు 20 ప్రధాన ప్రాంతాల్లో 5+ టవర్ల ఏర్పాటుకు నివేదికల ఆహ్వానానికి సమ్మతించారు. గత ప్రభుత్వ హయాంలో పక్కన పెట్టిన 'హ్యాపీనెస్ట్' హౌసింగ్ ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం పునరుద్ధరించిన నేపథ్యంలో ఆలస్యం వల్ల కొనుగోలుదారులపై అదనపు భారం పడకుండా ఏపీ రేరా రెన్యువల్ ఫీజు నుంచి మినహాయింపు ఇవ్వాలని నిర్ణయించారు.

రాజధాని పరిధిలోని పల్నాడు జిల్లాలో 244.39ఎకరాల దేవదాయ భూములను ల్యాండ్ పూలింగ్ పరిధిలోకి తెస్తూ సుప్రీం కోర్టు ఉత్తర్వుల ప్రకారం దేవదాయ శాఖకు చెల్లించాల్సిన రూ.122కోట్లను సీఆర్డీఏ నుంచి విడుదల చేయడానికి అనుమతి లభించింది. గతేడాది రైతులకు చెల్లించిన రూ.300కోట్ల యాన్యుటీ బకాయిల నిమిత్తం APPFC కార్పొరేషన్ ద్వారా తీసుకున్న రుణ ప్రక్రియకు అథారిటీ రెక్టిఫికేషన్ ఆమోదం తెలిపింది.

అమరావతిలో కేంద్రీయ విద్యాలయానికి స్థలం కేటాయింపుపై చెల్లించాల్సిన స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజుల మినహాయింపు ప్రతిపాదనను మంత్రిమండలి ఆమోదానికి పంపుతామన్నారు. అమరావతి-విజయవాడ మధ్య భవిష్యత్ ప్రయాణ,సరుకు రవాణా అవసరాల కోసం కృష్ణానదిపై ఎన్ని బ్రిడ్జీలు అవసరం... అత్యంత ఆధునిక సాంకేతికతతో కూడిన ఐకానిక్ బ్రిడ్జ్ నిర్మాణ సాధ్యాసాధ్యాలపై అధ్యయనానికి ప్రత్యేక కన్సల్టెంట్ నియమిస్తామన్నారు. భోగాపురం విమానాశ్రయం తరహాలోనే అమరావతిలోని ప్రభుత్వ భవనాలు, ప్రాజెక్టులలో తెలుగు సంస్కృతి, కళలు, సంప్రదాయాలు ఉట్టిపడేలా రూపకల్పన చేయడానికి ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

## కృత్రిమ నిరుద్యోగ ఉద్యమాలను అడ్డుకుంటాం

- నిరుద్యోగ, యువజన, విద్యార్థి సంఘాల జేఏసీ నాయకుల ఉద్ఘాటన
- మెగా డీఎస్సీపై వైసీపీ విష ప్రచారానికి ఖండన


మెగా డీఎస్సీపై వైసీపీ చేస్తున్న విష ప్రచారాన్ని ఖండిస్తూ నిరుద్యోగ సంఘాలు, యువజన, విద్యార్థి సంఘాల జేఏసీ అధ్వర్యంలో మంగళవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ప్రధానంగా ఆరు అంశాలపై చర్చించారు. కృత్రిమ నిరుద్యోగ ఉద్యమాలను అడ్డుకుంటామని ఉద్ఘాటించారు. డీఎస్సీపై వైసీపీ నాయకుల తీరును 17 సంఘాల జేఏసీ నాయకులు తప్పుపట్టారు. వైసీపీ కుట్రలకు యువత బలి కాకుండా అందరూ ఒకే తాటిపై పని చేయాలని నిర్ణయం తీసుకున్నారు. డీఎస్సీపై పిల్‌ను హైకోర్టు తిరస్కరించడంపై హర్షం వ్యక్తం చేశారు.

11



చైతన్యరథం

# డబుల్ ఇంజిన్ సర్కార్... ట్రిపుల్ రీజియన్ ప్రణాళిక



- రాష్ట్రాన్ని అభివృద్ధి బాట పట్టిస్తున్నాం
- శ్రమకోర్చి వ్యవస్థలను గాడిన పెడుతున్నాం
- ఏపీ బ్రాండ్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టాం
- సంక్షేమం - అభివృద్ధిని బ్యాలెన్స్ చేస్తున్నాం
- కేంద్రం అండ లేకుంటే కోలుకోవడం కష్టమయ్యేది
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ప్రజలూ తెలుసుకోవాలి
- ఎన్నడూ లేనంతగా రెండేళ్లలో ఎంతో కష్టపడ్డాను
- ఆదాయం పెంచే కార్యక్రమాలకు సమ ప్రాధాన్యం
- వైసీపీ నేతలు పీపీపీని వ్యతిరేకిస్తారు కానీ.. భోగాపురం క్రెడిట్ మాత్రం వారిదంటారు
- అంతర్జాతీయ అవకాశాలకు గేట్‌వే ఎయిర్‌పోర్టు
- హామీలు అమలు చేయబట్టే ప్రజల్లో ఆదరణ
- రెండేళ్ల పాలనపై సీఎం చంద్రబాబు ప్రోగ్రెస్ రిపోర్ట్
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై శ్వేతపత్రం విడుదల
- విభజన - విధ్వంస నష్టాలు - ప్రభుత్వ చర్యలు
- భవిష్యత్ కార్యాచరణపై సమగ్ర ప్రజంటేషన్

అమరావతి(చైతన్యరథం): విభజన నాటి కంటే 2019-24 మధ్యన జరిగిన విధ్వంసం వల్లే ఆంధ్రప్రదేశ్ ఎక్కువ నష్టపోయిందని, ఈ సమస్యను అధిగమిస్తూ అభివృద్ధి-సంక్షేమాన్ని బ్యాలెన్స్ చేసుకుంటూ పాలన సాగిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. తన జీవితంలో ఎన్నడూ పడనంత కష్టాన్ని గత రెండేళ్లల్లో పడ్డానని తెలిపారు. రాష్ట్రాన్ని మొత్తంగా గాడిలో పెట్టే శామని చెప్పడం లేదన్న ఆయన రాష్ట్రాన్ని అభివృద్ధి బాట పట్టించేలా..పోయిన బ్రాండ్‌ను పునరుద్ధరించేలా చర్యలు చేపట్టామని వివరించారు. ఆర్థిక వెసులుబాటు లేకున్నా ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ సంక్షేమాన్ని అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ఆదాయ వ్యయాలు.. ప్రభుత్వ భవిష్యత్ కార్యాచరణ వంటి అంశాలు ప్రజలకూ తెలియాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన మీడియా కాన్ఫరెన్స్‌లో రెండేళ్ల ఆర్థిక స్థితిగతులపై ప్రొగ్రెస్ రిపోర్ట్ ప్రజెంట్ చేస్తూ ఆర్థిక శాఖపై శ్వేతపత్రం విడుదల చేశారు. 2019-24 మధ్య రాష్ట్రంలో వ్యవస్థలు నిర్వీర్యమయ్యా యి..ప్రజలు, అధికారులు, ఉద్యోగులు భయపడే పరిస్థితి ఏర్పడిం ది..నాటి పాలనపై ప్రజల్లో వచ్చిన నిశ్శబ్ద విప్లవమే 2024 ఎన్ని కల ఫలితాలని చెప్పారు. 2024 ఎన్నికల సమయంలో రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామని, బ్రాండ్ ఏపీని తిరిగి తీసుకొస్తామని ప్రజలకు హామీ ఇచ్చాం..అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నాం..చెప్పిన విధంగా ఇచ్చిన తేదీల్లో సంక్షేమాన్ని అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. సంక్షేమంతో పాటు రాష్ట్రానికి ఆదాయం సమకూర్చే అభివృద్ధి కార్యక్రమాలకు సమాన ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. రాష్ట్రానికి ఆదాయం పెరగాలంటే ముందుగా అభివృద్ధి జరగాలని స్పష్టం చేశారు. అందుకే పెట్టుబడులు, పరిశ్రమలు, మౌలికవసతులు, కొత్త రంగాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని.. ఆ మేరకు కొత్త పాలసీలు తెస్తుందని వివరించారు.

## సమర్థవంతంగా పనిచేస్తే ప్రజలు సహకరిస్తారు

ప్రభుత్వం సమర్థంగా పనిచేస్తే ప్రజలు కూడా అభివృద్ధిలో ఏ స్థాయిలో భాగస్వాములు అవుతారో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం చాటిచెప్పింది. భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభంతో ఉత్తరాంధ్ర అభివృద్ధికి రెక్కలు వచ్చిన భావన ప్రజల్లో ఏర్పడింది. ఉత్తరాంధ్రను అంతర్జాతీయ అవకాశా లకు గేట్‌వేగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని చెప్పారు. దీన్ని ప్రజలు గ్రహించినందు వల్లే ఎయిర్‌పోర్టు ప్రారం భోత్సవానికి ప్రజల నుంచి చక్కటి మద్దతు లభించిందని తెలిపా రు. పీపీపీ పద్ధతిలో ప్రాజెక్టులు చేపడుతుంటే వ్యతిరేకించిన వారు.. అదే పీపీపీ పద్ధతిలో చేపట్టిన భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణ క్రెడిట్ మాత్రం తమదని చెప్పుకుంటున్నారని విమ ర్శించారు. పెట్టుబడులు వస్తే పరిశ్రమలు వస్తాయి.. పరిశ్రమలు వస్తే ఉద్యోగాలు, ఆదాయం పెరుగుతాయి..ఆదాయం పెరిగితే మరింత సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందని వివరించారు.

## 2019-24.. గుంతల రోడ్లు.. గుదిబండ అప్పులు

2019-24 మధ్య రాష్ట్రాన్ని విష వలయంలోకి నెట్టారు..రోడ్లన్నీ గుంతలమయమయ్యాయని విమర్శించారు. గత ఐదేళ్లలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడంతో పాటు అభివృద్ధి వేగాన్ని నిలిపి వేశారు. ఆదాయం తగ్గి ఖర్చులు పెరిగిన పరిస్థితుల్లో అప్పులు పెంచుకుంటూ వెళ్లారు..చివరకు రాష్ట్రం దివాళా తీసే పరిస్థితి ఏర్పడిందని వివరించారు. 2019లో వైసీపీ పరిపాలన ప్రారంభిం చిన తీరు ప్రజావేదిక కూల్చివేతతోనే స్పష్టమైందని పేర్కొన్నారు. కలెక్టర్ కాన్ఫరెన్స్ పెట్టి మరీ ప్రజావేదికను కూల్చారు. దీన్ని గర్వం అనాలా? మదం అనాలా? దీనికి పేరే లేదేమో? అని ఘాటుగా వ్యాఖ్యానించారు. ప్రభుత్వ పాలనలో విధానపరమైన నిర్ణయాల కంటే విధ్వంసకర చర్యలకే గత ప్రభుత్వంలో ప్రాధా న్యం ఇచ్చిందని మండిపడ్డారు. 2019-24 మధ్య రాష్ట్రాన్ని అన్ని విధాలుగా వెనక్కి నెట్టారని వ్యాఖ్యానించారు. మౌలికవసతుల ప్రాజెక్టుల్లో పురోగతి ఆగిపోయింది..రోడ్ల నిర్వహణ సరిగా లేక గుంతలమయంగా మారాయని తెలిపారు. శాంతిభద్రతల పరిస్థితి దెబ్బతినడంతో పెట్టుబడిదారుల్లో నమ్మకం తగ్గిందన్నారు. పరిశ్రమలు రావాల్సిన చోట ఉన్నవి కూడా వెళ్లిపోయే పరిస్థితి ఏర్పడిందని, కొత్త పెట్టుబడులు లేకుండా పోయాయని పేర్కొన్నా రు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గత ప్రభుత్వం తీవ్రంగా దిగజార్చిందని మండిపడ్డారు. నాటి ప్రభుత్వ నిర్వాకం వల్ల అప్పులు రూ.9.74 లక్షల కోట్లకు చేరాయని, అప్పులు తీర్చే సామర్థ్యం లేని రాష్ట్రంగా నీతి ఆయోగ్ పేర్కొనే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఆదాయాలు తగ్గుతున్నా ఖర్చులు మాత్రం పెరిగాయని, ప్రభుత్వ ఆస్తులు, భూములను తాకట్టు పెట్టి మరీ అప్పులు తెచ్చారని నాటి పాలన తీరును వివరించారు. రాష్ట్రం దివాళా తీసే స్థాయికి చేరడంతో అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు.

## కేంద్ర నిధులూ దారి మళ్లించారు

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇచ్చిన పథకాల నిధులను కూడా గత ప్రభుత్వం దారి మళ్లించిందని తెలిపారు. కేంద్ర నిధుల వినియోగంలో గత ప్రభుత్వం అనుసరించిన విధానం కారణంగా కేంద్రం ప్రత్యేకంగా చట్టం చేయాల్సిన పరిస్థితి వచ్చిందని చెప్పా రు. కేంద్రం ఇచ్చే నిధులను నిర్దేశిత ప్రయోజనాలకే వినియోగించేలా వ్యవస్థను కట్టుదిట్టం చేయాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. మద్య నిషేధం చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన నాటి ప్రభుత్వం చివరకు మద్యం ఆదాయాన్ని ముందుగానే తాకట్టు పెట్టి రూ.25 వేల కోట్లు అప్పులు తెచ్చిందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీకి పూర్తి భిన్నంగా మద్యం ఆదాయాన్ని ప్రభుత్వ ఆర్థిక నిర్వహణకు ఉపయోగించారని తెలిపారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో కేంద్ర ప్రభుత్వ సహకారం ఎంతో కీలకంగా మారిందని పేర్కొంటూ వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని కేంద్రం ఆదుకుందని వ్యాఖ్యానించారు. కేంద్రం అందిస్తున్న సహకారాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉండాలని చెప్పారు. కేంద్రం సాయం అందిస్తే దాన్ని అందిపుచ్చు కుని అభివృద్ధిగా మలచుకునేందుకు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నా రు. ప్రజలు ఇచ్చిన ఓట్లతోనే ఇదంతా చేయగలుగుతున్నామని వివరించారు.

## ఆర్థిక వ్యవస్థను అడవి పందుల్లా ధ్వంసం చేశారు

అడవి పందులు పంటను నాశనం చేసినట్టుగా నాటి ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను నాశనం చేసిందని ధ్వజమెత్తారు. కేంద్రం నుంచి వచ్చిన రెవెన్యూ లోటు నిధులను కూడా ముందుగానే ఖర్చు చేశా రన్నారు. ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడంతో ఆగకుండా.. రాష్ట్ర భవిష్యత్తును మార్చే అనేక కీలక ప్రాజెక్టులను కూడా విధ్వంసం చేశారని మండిపడ్డారు. అమరావతి నగర నిర్మాణాన్ని నిలిపివేయ గా తాము అధికారంలోకి వచ్చిన తర్వాత పనులను మళ్లీ గాడిలో పెట్టామని, నిర్మాణ పనులు వేగంగా చేపడుతున్నామని తెలిపారు. ఇప్పుడు ప్రపంచంలో అమరావతికి గుర్తింపు తీసుకొచ్చే ప్రాజెక్టుల కు శ్రీకారం చుడుతున్నామని చెప్పారు.

## 2028కి అమరావతి ఫేజ్-1 ప్రారంభం

డిసెంబరులో క్వాంటం వ్యాలీని ప్రారంభిస్తాం..2028లో అమరావతి ఫేజ్-1ను ప్రారంభించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నా మని వెల్లడించారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని స్పష్టం చేశారు. పోలవరంతోనే ఆగ కుండా రాష్ట్రంలోని కీలక సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. రూ.37,766 కోట్లతో 36 ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. ఏపీలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఉందని.. ట్రిపుల్ రీజియన్ ప్రణాళికతో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. అమరావతి, తిరుపతి, విశాఖ కేంద్రంగా ఎకనమిక్ రీజి యన్ల వారీగా అభివృద్ధి చేపడుతున్నామని తెలిపారు.

## టెక్నాలజీని అడ్డుకోవద్దు

గతంలో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌ను రాష్ట్రానికి తీసు కొచ్చామని, ఇప్పుడు ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌ను ఏర్పా టు చేస్తున్నామని తెలిపారు. ఐఎస్‌ఏ ఏర్పాటుకు రిలయన్స్ ముందుకొచ్చిందని వెల్లడించారు. డేటా సెంటర్లు వస్తుంటే ప్రజల ను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని మండిపడ్డా రు. మాకెందుకు స్టీల్ ప్లాంట్.. మాకెందుకు ఏఐ.. మాకెందుకు డేటా సెంటర్లు అంటూ పేదరికంలోనే బాధపడాలా? అని ప్రశ్నిం చారు. యువతకు ఉద్యోగాలు, ప్రజలకు ఆదాయం, రాష్ట్రానికి సంపద తీసుకొచ్చే పరిశ్రమలు, సాంకేతిక రంగాలను ప్రోత్సహిం చాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రజల జీవితాలను మార్చేలా పబ్లిక్ పాలసీలు ఉండాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. సంక్షేమం ఎంత ముఖ్యమో.. అభివృద్ధి కూడా అంతే ముఖ్యమని స్పష్టం చేశారు. మంచి రోడ్లు వేయాలన్నా.. మౌలికవసతులు కల్పించాలన్నా సంపద సృష్టించాల్సిందేనని తెలిపారు. సంపద సృష్టికి కొత్త మార్గాలను అన్వేషించడంతో పాటు పెట్టుబడులను ఆకర్షించే విధానాలు రూపొందించాల్సిన అవసరం ఉందని చెప్పా రు. ఈ అంశాలపై ప్రజల్లో విస్తృత చర్చ జరగాలని ఆకాంక్షించా రు. పరిశ్రమలు వస్తే ప్రజల జీవితాల్లో ఎలాంటి మార్పు వస్తుందో కియా కార్ల పరిశ్రమను ఉదాహరణగా ప్రస్తావించారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడం వల్లే ప్రజలు ప్రభుత్వాన్ని నమ్ముతు న్నారని పేర్కొన్నారు. ఈ మీడియా సమావేశంలో ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మండలికి సీఎం చంద్రబాబు నివాళి

అమరావతి (చైతన్యరథం): మాజీ మంత్రి, తెలుగుభాషా పరిరక్షకులు దివంగత మండలి వెంకట కృష్ణారావు జయంతి సందర్భంగా సీఎం చంద్రబాబు తన క్యాంపు కార్యాలయంలో మండలి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగుభాషా పరిరక్షణకు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.



# అగాధం నుంచి అభివృద్ధి వైపు..

- సంక్షేమానికి రూ.1.49 లక్షల కోట్లు.. అభివృద్ధికి రూ.1.34 లక్షల కోట్లు
- రుణాల రీ-షెడ్యూల్‌తో రూ.8,269 కోట్ల ఆదా
- గత ప్రభుత్వ పెండింగ్ బిల్లుల్లో రూ.19,357 కోట్ల మేర చెల్లింపు
- రూ.30,849 కోట్ల మేర ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలకు మోక్షం
- 86 కేంద్ర ప్రాయోజిత పథకాల పునరుద్ధరణ
- రూ.8,695 కోట్ల పెండింగ్ బిల్లుల క్లియరెన్స్
- విధ్వంస పాలనలో రూ.6.94లక్షల కోట్ల నష్టం
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై సీఎం చంద్రబాబు శ్వేతపత్రం



అమరావతి(చైతన్యరథం): రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టేం దుకు గత రెండేళ్ల కాలంలో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు.. దాని వల్ల కలిగిన ప్రయోజనాలు.. ప్రస్తుతం చేపడుతున్న చర్యల వల్ల భవిష్యత్‌లో జరిగే మేలు తదితర అంశాలను వివరిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్థిక శాఖపై ప్రోగ్రెస్ రిపోర్ట్ విడుదల చేశారు. 46 పేజీలతో కూడిన ప్రోగ్రెస్ రిపోర్టును ఆసాంతం పూస గుచ్చినట్టుగా మీడియాకు వివరించారు. రాష్ట్ర విభజన నాటి పరిస్థితుల నుంచి ఇప్పటివరకు జరిగిన పరిణామాలను సుదీర్ఘం గా గణాంకాలతో విశ్లేషించారు. బడ్జెట్ లెక్కలు.. ఆర్థిక గణాంకా లు ప్రజలకు తెలియాల్సిన అవసరాన్ని చెప్పారు. వీటిని బ్రహ్మ పదార్థంగా చూడకూడదని, ప్రతి ఇంటికి వచ్చిన ఆదాయానికి అనుగుణంగా ఖర్చులు ఎలా చేస్తారో.. తాము కూడా అంతే జాగ్రత్తగా రాష్ట్రానికి వచ్చిన ఆదాయాలను అభివృద్ధి-సంక్షేమానికి ఖర్చు పెడుతున్నామని తెలిపారు. ఇదే సమయంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు.. పెట్టుబడుల ద్వారా మరింత ఆదాయాన్ని సమకూర్చుకునేందుకు వివిధ రకాల పాలసీలను తెచ్చామని వివరించారు. విభజన నాటి పరిస్థితులు, ఆ తర్వాత రాష్ట్రాన్ని ఏ విధంగా ప్రగతి పథంలో నడిపించాం, 2019లో ప్రభుత్వం కొనసాగకపోవడం వల్ల జరిగిన విధ్వంసం, మళ్లీ అధికారంలోకి వచ్చాక గత రెండేళ్ల కాలంలో చేపట్టిన సంస్కర ణలు సోదాహరణంగా వివరించారు. గత రెండేళ్ల కాలంలో తీసు కున్న చర్యల వల్ల రాష్ట్రం అగాధం నుంచి అభివృద్ధి వైపు వెళుతోందని చెప్పారు. ఇంకా చాలా చేయాల్సి ఉంటుందని వివరిం చారు. ఈ రెండేళ్ల కాలంలో సంక్షేమం కోసం రూ.1,49,401 కోట్లను ఖర్చు పెట్టామని చెప్పారు. అలాగే అభివృద్ధి పనులకూ భారీగానే నిధులను ఖర్చు పెట్టామని తెలిపారు. దీంట్లో భాగంగా రూ.1,33,917 కోట్లను కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఖర్చు పెట్టాయని వివరించారు. అలాగే గత ప్రభుత్వం వదిలివెళ్లిన పెండింగ్ బిల్లులు సహా ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలనూ చెల్లించామని వివరించారు. ఇవేకాకుండా కేంద్ర ప్రాయోజిత పథకాలు, ఆర్థిక సంఘం నిధుల బదలాయింపు వంటి చెల్లింపులు కూడా చేశామని లెక్కలతో సహా వివరించారు. వైసీపీ పాలనలో చేసిన ఘోర తప్పిదాల వల్ల రాష్ట్ర ప్రభుత్వం రూ.6.94 లక్షల కోట్ల మేర జీఎస్డీపీ నష్టాన్ని చవిచూసిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు విడుదల చేసిన ప్రోగ్రెస్ రిపోర్టులో వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

## విభజన.. ఆ తర్వాత పరిణామాలు

-----------------------

- ఉమ్మడి రాష్ట్ర జనాభాలో 58 శాతం ఏపీకి వచ్చినా.. వనరుల్లో వాటా మాత్రం 46 శాతమే
- రాజధాని కోల్పోవడంతో ఆదాయ సమీకరణపై తీవ్ర ప్రభావం
- ఆస్తుల కేటాయింపులోనూ రాష్ట్రానికి అన్యాయం
- విభజన అనంతరం ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ రంగం వాటా పెరిగి సేవల రంగం వాటా తగ్గింది
- 2014-19 మధ్య ఏపీ సగటు జీఎస్డీపీ వృద్ధిరేటు 13.5 శాతం
- 2014-19 మధ్య తెలంగాణతో పోల్చుకుంటే రిసోర్స్ గ్యాప్ 10 శాతం నుంచి 8 శాతానికి తగ్గింది

## 2019-24 మధ్య ఆర్థిక నష్టం

- 2019-24 మధ్య రాష్ట్ర ఆర్థిక వృద్ధి మందగించింది.
- 2014-19లో ఉన్న వృద్ధిరేటును కొనసాగించకపోగా... 10.30 శాతానికి పడిపోయింది.
- 2014-19 వృద్ధి రేటు కొనసాగకపోవడం వల్ల రూ.6.94 లక్షల కోట్ల జీఎస్డీపీని నష్టపోయాం.
- తెలంగాణతో తలసరి ఆదాయం 2018-19లో రూ.55,817 ఉండగా..2023-24 నాటికి రూ.1,06,854కు పెరిగింది.
- 2025-26లో ఏపీ తలసరి ఆదాయం రూ.2,94,507గా ఉంది.
- 2014-19 సగటు వృద్ధిరేటు కొనసాగి ఉంటే 2025-26లో ఏపీ తలసరి ఆదాయం రూ.3,67,115 ఉండేది. దీనివల్ల ఏపీ తలసరి ఆదాయం రూ.72,608 మేర తగ్గిపోయింది.

## ప్రణాళికాబద్ధంగా బడ్జెట్ల రూపకల్పన

- 2024-25 ఆర్థిక సంవత్సరంలో గత ప్రభుత్వాలను సరిదిద్దుతూ.. వ్యవస్థలను గాడిలో పెడుతూ కరెక్టివ్ బడ్జెట్ ప్రవేశపెట్టారు.
- 2025-26 ఆర్థిక సంవత్సరానికి స్వర్ణాంధ్ర విజన్ 2047 రూపకల్పనకు ప్రాధాన్యతనిస్తూ బడ్జెట్ ప్రవేశపెట్టారు.
- 2026-27 ఆర్థిక సంవత్సరానికి మూడు రీజియన్లకు సమ ప్రాధాన్యతనిస్తూ సమగ్రాభివృద్ధి ప్రణాళికలతో బడ్జెట్ ప్రవేశపెట్టారు.

## బిల్లుల చెల్లింపులు..
## కేంద్ర ప్రాయోజిత పథకాల పునరుద్ధరణ

- 2024లో కూటమి ప్రభుత్వం ఏర్పడే నాటికి ఉన్న రూ. 48616 కోట్ల పెండింగ్ బిల్లులకు గానూ... రూ. 19,357 కోట్లు చెల్లింపులు జరిపారు.
- గ్రాట్యుటీ, సీపీఎస్ కాంట్రిబ్యూషన్, ప్రావిడెంట్ ఫండ్, ఏపీ జీఎల్ఐ, మెడికల్ రీ-ఇంబర్సుమెంట్ కింద ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిల్లో రూ.30,849 కోట్ల చెల్లింపులు అయ్యాయి.
- 86 కేంద్ర ప్రాయోజిత పథకాల పునరుద్దరణ కోసం పెండింగులో ఉన్న రూ. 8,695 కోట్లు కేంద్రానికి జమ చేశారు.. యూసీలు సమర్పించారు.
- కేంద్ర ప్రాయోజిక పథకాల పునరుద్ధరణతో రాష్ట్రంలో రూ. 45,138 కోట్ల మేర అభివృద్ధి పనులు జరిగితే.. ఇందులో కేంద్రం తన వాటాగా రూ. 29,890 కోట్లు ఇచ్చింది.
- కేంద్ర ప్రాయోజిత పథకాల పునరద్దురణ వల్లే జల్ జీవన్ మిషన్, సమగ్ర శిక్ష, నేషనల్ రూరల్ లైవ్లీ హుడ్ మిషన్, నరేగా వంటి పథకాలకు ఎక్కువ నిధులు వచ్చాయి.
- గత ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులను స్థానిక సంస్థలకు చెల్లింపులు జరగకుండా పెండింగ్ పెట్టింది.. వీటిల్లో రూ.3142 కోట్ల పెండింగ్ బిల్లులతో సహా మొత్తంగా రూ.7404 కోట్లను స్థానిక సంస్థలకు, వైద్యారోగ్య రంగానికి బదలాయించారు.

## రుణాలపై వడ్డీ శాతం తగ్గించేలా రీ-షెడ్యూల్

- మొత్తంగా ఉన్న అప్పుల్లో 370 రుణాలకు సంబంధించి రూ. 1.50 లక్షల కోట్ల అప్పులపై వడ్డీలు తగ్గించేలా బ్యాంకర్లతో చర్చలు జరిపారు.
- 13 శాతంగా ఉన్న అప్పులపై వడ్డీలను 10.90 శాతానికి తగ్గించారు.
- మరికొన్ని అప్పులపై 9.9 శాతం వడ్డీ ఉండగా... వాటిని 9.1 శాతానికి తగ్గించారు.
- ఇంకొన్ని అప్పులపై 8 శాతం వడ్డీ ఉండగా.. వాటిని 7.7 శాతానికి తగ్గించారు.
- దీంతో ఏటా రూ.1100 కోట్లు ఆదా అవుతోంది. మొత్తంగా రూ.8269 కోట్ల మేర ఆదా అయింది.

## సంక్షేమం కోసం రెండేళ్లలో రూ.1,49,401 కోట్లు ఖర్చు

- ఎన్టీఆర్ భరోసా - రూ.68,296 కోట్లు
- విద్యుత్ సబ్సిడీ - రూ.32,800 కోట్లు
- తల్లికి వందనం - రూ.20,210 కోట్లు
- అన్నదాత సుఖీభవ - రూ.8,724 కోట్లు
- ఎన్టీఆర్ వైద్యసేవ - రూ.5,921 కోట్లు
- బియ్యం సబ్సిడీ - రూ.4,322 కోట్లు
- దీపం 2.0 - రూ.3,724 కోట్లు
- ఫీజు రీయింబర్స్‌మెంట్ - రూ.1,529 కోట్లు
- స్త్రీశక్తి - రూ.1,520 కోట్లు
- ధరల స్థిరీకరణ నిధి - రూ.1,200 కోట్లు
- మత్స్యకార సేవలో - రూ.505 కోట్లు
- ఆటో డ్రైవర్ల సేవలో - రూ.436 కోట్లు
- ఇమామ్‌లు, మౌజన్‌ల గౌరవ వేతనాలు - రూ.134 కోట్లు
- పాస్టర్ల గౌరవ వేతనాలు - రూ.80 కోట్లు
- ఇప్పటివరకు పీ4 కింద 11 లక్షల కుటుంబాల దత్తత..
  2.4 లక్షల కుటుంబాలకు అందుతోన్న సాయం
- 30,607 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ
- మెగా డీఎస్సీ-2025 -15,941 ఉపాధ్యాయ పోస్టులు
- 5,757 కానిస్టేబుల్ పోస్టుల భర్తీ

## బడుగులు, మహిళల సంక్షేమానికి పెద్ద పీట

- ఎస్సీ సంక్షేమానికి రూ.19,100 కోట్లు- 43 లక్షల మంది లబ్ధిదారులు
- ఎస్టీ సంక్షేమానికి రూ.5,730 కోట్లు - 9 లక్షల మంది లబ్ధిదారులు
- బీసీ సంక్షేమానికి రూ.32,534 కోట్లు - 1.18 కోట్ల మంది లబ్ధిదారులు
- మైనారిటీ సంక్షేమానికి రూ.4,856 కోట్లు- 17 లక్షలకు పైగా లబ్ధిదారులు
- 5 లక్షల మందికి మహిళలను పారిశ్రామికవేత్తలుగా చేయడమే లక్ష్యం
- మహిళలకు రుణ మద్దతు కింద రూ.2246 కోట్లు.. బ్యాంక్ క్రెడిట్ లింకేజీ కింద రూ.43,219 కోట్లు

## అభివృద్ధి పనులు..
## మూలధన వ్యయం పెంపుపై దృష్టి

- మూలధన వ్యయాన్ని పెంచడంపై ప్రభుత్వం దృష్టి
- గత రెండేళ్ల సగటు మూలధన వ్యయం 2019-24 సగటుతో పోలిస్తే 1.5 రెట్లు అధికం
- రాజధాని పనులకు 2024-26లో రూ.10,057 కోట్లు
- పోలవరానికి రూ.8,323 కోట్లు
- పోర్టులకు రూ.5,437 కోట్లు
- జల్ జీవన్ మిషన్‌కు రూ.1,142 కోట్లు
- ఎయిర్ పోర్టులకు రూ.2,302 కోట్లు
- రహదారులకు రూ.3,439 కోట్లు
- రైల్వేల అభివృద్ధి కోసం రూ.64,417 కోట్లు
- జాతీయ రహదారుల కోసం రూ.38,800 కోట్లు

పీపీపీ ప్రాజెక్టులు..వీజీఎఫ్ అమలు

- పెద్దఎత్తున పీపీపీ ప్రాజెక్టుల అమలుకు నిర్ణయం
- రూ.1.78 లక్షల కోట్లతో 390 పీపీపీ ప్రాజెక్టుల అమలుకు ప్రణాళికలు
- పీపీపీ ప్రాజెక్టులకు వయబులిటి గ్యాప్ ఫండ్ పథకం అమలు..కేంద్ర వీజీఎఫ్ స్కీంతో అనుసంధానం
- 10 పీపీపీ ప్రాజెక్టులకు రూ.1850 కోట్ల మేర వీజీఎఫ్ ఇచ్చేందుకు కేంద్రం అంగీకారం

## వచ్చే ఆదాయమెంత..జీతాలకు ఖర్చు పెట్టేదెంత..

- 2014-19 మధ్య కాలంలో రాష్ట్రానికి వచ్చిన ఆదాయంలో 87 శాతం జీతాలకు ఖర్చు పెట్టారు.
- 2019-24 మధ్య కాలంలో రాష్ట్ర ఆదాయాలు పడిపోయాయి.. దీంతో వచ్చిన ఆదాయం కంటే జీతాల ఖర్చు పెరిగింది. 110 శాతం జీతాల కోసం ఖర్చు పెట్టారు.
- ఈ కారణంగా జీతాలను నాటి ప్రభుత్వం సరిగా చెల్లించలేక పోయింది.. కొంత మందికి జీతాలను కూడా పెండింగ్‌లో పెట్టింది.
- 2024-26 మధ్య కాలంలో మళ్లీ ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.
- ఫలితంగా ఆదాయాలు పెరిగాయి. దీంతో ప్రస్తుతం వచ్చే ఆదాయంలో 95 శాతం మేర నిధులను జీతాలకు చెల్లిస్తున్నారు.
- ఇంకా ఆదాయాన్ని పెంచుకోవడం ద్వారా జీతాల చెల్లింపులకు మరింత ఆర్థిక వెసులుబాటు కల్పించుకునేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

# నాన్ ఆక్వా జోన్‌కూ రాయితీ విద్యుత్

- యూనిట్ రూ.1.50 చొప్పున
- ఈ నెల నుంచే ఆఫ్ స్టైల్ పొగాకుపై కిలోకు రూ.10 మద్దతు
- బ్యారెల్‌కు రూ.50 వేల రుణం ప్రారంభించాలి
- రైతులకు ఎల్‌నినో సంక్షోభ నివారణ ప్రణాళిక
- ఆగస్టు 7 నుంచి అవగాహన కార్యక్రమాలు
- అధికారులతో సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఎల్‌నినో ప్రభావం, ఆక్వా, పొగాకుపై సూచనలు



అమరావతి(చైతన్యరథం): నాన్ ఆక్వాజోన్‌లో ఉన్న ఆక్వా రైతులకూ ఈ నెల నుంచే రాయితీపై విద్యుత్ అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆక్వా జోన్ పరిధిలో ఇస్తున్నట్లే నాన్ ఆక్వాజోన్‌లో ఉన్న రైతులకూ యూనిట్ విద్యుత్‌ను రూ.1.5కే ఇవ్వాలని స్పష్టం చేశారు. దీంతో ఇక జోన్లకు మాత్రమే పరిమితం కాకుండా ఆక్వా రైతులందరికీ రాయితీ విద్యుత్ అందుబాటులోకి రానుంది. ఈ నిర్ణయంతో 12,500 మంది ఆక్వా రైతులకు లబ్ధి కలగనుంది. సచివాలయంలో మంగళవారం రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, లోటు వర్షపాతం, పంటల సాగు, జలవనరులు తదితర అంశాలపై వ్యవసాయ శాఖతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఎల్‌నినో సంక్షోభ నివారణ ప్రణాళికతో రాష్ట్రంలోని ప్రతీ రైతు వద్దకు వెళ్లాలని అధికారులను, ప్రజాప్రతినిధులను ఆదేశించారు. దీనికి సంబంధించి ప్రభుత్వం తీసుకుంటున్నచర్యలు,రైతులు అనుసరించాల్సిన ప్రత్యామ్నాయప్రణాళికలు వారికి వివరించాలని సూచించారు.ఆగస్టు 7నుంచి రైతులకు అవగాహనా కార్యక్రమాలుచేపట్టాలని ఆదేశించారు.

### ప్రత్యామ్నాయ ప్రణాళికలు అనుసరించేలా చూడాలి

ఎల్‌నినో కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో అక్టోబరు మాసం వరకూ లోటు వర్షపాతం నమోదయ్యే సూచనలున్న నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ ప్రణాళికలు అనుసరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రత్యేకించి పీఎండీఎస్ విధా నంలో సాగు చేసేందుకు ఉన్న అవకాశాలను రైతులకు వివరిం చేలా రైతుల వద్దకు వెళ్లాలని నిర్దేశించారు. ఎల్‌నినో లాంటి తీవ్ర వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో స్పష్టమైన విధానాన్ని రైతులకు అందించాలని స్పష్టం చేశారు. రైతు యాప్ ద్వారా పూర్తి సమాచారాన్ని క్షేత్రస్థాయిలో రైతులకు వేగంగా అందించాలని స్పష్టం చేశారు. వర్షపాతం తగ్గి సాగు విస్తీర్ణం పెరుగుతోందని, క్షేత్రస్థాయిలో వస్తున్న ఈ మార్పు లకు అనుగుణంగా కార్యాచరణ ఉండాలని ఆదేశించారు. ఎల్‌ని నో ఎఫెక్ట్ మిటిగేషన్ యాక్షన్ ప్లాన్ పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. పశువుల దాణా విషయంలోనూ వీబీ జీ రామ్ జీ అనుసంధానించాలని సూచించారు.

### ఆఫ్ స్టైల్ పొగాకు రైతును ఆదుకునేందుకు రూ.94 కోట్లు

ఆఫ్ స్టైల్ పొగాకుపై కిలోకు రూ.10 మద్దతు ధర ఇచ్చేలా కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బుధవారం నుంచే ఇది అమల్లోకి రావాలని దిశానిర్దేశం చేశారు. 94 మిలియన్ కిలోల ఆఫ్ స్టైల్ పొగాకును కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. దీని ద్వారా 44 వేల మంది రైతులకు ప్రయోజనం కలుగుతుందని స్పష్టం చేశారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం, టొబాకో బోర్డు, రైతులు సహా ఐదుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసి సమీక్షించాలని నిర్దేశించారు. అలాగే ఎఫ్ సీవీ పొగాకు కొనుగోళ్లు ప్రస్తుతం 48.27 మిలియన్ కిలోల కొనుగోళ్లు జరిగాయని అధికారులు వివరించారు. రైతులను ఆదుకునేలా బ్యారెల్‌కు రూ.50 వేల రుణం ఇచ్చే కార్యక్రమాన్ని ప్రారంభించాలని ఆదేశించారు. ఆక్వా సంక్షోభాన్ని నివారించేలా రొయ్య మేత ధరల నియంత్రణపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టాల న్నారు.

### రొయ్య మేత ధరలు పెరగకుండా చర్యలు

ఫిష్ మీల్ ఎగుమతులను 50 శాతానికి తగ్గించేలా కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు. కేంద్రం నిర్ణయం తీసుకునేంత వరకూ రొయ్య మేత ధరలు పెరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాయలసీమను ఉద్యాన హబ్‌గా తీర్చిదిద్దే అంశంపై వేగంగా ప్రణాళికలు అమలు చేయాలని సూచించారు. త్వరలోనే 201 ఉద్యాన క్లస్టర్లను ప్రారంభించనున్నట్టు తెలిపారు. ఇక నుంచి ప్రతీ మంగళవారం వ్యవసాయం, అనుబంధ రంగాలపై, ఎల్‌నినో ప్రభావం నియంత్రణా చర్యలపై సమీక్ష నిర్వహి స్తానని స్పష్టం చేశారు. ఈ సమీక్షకు మంత్రి కె.అచ్చెన్నాయుడు, సీఎస్ సాయి ప్రసాద్, వ్యవసాయ, జల వనరులు, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## నైతిక విలువలతోనే విద్యా వికాసం

# లోకేష్‌తో భేటీలో చాగంటి కోటేశ్వరరావు



అమరావతి(చైతన్యరథం): ప్రవచన చక్రవర్తి, నైతిక విలువల సలహాదారులు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు మంగళవారం ఉండవల్లిలోని నివాసంలో మంత్రి నారా లోకేష్‌ను మర్యాద



పూర్వకంగా కలిశారు. సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దడానికి నైతిక విలువలతో కూడిన విద్య ఎంతటి కీలకమైనదో వివరించారు. చిన్ననాటి నుంచే పిల్లలలో మానవీయ విలువలు, క్రమశిక్షణ, నైతికతను పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చాగంటి కోటేశ్వరరావు దిశా నిర్దేశంలో రూపకల్పన చేసిన నైతిక విలువల పాఠ్యాంశాలను నో బ్యాగ్ డే రోజు బోధిస్తున్నారు. నైతిక విలువల విద్యతోనే సమగ్ర విద్యా వికాసం సాధ్యమని నమ్మిన ఏపీ ప్రభుత్వం చేస్తున్న కృషిలో భాగం కావడంపై చాగంటి సంతోషం వ్యక్తం చేశారు. భేటీ అనంతరం లోకేష్ ఇంటి నుంచి కారు వద్దకు వచ్చి చాగంటిని వినయ పూర్వకంగా సాగనంపారు.

## 8,9 తేదీల్లో గుంటూరులో

# ‘అమరావతి చిత్రకళా వీధి’

- కళాకారులకు ఒక వేదికగా కార్యక్రమం
- బ్రష్ స్ట్రోక్‌తో మంత్రి నారా లోకేష్ మద్దతు

అమరావతి(చైతన్యరథం):ఏపీ సృజనాత్మకత సాంస్కృతిక కమిషన్ ఆధ్వర్యంలో ఈనెల 8, 9 తేదీల్లో గుంటూరులో ఘనంగా నిర్వహించనున్న ప్రతిష్ఠాత్మక ‘అమరావతి చిత్రకళా వీధి’ కార్యక్రమానికి మంత్రి నారా లోకేష్ తన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమ విశేషాలను తెలుసుకున్న ఆయన స్వయంగా కాన్వాస్‌పై బ్రష్ స్ట్రోక్ వేసి కళాకారులు, విద్యార్థులకు తన సంఘీభావాన్ని తెలియజేశారు. అమరావతి చిత్రకళా వీధి కేవలం ఒకకళా ప్రదర్శన మాత్రమే కాదని, ఇది రాష్ట్రంలోని కళాకారులకు ఒక విశాలమైన వేదికను కల్పించడంతోపాటు విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసే ఒక గొప్పసామాజిక ఉద్యమమని కొనియాడారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా పెయింటింగ్ కిట్లు పంపిణీ చేయాలనే నిర్ణయంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని కళాకారులను ప్రోత్సహించే ప్రతి మంచి కార్యక్రమానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక కమిషన్ చైర్‌పర్సన్ తేజస్వి పొదపాటి ఈ కార్యక్రమ ఉద్దేశాలను వివరిస్తూ దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వందలాది మంది చిత్రకారులు ఈ మహోత్సవంలో పాల్గొంటు న్నారని తెలిపారు. కళాకారులకు తమ ప్రతిభను ప్రదర్శించి జాతీయ స్థాయిలో గుర్తింపు




పొందడానికి ఈ ఉత్సవం ఒక వారధిగా నిలుస్తుందని పేర్కొన్నారు. 8, 9 తేదీల్లో గుంటూరు వేదికగా జరగనున్న ఈ సృజనాత్మక వేడుక రాష్ట్ర కళా వైభవాన్ని చాటిచెప్పడమే కాకుండా కళాభిమానులను, విద్యార్థులను ఒకే వేదికపైకి తీసుకురానుంది.



## లోకేష్‌ను కలిసిన ప్రముఖ గాయని శోభారాజు

అమరావతి(చైతన్యరథం): ప్రఖ్యాత శాస్త్రీయ సంగీత కళాకారిణి, పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తనల ఆలాపన, ప్రచారంలో విశేష ప్రావీణ్యం సంపాదించిన పద్మశ్రీ శోభారాజు మంగళవారం ఉండవల్లిలోని నివాసంలో మంత్రి నారా లోకేష్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. లోకేష్‌కి అన్నమాచార్యులు చిత్రపటాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా లోకేష్ శ్రీవారి ప్రతిమను అందజేసి శోభారాజుని గౌరవించారు. తెలుగు సంస్కృతి, సనాతన ధర్మం, ఆధ్యాత్మిక ప్రచారం, అన్నమయ్య సంకీర్తనా వైభవాన్ని భావితరాలకు అందించడంలో శోభారాజు చేస్తున్న సేవలను లోకేష్ అభినందించారు.

చైతన్యరథం

# ఇంటింటా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కూటమి లక్ష్యం

- రెండేళ్లలో హామీ మేరకు పథకాల అమలు
- అభివృద్ధిలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలిపాం
- ఇంటింటికీ సంక్షేమం అభివృద్ధి కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం (చైతన్యరథం): రాష్ట్రంలో ప్రతి గడపకు సంక్షేమం, అభివృద్ధి ఫలాలు అందించాలనే కృతనిశ్చయంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మచిలీపట్నం 36వ డివిజన్ పరిధిలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ రావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ నానితో కలిసి మంగళవారం ఇంటింటికి టీడీపీ కార్యక్రమం నిర్వహించారు. ప్రజలవద్దకు వెళ్ళి అభివృది, సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. సమస్యల ను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ రెండేళ్లుగా కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. ప్రతి ఇంటికి అభివృద్ధి ఫలాలు అందించేలా కృషి చేస్తోందని పేర్కొన్నారు. విభజనతో సమస్యలు ఎదుర్కొన్నా రాష్ట్రాన్ని దేశంలో ఏ రాష్ట్రానికి తీసిపోని విధంగా అభివృద్ధి పథంలో నడిపించాం. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం మృగ్యమైపోయాయి. సంక్షేమ పథకాల ముసుగులో దగా చేశారు. అభివృద్ధి అనే మాట లేకుండా తయారు చేశారు. కనీసం రోడ్లపై గుంతలు కూడా పూడ్చకుండా ప్రజలను ముప్పు తిప్పలు పెట్టారు. ప్రజలు సమస్యలను బయటకు చెప్పుకోవడానికి కూడా భయపడేలా వ్యవస్థలను బెదిరించారు. కానీ నేడు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాప్రతి నిధులంతా ప్రజల్లోనే తిరుగుతున్నారు. సమస్యలు తెలుసుకుని ప్రతిసమస్యకు పరిష్కారం చూపిస్తున్నాం. మరోవైపు అమరావతి, పోలవరం నిర్మాణాలను వేగవంతం చేశాం. గూగుల్, అర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్, డిఫెన్స్ ప్రాజెక్టులతో యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. క్వాంటమ్ కంప్యూ టింగ్ ద్వారా చరిత్ర సృష్టిస్తున్నాం. 20లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పెట్టుబడులు సాధిస్తున్నాం. విద్య వైద్య గ్రామీణాభివృద్ధి రంగాల్లో గణనీయమైన అభివృద్ధి నమోదు చేశాం. రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్న కూటమి ప్రభుత్వంపై జగన్‌రెడ్డి అడ్డగోలుగా ఆరోపణలు చేయడం అత్యంత దుర్మార్గం. రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నదెవరో.. అరాచకం సృష్టిస్తున్నది ఎవరో ప్రజలు తెలుసుకోవాలని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు.

## విద్యుత్ ఛార్జీల ట్రూ డౌన్ ఘనత మాదే

- జగన్ ధ్వంసం చేసిన వ్యవస్థను గాడిలో పెట్టిన సీఎం చంద్రబాబు
- మంత్రి గొట్టిపాటి రవికుమార్



అమరావతి (చైతన్యరథం): ఐదేళ్ల వైసీపీ పాలనలో అస్తవ్యస్తమైన విద్యుత్ రంగాన్ని కూటమి ప్రభుత్వం వచ్చాక గాడిలో పెట్టామని రాష్ట్ర ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ విద్యుత్ శాఖలో రెండు సంవత్సరాల్లో సాధించిన ప్రగతిపై ఇంతకుముందే శ్వేతపత్రం విడుదల చేశామని మంత్రి చెప్పారు. విద్యుత్ ఛార్జీలు పెంచకుండా ట్రూ డౌన్ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. వైసీపీ హయాంలో విద్యుత్ వ్యవస్థ నిర్వీర్యం చేశారని విమర్శించారు. అధిక ధరలకు విద్యుత్ కొనుగోలు వల్ల నష్టాలు జరిగాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యుత్ రంగాన్ని గాడిలో పెట్టామని తెలిపారు. గత ఏడాది కొంత మేర విద్యుత్ ఛార్జీలు తగ్గించామన్నారు. పీఎం సూర్య ఘర్ పథకాన్ని ఏపీ పూర్తిగా వినియోగించుకుంటోంది. సౌర విద్యుత్ ద్వారా లక్షలాది కనెక్షన్ల లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని మంత్రి తెలిపారు. రైతులకు పెద్ద ఎత్తున వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. భారీగా రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టులకు ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. ట్రాన్స్‌మిషన్ లైన్ల విస్తరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని అన్నారు. జగన్ హయాంలో అన్ని వ్యవస్థలు సర్వనాశనం అయ్యాయి. వ్యవస్థలను గాడిలో పెట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు కష్టపడుతున్నారు. ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం చేసే కార్యక్రమాలన్నింటినీ ప్రజలకు వివరిస్తున్నామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు.



## కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌తో టీడీపీ ఎంపీల భేటీ

న్యూఢిల్లీ (చైతన్యరథం):తెలుగుదేశం పార్టీ పార్లమెంటు సభ్యుల బృందం మంగళవారం కేంద్ర రైల్వే, ఎలక్ట్రానిక్స్, ఐటీ, కమ్యూనికేషన్ల శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసింది. ఈబృందంలో లోక్‌సభ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, రాజ్యసభ సభ్యులు సానా సతీష్, భాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్‌లతో పాటు మరికొందరు టీడీపీ ఎంపీలు ఉన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి విజన్, అభివృద్ధి పురోగతి, భవిష్యత్తులో దాని ప్రాధాన్యతను ప్రతిబింబించే ఒక ప్రత్యేక పుస్తకాన్ని ఎంపీల బృందం కేంద్ర మంత్రికి అందజేశారు. ఎంపీల బృందంతో ఎంతో సుహృద్భావ వాతావరణంలో ముచ్చటించిన కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్.. అమరావతి ప్రాముఖ్యతను నలుదిశలా తెలియజేసేలా రూపొందించిన ఈ ప్రత్యేక పుస్తకాన్ని, అలాగే ఎంపీల చొరవను ప్రత్యేకంగా కొనియాడారు.

## లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో టీడీపీ ఎంపీల భేటీ

న్యూఢిల్లీ (చైతన్యరథం): లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను మంగళవారం టీడీపీ ఎంపీల బృందం కలిసి 'అమరావతి'పై రూపొందించిన పుస్తకాన్ని అందజేసింది.

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆధ్వర్యంలో పార్లమెంట్ సభ్యులతో కూడిన బృందం ఈ పుస్తకాన్ని లోక్‌సభ స్పీకర్‌కు అందజేసింది. ఈ సందర్భంగా టీడీపీ ఎంపీలను స్పీకర్ ఓం బిర్లా అభినందించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆకాంక్షలకు ప్రతీకగా నిలిచిన అమరావతి అభివృద్ధి, రాష్ట్ర భవిష్యత్ ప్రగతికి దిశానిర్దేశం చేసేలా ఈ పుస్తకాన్ని రూపొందించారు.

స్పీకర్‌ను కలిసిన వారిలో లోక్‌సభ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, బైరెడ్డి శబరి, మాగుంట శ్రీనివాసులురెడ్డి, గంటి హరీష్, తెన్నేటి కృష్ణప్రసాద్, దగ్గుమళ్ల ప్రసాదరావు, కేశినేని చిన్ని, వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ఉన్నారు.



## అస్వస్థతకు గురైన చిన్నారులకు మంత్రి కొల్లు రవీంద్ర పరామర్శ

**- పూర్తి ఆరోగ్యంగా ఉన్నారు.. తల్లిదండ్రులు ఆందోళన చెందొద్దని భరోసా ఇచ్చిన మంత్రి**



మచిలీపట్నం (చైతన్యరథం): వ్యాక్సిన్ వేయించుకుని అస్వస్థతకు గురై మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను రాష్ట్ర గనులు,భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పరామర్శించారు. మంగళవారం ఉదయం ఆస్పత్రికి వెళ్లి విద్యార్థులకు అందుతున్న వైద్యసేవల గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. విద్యార్థులు పూర్తి ఆరోగ్యంగా ఉన్నారు, తల్లిదండ్రులు ఆందోళన చెందొద్దని భరోసా ఇచ్చారు. సోమవారం ఉదయం వ్యాక్సిన్ వేయించుకున్న కొద్ది సేపటి తర్వాత విద్యార్థులు అస్వస్థతకు గురవ్వడంతో ఆస్పత్రిలో చేర్పించారన్నారు. అప్పటి నుండి డాక్టర్లతో మాట్లాడి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాం. మచిలీపట్నంలో 140 మందికి, జిల్లాలో 750 మందికి వ్యాక్సిన్ ఇచ్చారు. అందులో 8 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని తెలిసిన వెంటనే డాక్టర్లతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించాం. వ్యాక్సిన్ వేయించుకున్న తర్వాత చికెన్ బిర్యానీ తిన్నారని చెబుతున్నారు. బయటి భోజనం కారణంగానే అస్వస్థతకు గురై ఉంటారని అనుమానిస్తున్నాం. పూర్తి స్థాయి నివేదిక అందిన తర్వాత చర్యలు తీసుకుంటాం. హోటల్స్ విషయంలో కూడా అధికారుల్ని అప్రమత్తం చేసి నాణ్యతా ప్రమాణాలు పరిశీలించాలని ఆదేశిస్తాం. ప్రజలు కూడా బయటి ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండాలని మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు.

చైతన్యరథం

# 9వ రోజుకు చేరిన "ఇంటింటికీ తెలుగుదేశం"

- ఒక్కరోజే 3 లక్షలకు పైగా ఇళ్ల సందర్శన
- తొమ్మిది రోజుల్లో 23.63 లక్షల ఇళ్లకు
- రెండేళ్ళ కూటమి పాలనా విజయాలను వివరించిన కూటమి నేతలు
- కేటాయించిన జిల్లాల్లో తప్పనిసరిగా పర్యటించాలని ఇన్‌ఛార్జి మంత్రులకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ ఆదేశం
- కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జోనల్ ఇన్‌ఛార్జులు, పరిశీలకులు, పార్లమెంట్ పార్టీ అధ్యక్షులకు యువనేత లోకేష్ దిశానిర్దేశం

అమరావతి (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ఇంటింటికీ తెలుగుదేశం - 2 ఏళ్ల నమ్మకం, అభివృద్ధి-సంక్షేమం" కార్యక్రమం విజయవంతంగా 9వ రోజుకు చేరింది. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా పాల్గొంటున్నారు. మంగళవారం ఒక్కరోజే కూటమి నాయకులు, కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా 3,03,929 లక్షలకు పైగా గృహాలను సందర్శించిగా గడచిన



తొమ్మిది రోజుల్లో మొత్తంగా 23.63 లక్షల ఇళ్లకు చేరుకుని, కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో సాధించిన ప్రగతిని, అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు కూలంకషంగా వివరించారు. ముఖ్యంగా సూపర్ సిక్స్ హామీల అమలు తీరును ప్రతి ఇంటికీ చేరవేశారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని ఎప్పటికప్పుడు టెక్నాలజీ ద్వారా పర్యవేక్షిస్తూ ఆయా జిల్లాల ఇన్ఛార్జి మంత్రులు తమకు కేటాయించిన జిల్లాల్లో తప్పనిసరిగా పర్యటించాలని, ప్రజలతో నేరుగా మమేకం కావాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమాన్ని మరింత విజయవంతం చేయాలని జోనల్ ఇన్ఛార్జులు, పరిశీలకులు, పార్లమెంట్ పార్టీ అధ్యక్షులకు యువనేత కీలక దిశానిర్దేశం చేశారు. ఎక్కడా ఎటువంటి అలసత్వానికి తావులేకుండా, క్షేత్రస్థాయిలో పార్టీ అనుబంధ విభాగాలు, ప్రజాప్రతినిధులు, కూటమి నేతలు సమన్వయంతో ప్రతి ఇంటి తలుపు తట్టాలని పిలుపునిచ్చారు.

# అధికారుల మద్దతుతో వైసీపీ నేతల భూ దందా

- పోలీసుల అండతో వైసీపీ నేత రౌడీయిజం
- భూమి విషయంలో వైసీపీ మాజీ ఉపసర్పంచ్ దౌర్జన్యం
- బ్రిటిష్ కాలం నాటి వారసత్వ భూమిపై కబ్జాదారుల కన్ను
- హక్కు పత్రాలున్నా కబ్జాకు యత్నించిన వైసీపీ నేత
- టీడీపీ కేంద్ర కార్యాలయంలో వినతుల వెల్లువ
- అర్జీలు స్వీకరించిన విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రవ్యాప్తంగా వివిధ సమస్యల పరిష్కారం కోసం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమానికి ప్రజలు తరలివచ్చారు. అర్జీదారుల నుంచి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వినతులు స్వీకరించి వాటి పరిష్కారానికి కృషిచేశారు.

అధికారుల మద్దతుతో వైసీపీ నాయకులు తన భూమిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, తనకు న్యాయం చేయాలని నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన మోతే మహేశ్వరయ్య అభ్యర్థించారు. తమ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 725-1 లో ఉన్న 4:20 ఎకరాల భూమిని 2015లో కొనుగోలు చేసి, చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ చేయించుకుని నాటి నుండి తానే అనుభవంలో ఉండి సాగు చేసుకుంటున్నానన్నారు. ఈ భూమికి సంబంధించి అన్ని పూర్వపు డాక్యుమెంట్లు పక్కాగా ఉన్నాయి. తాను ఎలాంటి సర్వే చలానా కట్టకపోయినప్పటికీ... ప్యాపిలి మండల రెవెన్యూ అధికారులు, జలదుర్గం సచివాలయ ఉద్యోగులు మద్దిలేటి వైసీపీ నాయకులతో కుమ్మక్కయి స్థలానికి రాకుండానే, కొలతలు కొలవకుండానే కొలిచినట్లు అసత్య నివేదికలు తయారు చేశారు. అవినీతికి పాల్పడి, వైసీపీ నాయకుడు నరేష్ సాగులో ఉన్నట్లు తప్పుడొక నివేదిక ఇచ్చి, 725-1 లోని 1:17 సెంట్ల భూమిని అక్రమంగా నరేష్ పేరు మీదకు మార్చారు. అధికారుల నివేదికను అడ్డుపెట్టుకుని మాధవరం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు కొందరు తన పొలం వద్దకు వచ్చి "మిమ్మల్ని కొడతాం, చంపుతాం, మీకు దిక్కున్న చోట చెప్పుకోండి" అని వేటకొడవళ్లతో బెదిరింపులకు దిగుతున్నారు. వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

తన ఇంట్లోకి దౌర్జన్యంగా ప్రవేశించి నగదు, బంగారం, ఆస్తి పత్రాలు ఎత్తుకెళ్లిన దుండగులపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని వైఎస్సార్ కడప జిల్లా బద్వేల్ కు చెందిన కె. ఆంజనేయులు విజ్ఞప్తి చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 23న తన ఇంటి ప్రహరీ గోడను, తలుపులను పగులగొట్టి, ఇంట్లోని బంగారం, విలువైన ఆస్తి దస్తావేజులు, డాక్యుమెంట్లను దొంగిలించి తనపై దాడి చేశారని తెలిపారు. మొదటి ఘటనపై పోలీసులు సరైన విచారణ జరపకుండా వదిలేయడంతో, తిరిగి జూలై 21న తన ఇంటిపై దాడి చేసి విలువైన సామాగ్రి ఉండగానే ఇంటిని పూర్తిగా నేలమట్టం చేశాడు. పోలీసు అధికారులు కూడా నిందితుడికే సహకరిస్తున్నారు. వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

నంద్యాల జిల్లా ప్యాపిలికి చెందిన దూపం మాధవి విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామంలో సర్వే నంబర్ 941-2 లో 20 సెంట్ల భూమిని 2009 సంవత్సరంలో కొనుగోలు చేశానని తెలిపారు. అయితే, ఆ స్థలం విక్రయించిన వారు రిజిస్ట్రేషన్ చేయకుండా తప్పించుకు తిరగడంతో తాను డోన్ సివిల్ జడ్జి కోర్టును ఆశ్రయించాను. విచారణ అనంతరం కోర్టు ఆర్డర్ ఆధారంగా సదరు స్థలం తన పేరుపై అధికారికంగా రిజిస్ట్రేషన్ అయింది. కోర్టు తీర్పు ఉన్నప్పటికీ, ప్యాపిలి గ్రామ పంచాయతీ వైసీపీ మాజీ ఉపసర్పంచ్ గరం భువనేశ్వర్‌రెడ్డి తన అనుచరులతో కలిసి స్థలం వద్దకు వచ్చి అక్రమంగా వేధింపులకు దిగుతున్నారు. ఈ స్థలం గురించి వదిలిపెట్టి వెళ్లాలి... లేకపోతే నిన్ను, నీ తోడబుట్టిన వారిని, నీ కూతురును చంపేస్తాం, నీకు దిక్కున్న చోట చెప్పుకో" అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

అన్నమయ్య జిల్లా పీలేరు మండలం మూడుపుల వేముల గ్రామానికి చెందిన పి. దిలీప్ కుమార్ విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామంలోని సర్వే నంబర్ 418/1 లో తనకి ఒక ఎకరం వారసత్వ భూమి ఉందన్నారు. గత 100 సంవత్సరాలకు పైగా (బ్రిటిష్ కాలం నుండి) తన తాత, తండ్రి, ప్రస్తుతం తాను ఈ భూమిలోనే వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాను. ఇటీవల కొందరు వ్యక్తులు సదరు భూమికి సంబంధించి నకిలీ పత్రాలు సృష్టించి, రికార్డులను తారుమారు చేసి అక్రమంగా 1-బీ, 10-1 పహాణీ కాపీలు పొందారు. సదరు భూమితో ఎలాంటి సంబంధం లేకపోయినా, తమపై తప్పుడు కేసులు పెట్టి ఉద్యోగాలు పోయేలా చేస్తామని, ప్రాణహాని తలపెడతామని తీవ్రంగా భయభ్రాంతులకు గురిచేస్తూ భూమిని ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ భూమి సమస్యను పరిష్కరించాలని కోరాడు.

నంద్యాలకు చెందిన ఈశ్వర్ బాబు విజ్ఞప్తి చేస్తూ..గంగా పద్మావతి నగర్ వద్ద సర్వే నంబర్ 739/3 లో తనకు 25 సెంట్ల స్థలం ఉందన్నారు. ఈ భూమిని 1989లోనే రిజిస్ట్రేషన్ చేయించుకొని తమ పూర్తి స్వాధీనంలో ఉంచుకున్నాం. దీనికి సంబంధించిన హక్కు పత్రాలు, ఇసి, మున్సిపల్ ప్రాపర్టీ టాక్స్ రశీదులు, కరెంట్ బిల్లులు అన్నీ తన పేరిట స్పష్టంగా ఉన్నాయి. ఈ 25 సెంట్ల భూమిలో రిలయన్స్ టవర్ కు లీజు ఇచ్చిన భాగంతో పాటు, 7 సెంట్లలో భవన నిర్మాణం, మిగిలిన 14 సెంట్లలో పెద్ద రేకుల షెడ్లు నిర్మించి అద్దెకు ఇచ్చాం. ఇటీవల వైసీపీకి చెందిన గాజుల మహబూబ్ బాషా అనే వ్యక్తి తమను తీవ్రంగా బెదిరించడమే కాకుండా, తాము లేని సమయం చూసి అక్కడ ఉన్న భవనాలు, షెడ్లను అక్రమంగా కూల్చివేశాడు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

వైఎస్ఆర్ కడప జిల్లా వేముల మండలం నల్లచెరువుపల్లె గ్రామానికి చెందిన కస్తూరి రామన్న విజ్ఞప్తి చేస్తూ..సర్వే నెంబర్ 217లో తనకు 4.86 ఎకరాల వ్యవసాయ భూమి (ఖాతా సంఖ్య: 932) ఉందన్నారు. తాను తన సొంత పొలంలోకి వెళ్లి వ్యవసాయ పనులు చేసుకోకుండా ఒక వ్యక్తి అడ్డుపడుతున్నాడు. ఆ భూమిని అక్రమంగా దక్కించుకోవాలనే దురుద్దేశంతోనే బెదిరిస్తూ అడ్డంకులు సృష్టిస్తున్నాడు. ఈ విషయంపై అధికారుల చుట్టూ తిరిగి తన భూమిని సర్వే చేసి, సరిహద్దు రాళ్లు వేయాలని పలుమార్లు విన్నవించినా ఇప్పటివరకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీనికి తోడు మరో వ్యక్తి అధికారులతో మాట్లాడి పంచాయితీ చేస్తామంటూ అడ్డుపడుతున్నారు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

వైఎస్ఆర్ కడప జిల్లా బద్వేలుకు చెందిన బిజివేముల రమణారెడ్డి విజ్ఞప్తి చేస్తూ..సర్వే నంబర్ 953, ప్లాట్ నంబర్లు 175, 176 లలో తాను సొంతంగా రెండు ఇళ్లను నిర్మించుకుని నివాసముంటున్నానని తెలిపారు. ఈ ఆస్తులకు సంబంధించి డి-ఫారమ్, మున్సిపాలిటీ ఇంటి పన్ను రశీదులు, ప్లాన్ అప్రూవల్, జెనిన్ సర్టిఫికేట్, విద్యుత్ మీటర్ కనెక్షన్లు అన్నీ చట్టబద్ధంగా తన పేరుమీదే ఉన్నాయి. అయితే సుబ్బారెడ్డి అనే వ్యక్తి కుట్రతో తప్పుడు పత్రాలు సృష్టించి ఇళ్లను ఆక్రమించుకోవాలని చూస్తున్నారు. పోలీసు అధికారులకు తనపై తప్పుడు అర్జీలు ఇస్తూ నిందారోపణలు చేస్తున్నారు. ఈ ఆక్రమణ కుట్రపై ఇప్పటికే జిల్లా కలెక్టర్, ఎస్పీ, తహసీల్దార్‌కు వినతిపత్రాలు అందించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి న్యాయం జరగలేదు. కావున తగు చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం రాయలపురంకు చెందిన డి. వెంకటమ్మ విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామంలోని ప్లాట్ నంబర్ 9 (3 సెంట్లు) స్థలంలో తన సోదరుడు (దివంగత కె. లక్ష్మయ్య), సోదరితో కలిసి రేకుల షెడ్డు వేసుకొని కొన్నేళ్లుగా నివాసముంటున్నామన్నారు. తన సోదరుడు లక్ష్మయ్య తన సంరక్షణ, వైద్య ఖర్చుల నిమిత్తం 14.11.1993న పెద్దమనుషుల సమక్షంలో ఈ స్థలాన్ని తనకు తనఖా రాసిచ్చారు. ఒప్పందం ప్రకారం నిర్ణీత సమయంలో డబ్బులు చెల్లించకపోవడంతో ఆ స్థలంపై తనకే పూర్తి హక్కులు దక్కాయి. నాలుగు సంవత్సరాల క్రితం లక్ష్మయ్య అనారోగ్యంతో మరణించగా, దహన సంస్కారాలు కూడా తానే నిర్వహించాను. లక్ష్మయ్య మరణించిన తర్వాత, అప్పలాయగుంట పాతకాలవ ప్రాంతానికి చెందిన ఒక గుర్తుతెలియని మహిళ వచ్చి తనకు లక్ష్మయ్యతో పెళ్లయిందని చెబుతూ గొడవ చేయడం ప్రారంభించింది. గతంలో పోలీసులు, రెవెన్యూ అధికారులు విచారించగా ఆ మహిళ వద్ద లక్ష్మయ్యతో వివాహానికి సంబంధించి ఎలాంటి సరైన ఆధారాలు లేకపోవడంతో ఆమెను వెనక్కి పంపారు. అయితే, గత నెల రోజులుగా ఆ మహిళ, ఆమె పిల్లలు వచ్చి తన ఇంటి వద్ద తీవ్ర స్థాయిలో దౌర్జన్యం చేస్తూ, తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించి ఇంటిని ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

కర్నూలు జిల్లా హోళగుంద మండలం మద్దిలింగదహళ్లి గ్రామానికి చెందిన కురువ వీరనాగప్ప విజ్ఞప్తి చేస్తూ.. గ్రామ రెవెన్యూ రికార్డుల ప్రకారం తనకు 3:50 ఎకరాల భూమి ఉండాలన్నారు. కానీ ప్రస్తుతం క్షేత్రస్థాయిలో తన అనుభవంలో 3:31 మాత్రమే ఉంది. మిగిలిన 19 సెంట్ల భూమి ఈ సమస్య పరిష్కారం కోసం విలేజ్ అసిస్టెంట్, సర్వేయర్, డిప్యూటీ తహసీల్దార్, తహసీల్దార్, ఆర్డీవో నుండి జిల్లా కలెక్టర్ స్థాయి వరకు పలుమార్లు వెళ్లి విన్నవించినా ఎవరూ స్పందించలేదు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

వీటితోపాటు పలువురు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరగా.. మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్ లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం ఆర్థికతోడ్పాటు కల్పించాలని మరికొందరు అభ్యర్థనలు అందించారు.

# పనులు సకాలంలో పూర్తి చేయకపోతే చర్యలు తప్పవు

- పోలవరం ఎడమ కాలువ, పుష్కర పనుల జాప్యంపై మంత్రి నిమ్మల ఆగ్రహం
- ఈ నెలలోనే అనకాపల్లికి గోదావరి జలాలు తరలించేలా వేగం పెంచాలని స్పష్టీకరణ
- అధికారులు, నిర్మాణ ఏజెన్సీలతో మంత్రి సమీక్ష



విజయవాడ (చైతన్యరథం): పోలవరం ఎడమ కాలువ, పుష్కర ఎత్తిపోతల పథకం పైప్ లైన్ పనులు సకాలంలో పూర్తి చేయకపోతే అధికారులు, నిర్మాణ ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకుంటామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు హెచ్చరించారు. మంగళవారం విజయవాడ క్యాంపు కార్యాలయంలో పోలవరం ఎడమ కాలువ, పుష్కర ఎత్తిపోతల పథకం పైప్ లైన్ నిర్మాణ పనులపై అధికారులు, ఏజెన్సీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జలవనరుల శాఖ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ శశిభూషణ్, ఇరిగేషన్ సలహాదారులు ఎం. వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి, పోలవరం ఎడమ కాలువ ఎస్ఈ ఏసుబాబు, ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పోలవరం ఎడమ కాలువ పనుల్లో భాగంగా అన్నవరం దగ్గర ఆరెంపూడి, బెండపూడి గ్రామాల దగ్గర జరుగుతున్న జాతీయ రహదారుల క్రాసింగ్ పనుల్లో భాగంగా నిర్మితమైన వంతెనలను ఇటీవలే క్షేత్రస్థాయిలో పరిశీలించిన మంత్రి నిమ్మల రామానాయుడు పనుల పురోగతి నత్తనడకన సాగుతుండటంపై అధికారులు, ఏజెన్సీల ప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి సైతం తీసుకెళ్ళి పనుల పురోగతిని ఆయనకు వివరించారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు మంగళవారం అధికారులు, ఏజెన్సీలతో మరో మారు సమావేశం నిర్వహించి, పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి వరకు గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తరలించడానికి ఉన్న అడ్డంకులు పూర్తి చేసేలా షెడ్యూల్ రూపొందించాలని, ఆదేశించారు.

హైవే క్రాసింగ్‌ల దగ్గర కొత్తగా నిర్మించిన వంతెనలతో, జాతీయ రహదారి అనుసంధానంపై, నేషనల్ హైవేస్ అథారిటీ అధికారులతో సంప్రదింపులు చేయాలని, అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల ప్రకారం ఈ నెలలోనే అనకాపల్లి వరకు గోదావరి జలాలు తీసుకెళ్ళేలా పనులు పూర్తి చేయాలి అని తేల్చి చెప్పారు. అదేవిధంగా పుష్కర లిఫ్ట్ స్కీం పైప్ లైన్ పనుల్లో జాప్యంపై అసహనం వ్యక్తం చేసిన మంత్రి నిమ్మల రామానాయుడు, ఆయా పనులు పూర్తి చేయడానికి షెడ్యూల్ ఇవ్వాలని, ఆయా షెడ్యూల్ లోగా పనులు పూర్తి చేయకపోతే అధికారులు, ఏజెన్సీలపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

## సీఎం చంద్రబాబు చీరాల పర్యటన విజయవంతం చేయాలి

**- బాపట్ల జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి పిలుపు**



బాపట్ల (చైతన్యరథం): జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఈ నెల 7 వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బాపట్ల జిల్లా చీరాల మండలం కొత్తపేట ప్రాంతానికి వస్తున్నారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. నేతన్న సేవలో పథకం ద్వారా చేనేతలకు నగదు పంపిణీ కార్యక్రమాన్ని చీరాలలో ముఖ్యమంత్రి ప్రారంభిస్తారన్నారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలను జిల్లా కలెక్టర్, ఎస్పీ, ప్రజా ప్రతినిధులతో కలిసి మంత్రి పార్థసారథి మంగళవారం పరిశీలించారు. సభా వేదిక, హెలిప్యాడ్, చేనేతలతో మాట్లాడే ప్రాంతాలలో ఏర్పాట్లను పరిశీలించారు. ఎక్కడ ఎలాంటి సమస్యలు రాకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి మార్గ నిర్దేశం చేశారు. ముందుగా చేనేత పెద్దలతో సమావేశమయ్యారు. తదుపరి మీడియాతో మంత్రి మాట్లాడారు.

ఎన్నికల్లో హామీలు ఇవ్వకపోయినా చేనేతల కష్టాలను గుర్తించిన ముఖ్యమంత్రి చేనేతలకు వరాలు కురిపించారని మంత్రి తెలిపారు. చేనేతలు పడుతున్న కష్టాలను గుర్తించి వారికి సంక్షేమ ఫలాలు అందించే ప్రక్రియకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారన్నారు. ఈ పథకంలో భాగంగా చేనేతలకు రూ.25 వేలు ఆర్థిక సహాయం అందిస్తారన్నారు. దాదాపు 50వేల మంది పైగా చేనేతలకు నగదు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అలాగే 50 ఏళ్లు దాటిన చేనేతలకు ప్రతి నెల రూ.నాలుగు వేలు చొప్పున పింఛన్ ఇస్తున్నారని, హ్యాండ్లూమ్ వినియోగించే చేనేతలకు 200 యూనిట్లు, అలాగే పవర్ లూమ్ వినియోగించే చేనేతలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ ను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. చేనేతల ఉద్యమకారుడు ప్రగడ కోటయ్య స్వగ్రామం చీరాల కావడంతోనే రాష్ట్ర ముఖ్యమంత్రి వస్తున్నారని స్పష్టం చేశారు. చేనేతల సంక్షేమ కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం సమర్థంగా అమలు చేస్తున్నట్లు వివరించారు. ఒకప్పుడు అభివృద్ధికి నోచుకోని కోస్తా ఆంధ్ర భవిష్యత్తులో గ్రోత్ ఇంజన్ లా మారుతోందని చెప్పారు. ముఖ్యంగా పర్యాటక రంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అభివృద్ధి లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తోందన్నారు. ఇందులో భాగంగా కోస్తా తీర ప్రాంతాల రహదారులను అనుసంధానం చేస్తూ అభివృద్ధిలోకి నడిపిస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్ టైల్స్ కమిషనర్ రేఖరాణి, జిల్లా ఎస్పీ బి.ఉమా మహేశ్వర్, స్థానిక ఎమ్మెల్యే మద్దలూరి మాలకొండయ్య, బుడా చైర్మన్ సీహెచ్ రాజశేఖర్ బాబు, చీరాల, బాపట్ల, రేపల్లె ఆర్డీఓ లు నరసింహారావు, ఏ.హరి కుమార్, బి.శ్రీదేవి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు భాషకు మండలి కృషి చిరస్మరణీయం

**- రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ నివాళి**

**- విజయవాడలో ఘనంగా మండలి వెంకట కృష్ణారావు శత జయంతి ముగింపు వేడుకలు**



విజయవాడ (చైతన్యరథం): తెలుగు భాష, సంస్కృతి, విద్యాభివృద్ధి, గ్రామీణాభివృద్ధి, సామాజిక సేవా రంగాల్లో దివంగత మండలి వెంకటకృష్ణారావు చేసిన కృషి చిరస్మరణీయమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ కొనియాడారు.

రాష్ట్ర సృజనాత్మక సంస్కృతి సమితి (భాష, సాంస్కృతిక శాఖ), మండలి వెంకట కృష్ణారావు అధికార భాషా సంఘం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సంయుక్త నిర్వహణలో దివంగత మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు శత జయంతి ముగింపు వేడుకలు విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో మంగళవారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి భారత మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా విచ్చేయగా, రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఏపీ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమా, విజయవాడ ఈస్ట్ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ గౌరవ అతిథులుగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన మండలి వెంకట కృష్ణారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ప్రాంగణంలో ఆయన కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించి, ఆధునిక ఆంధ్రప్రదేశ్ రాజకీయ, సాంస్కృతిక, విద్యా రంగాల్లో ఆయన అందించిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ..రాష్ట్ర అధికార భాషా సంఘానికి మండలి వెంకట కృష్ణారావు పేరు పెట్టడమే కాకుండా, ఆయన శత జయంతి ఉత్సవాలను ప్రభుత్వం తరపున అధికారికంగా నిర్వహించడం ఎంతో సముచితం, గౌరవప్రదమని పేర్కొంటూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నాడు విద్యాశాఖ మంత్రిగా మండలి వెంకట కృష్ణారావు తెచ్చిన విప్లవాత్మక సంస్కరణల ఫలితంగానే రాజమహేంద్రవరంలో కందుకూరి వీరేశలింగం పంతులు పేరిట ఒక కళాశాల, ఆయన సతీమణి రాజ్యలక్ష్మి పేరిట మహిళా కళాశాలలు ఏర్పాటయ్యాయని, నేడు అవి ప్రఖ్యాత విద్యా కేంద్రాలుగా విలసిల్లుతున్నాయని గుర్తుచేశారు. తొలి ప్రపంచ తెలుగు మహాసభలను అత్యంత విజయవంతంగా నిర్వహించి, తెలుగు భాషకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చిన దిట్ట మండలి వెంకట కృష్ణారావు అని కొనియాడారు. తండ్రి ఆశయాలకు అనుగుణంగా ఆయన తనయుడు మండలి బుద్ధ ప్రసాద్ అదే బాటలో పయనిస్తుండటం ప్రశంసనీయమన్నారు.అలాగే తెలుగు భాషా వికాసానికి, ఉనికికి నిరంతరం కృషి చేస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సేవలను ప్రత్యేకంగా ప్రశంసించారు. ఆయన భాషలో, ఆహార్యంలో తెలుగుదనం ఉట్టిపడుతుందని పేర్కొన్నారు.

మండలి వెంకట కృష్ణారావుతో పాటు ఎన్టీఆర్, వెంకయ్య నాయుడు, మండలి బుద్ధ ప్రసాద్ వంటి వారి కృషికి ధన్యవాదాలు తెలుపుతూ, తెలుగు భాషా వికాసానికి, సంస్కృతీ సాంప్రదాయాల పరిరక్షణకు తమ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని స్పష్టం చేశారు. పద్య నాటకాలు, జానపద కళారూపాలను నేటి తరానికి అందించేందుకు శాయశక్తులా కృషి చేస్తామన్నారు. తాను సాంస్కృతిక శాఖ మంత్రిగా వెంకట కృష్ణారావు ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని మంత్రి దుర్గేష్ భావోద్వేగంతో వెల్లడించారు.

సభ అనంతరం 'మహా పురుషుడు మండలి' నాటక ప్రదర్శన వీక్షకులను అలరించింది. ఈ సందర్భంగా 'అజాతశత్రువు ఆదర్శ నేత మండలి వెంకటకృష్ణారావు' మరియు 'కృష్ణా మండలి' గేయ కావ్య గ్రంథాలను ఆవిష్కరించారు. అలాగే వివిధ రంగాల్లో సేవలందించిన ప్రముఖులకు 'మండలి వెంకటకృష్ణారావు భాషా సాంస్కృతిక సేవ పురస్కారాలు' అందజేశారు.

ఈ వేడుకల్లో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, మండలి వెంకటకృష్ణారావు అధికార భాషా సంఘం అధ్యక్షుడు పూల త్రివిక్రమరావు, సాంస్కృతిక సృజనాత్మక సమితి చైర్‌పర్సన్ పొడపాటి తేజస్విని, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ల మల్లికార్జునరావు, తదితర ప్రముఖులు, తెలుగు భాషాభిమానులు, అధికారులు పాల్గొన్నారు.

## నీటి ఎద్దడి తీవ్రంగా ప్రాంతాల్లో..

# మరింత వేగంగా జల్ జీవన్ పనులు

- తీర ప్రాంత తాగునీటికి జల్ జీవన్ భద్రత
- లక్ష్యం దిశగా అమరజీవి జలధార మెగా వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుల పనులు
- రెండు ప్రాజెక్టుల కింద పురోగతిలో రూ.270 కోట్ల విలువైన పనులు
- ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో ప్రాజెక్టుల పురోగతిపై సమీక్షించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్
- నాణ్యత ప్రమాణాలను స్వయంగా పరిశీలిస్తానని స్పష్టీకరణ



అమరావతి (చైతన్యరథం): ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పరిధిలో జల్ జీవన్ మిషన్ కింద అమరజీవి జలధార ప్రాజెక్టు ద్వారా ఆయా జిల్లాల పరిధిలోని తీర ప్రాంత గ్రామాల తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం లభించనుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, గ్రామీణ తాగునీటి సరఫరా శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలో 33 లక్షల మందికి దాహార్తి తీర్చే బలమైన సంకల్పాన్ని ఈ ప్రాజెక్టుల ద్వారా ముందుకు తీసుకువెళ్తున్నామని తెలిపారు. నిర్ణీత గడువులోపు ముఖ్యమైన నిర్మాణాలు పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని అధికారులను ఆదేశించారు. నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడ జల్ జీవన్ పనుల వేగం మరింత పెంచాలని స్పష్టం చేశారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పరిధిలో చేపట్టిన జల్ జీవన్ మిషన్ ప్రాజెక్టుల పురోగతిపై పవన్‌కళ్యాణ్ మంగళవారం సమీక్షించారు. ఇన్ టేక్ వెల్స్, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, రిజర్వాయర్లతోపాటు పైప్‌లైన్ల నిర్మాణం వంటి కీలక పనుల పురోగతికి సంబంధించిన వివరాలపై ఆర్.డబ్ల్యు.ఎస్. అధికారులతో సమీక్షించారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో రూ.3,050 కోట్లతో చేపట్టిన పనులు నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా సాగుతుండడంపట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

### పనుల పురోగతి వివరాలు ఎంఎల్‌డీ

ఈ సమీక్షలో పనుల వివరాలను అధికారులు తెలియజేశారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో రూ.1,650 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన మెగా వాటర్ గ్రిడ్ పథకాన్ని 10 నియోజక వర్గాల పరిధిలో సుమారు 20 లక్షల మందికి తాగునీరు అందించే లక్ష్యంతో ప్రారంభించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి రెండు ఇంటేక్ వెల్స్, యాక్సెస్ బ్రిడ్జిల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నట్టు అధికారులు తెలిపారు. 111 ఎంఎల్‌డీ, 75 ఎంఎల్‌డీ సామర్థ్యాలతో ఏర్పాటు చేస్తున్న నీటి శుద్ధి కేంద్రాల్లో ఒకటి నిర్మాణ దశలో ఉన్నట్టు వివరించారు. ఇప్పటి వరకు ఈ ప్రాజెక్టు కోసం రూ.151 కోట్లకు పైగా ప్రభుత్వం వెచ్చించగా, 182 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ నిర్మాణం పూర్తయింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో రూ.1,400 కోట్లతో చేపట్టిన ప్రాజెక్టు ద్వారా సుమారు 13.50 లక్షల మందికి తాగునీటి కష్టాలు తీరనున్నాయి. దీనికి సంబంధించి ఇంటేక్ వెల్, యాక్సెస్ బ్రిడ్జి, 155 మిలియన్ లీటర్ల సామర్థ్యం కలిగిన నీటి శుద్ధి ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయి. రెండు పథకాల కింద సుమారు 400 కిలోమీటర్ల పైప్‌లైన్ నిర్మాణం పూర్తయినట్టు అధికారులు తెలిపారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "ఉభయ గోదావరి జిల్లాల పరిధిలోని గ్రామీణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించే లక్ష్యంతో గత ఏడాది డిసెంబర్‌లో పశ్చిమ గోదావరి జిల్లా పెరవలిలో రూ.3,050 కోట్ల అంచనా వ్యయంతో అమరజీవి జలధారకు శ్రీకారం చుట్టాం. రెండు మెగా వాటర్ గ్రిడ్ పథకాల నిర్మాణంలో కీలకమైన ఇంటేక్ వెల్స్, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, రిజర్వాయర్లు, పైప్‌లైన్ నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయి. పనులన్నీ నిర్ణీత గడువులోపు పూర్తి చేసేలా సంబంధిత శాఖలతో సమన్వయంతో పని చేయాలి.

### ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్లతో నిరంతర పర్యవేక్షణ

కేటాయింపుల ప్రక్రియ పూర్తయ్యి నత్తనడకన నడుస్తున్న పనులపై దృష్టి సారించాలి. ముఖ్యంగా పైపు లైన్ల నిర్మాణానికి సంబంధించి ఇతర శాఖల అనుమతులు పెండింగ్ లో ఉంటే ఆ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలి. ఆర్ అండ్ బి, జాతీయ రహదారి అథారిటీ, పంచాయతీరాజ్ శాఖలు, అవసరం ఉన్న చోట అటవీశాఖలతో సమన్వయం చేసుకుంటూ, పనులు సకాలంలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్ల ద్వారా పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, రాష్ట్ర కార్యాలయానికి సమాచారం ఇవ్వాలి. ముఖ్యంగా నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న తీర ప్రాంత గ్రామాల్లో పనుల వేగం పెంచాలి. అదే సమయంలో నిర్మాణ పనుల నాణ్యతలో రాజీ పడవద్దు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన జల్ జీవన్ మిషన్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలన చేపడతా. నిర్మాణ పనులకు సంబంధించి నాణ్యతాపరమైన తనిఖీలు స్వయంగా నిర్వహిస్తాం. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించే విధంగా చర్యలు చేపడతామని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.

# వైసీపీ కుట్ర వమ్ము చేసిన హైకోర్టు

- డీఎస్సీపై పిల్‌ను హైకోర్టు తిరస్కరించడాన్ని స్వాగతించిన మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి
- డీఎస్సీ నియామకాలు పూర్తి పారదర్శకంగా నిర్వహించామని స్పష్టీకరణ
- ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించని వైసీపీకి మాట్లాడే నైతిక హక్కు లేదని ఆగ్రహం
- 10,060 ఉద్యోగాలతో జాబ్ క్యాలెండర్ విడుదల చేసామని వెల్లడి
- కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు అన్నివేళలా అండగా నిలబడుతుందని భరోసా



అమరావతి (చైతన్యరథం): డీఎస్సీ నియామక ప్రక్రియకు సంబంధించి వైసీపీ నేతలు దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని(పిల్) హైకోర్టు తిరస్కరించడం పై రోడ్లు, భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. డీఎస్సీ ప్రక్రియను అడ్డుకోవాలనే ఉద్దేశంతో వైసీపీ కుట్రపూరితంగా కోర్టుల్లో కేసులు వేయించిందని ఆయన మండిపడ్డారు.

రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం ప్రజా ప్రయోజన వ్యాజ్యాలను వినియోగించడం వైసీపీ రాజకీయ దివాలా కోరుతనానికి నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. రాజకీయ లబ్ధి కోసం చేసిన ప్రయత్నాలకు హైకోర్టు తిరస్కరణ చెంపపెట్టులా నిలిచిందని అన్నారు. డీఎస్సీ అభ్యర్థుల పేరుతో వైసీపీ చేస్తున్న కుట్రలను న్యాయస్థానం భగ్నం చేయడాన్ని స్వాగతించాలన్నారు.

నిరుద్యోగులకు మేలు జరిగేలా కూటమి ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా డీఎస్సీ నియామకాల ప్రక్రియను చేపట్టిందని మంత్రి స్పష్టం చేశారు. వైసీపీ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, అర్థరహితమైనవని ఆయన పేర్కొన్నారు. అభ్యర్థుల నుంచి వచ్చిన అభ్యంతరాలను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే తుది ఫలితాలను విడుదల చేశామని మంత్రి వెల్లడించారు.

ఐదేళ్ల పాలనలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించని వైసీపీకి ఈ అంశంపై మాట్లాడే నైతిక అర్హత లేదని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్న చరిత్ర వైసీపీదేనని పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో విద్యా రంగంలో విప్లవాత్మక సంస్కరణలు అమలు చేస్తున్నామని తెలిపారు.

డీఎస్సీలో ఎంపికైన 16 వేల మంది ఉపాధ్యాయుల కష్టాన్ని అవమానించేలా వైసీపీ వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. డీఎస్సీ నిర్వహణపై ఏవైనా సందేహాలు ఉంటే వైసీపీ నేతలు బహిరంగ చర్చకు రావాలని మంత్రి సవాల్ విసిరారు. మెగా డీఎస్సీ విజయాన్ని చూసి వైసీపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. కోర్టు కేసుల ద్వారా డీఎస్సీ ప్రక్రియను అడ్డుకునేందుకు ప్రయత్నించింది వైసీపీ కాదా అని మంత్రి ప్రశ్నించారు.

యువతకు ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగుల కోసం 10,060 ఉద్యోగాలతో జాబ్ క్యాలెండర్ విడుదల చేశామని, నాలుగు దశల్లో ఉద్యోగాల భర్తీ ప్రక్రియ చేపట్టనున్నామని మంత్రి వెల్లడించారు. ఏటా జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పి యువతను మోసం చేసింది మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కాదా అని ప్రశ్నించారు. వైసీపీ సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న తప్పుడు ప్రచారాలను నిరుద్యోగులు నమ్మే పరిస్థితి లేదన్నారు. యువత భావోద్వేగాలతో ఆడుకోవడం వైసీపీకి అలవాటుగా మారిందని, యువత భవిష్యత్తు కంటే రాజకీయ స్వార్థానికే ప్రాధాన్యం ఇస్తోందని మండిపడ్డారు.

తప్పుడు ప్రచారాలతో యువతను తప్పుదోవ పట్టించడం సాధ్యం కాదని, కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు అన్ని విధాలా అండగా నిలుస్తుందని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి స్పష్టం చేశారు.

# మనమిత్ర ద్వారా 'సదరం' స్లాట్ బుకింగ్

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలోని దివ్యాంగులు సదరం సర్టిఫికెట్లు మరింత సులభంగా పొందడానికి వీలుగా ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్ విధానాన్ని ప్రభుత్వం మరింత సరళతరం చేసింది. దివ్యాంగులు ఇకపై సదరం స్లాట్ బుకింగ్ కోసం మీ సేవా కేంద్రాలు, స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేదు. మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా వారు తామున్న చోటు నుంచి కేవలం తమ మొబైల్ ఫోను ద్వారా ఇకపై ఈ పనులు నిర్వహించుకోవచ్చు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల ప్రకారం దివ్యాంగుల కోసం సదరం సేవలను మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పొందే వీలు కల్పించినట్లు రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) ఒక ప్రకటనలో తెలిపింది. దీనివల్ల దివ్యాంగులు ఇకపై సదరం స్లాట్ బుకింగ్, స్లాట్ లభ్యత సమయం, సర్టిఫికెట్ డౌనులోడు సేవల కోసం వారు ఏ కార్యాలయానికి వెళ్లనవసరం ఉండదు. వారున్న చోటు నుంచే తమ మొబైల్ ఫోనులోని మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా క్షణాల్లో ఈ పనులు చక్కబెట్టుకోవచ్చని ఆర్టీజీఎస్ అధికారులు తెలిపారు.

### ఎలా తెలుసుకోవచ్చు అంటే..

ముందుగా మొబైల్ నంబరులోని వాట్సాప్ ఓపెన్ చేయాలి. అందులో మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ నంబర్ 9552300009 కు హాయ్ అని మెసేజ్ పంపాలి. తర్వాత మొబైల్ ఫోనులో కనిపించే సిటిజన్ సర్వీసుల్లో సదరం సర్వీసులను ఎంపిక చేసుకోవాలి. అందులో సదరం స్లాట్ అవైలబిలిటీ, సదరం స్లాట్ బుకింగ్, సదరం సర్టిఫికెట్ డౌన్ లోడ్ అనే మూడు ఆప్షన్లు కనిపిస్తాయి. అందులో ఏది అవసరమైతే దాన్ని ఎంపిక చేసుకోవాలి. అందులో స్లాట్ బుకింగ్ చేసుకోవాలనుకుంటే స్లాట్ బుక్ చేసుకోవచ్చు. సదరం సర్టిఫికెట్ కావాలంటే ఉన్న చోటునుంచే సర్టిఫికెట్ డౌన్‌లోడు చేసుకోవచ్చు. సదరం స్లాట్లు ఎప్పుడు అందుబాటులో ఉన్నాయో కూడా తెలుసుకోవచ్చు. అక్కడ ఆ సేవలు పొందడానికి కావాల్సిన వివరాలు పొందుపరిస్తే వెంటనే నిమిషాల్లో ఆ సేవలను మొబైల్ ద్వారా పొందే వీలుంటుంది. దివ్యాంగులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

# బీసీ రక్షణ చట్టానికి తుదిరూపు

- నేడు విజయవాడలో కీలక భేటీ
- హాజరుకానున్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు
- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత వెల్లడి

అమరావతి (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా బీసీ రక్షణ చట్టానికి తుది రూపు ఇవ్వడానికి సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా విజయవాడలోని ఓ హోటల్‌లో బుధవారం కీలక సమావేశం నిర్వహించనున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బీసీలను అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేలా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. దీనిలో భాగంగా, బీసీ రక్షణ చట్టాన్ని తీసుకురావడానికి చర్యలు ప్రారంభించామన్నారు. బీసీలను కులాలు, వృత్తుల పేరుతో దూషించినా, వారిపై దాడులకు, దౌర్జన్యాలకు దిగినా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం మాదిరిగా రక్షణ చట్టం రూపొందిస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. బీసీలపై జరిగే దాదాపు 15 రకాల దాడులు, వేధింపులను ఈ చట్టం కింద నేరాలుగా గుర్తిస్తామన్నారు. బీసీ రక్షణ చట్టంలో భాగంగా కేసుల సత్వర పరిష్కారానికి ప్రత్యేక కోర్టులు కూడా ఏర్పాటు చేయనున్నామన్నారు. గత సాధారణ ఎన్నికల ముందు అధికారంలోకి వచ్చిన తరవాత బీసీ రక్షణ చట్టం తీసుకొస్తామని సీఎం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ, ఇప్పటికే చట్ట రూపకల్పనకు కేబినెట్‌లో ఉన్న ఎనిమిది మంది బీసీ మంత్రులు పలు పర్యాయాలు భేటీ అయ్యామన్నారు. భారత రాజ్యాంగానికి లోబడి పలు చట్టాలను పరిశీలించి, అధికారులు బీసీ రక్షణ చట్టానికి తుది రూపు తీసుకొచ్చారన్నారు. ఈ ముసాయిదా చట్టాన్ని తుదిరూపు ఇచ్చే క్రమంలో బీసీ సామాజిక వర్గానికి



ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, మంత్రులతో విజయవాడలోని మురళీ ఫార్చ్యూన్ లో బుధవారం కీలక భేటీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో తనతో పాటు ఏడుగురు బీసీ మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్ యాదవ్, కొలుసు పార్థసారథి, వాసంశెట్టి సుభాష్, కొండపల్లి శ్రీనివాస్ సహా హోం మంత్రి అనిత, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ కూడా హాజరుకానున్నారన్నారు. వారితో పాటు బీసీ సామాజిక వర్గానికి చెందిన 30 మంది ఎమ్మెల్యేలు, నలుగురు ఎమ్మెల్సీలు, ఆరుగురు ఎంపీలు ఈ సమావేశం పాల్గొననున్నట్లు తెలిపారు. వారిచ్చే సూచనలు, సలహాలు పరిగణలోకి తీసుకుని బీసీ రక్షణ చట్టానికి తుది రూపు ఇచ్చి, సీఎం చంద్రబాబునాయుడుకు అందజేయనున్నామన్నారు. బీసీల అభ్యున్నతికి, గౌరవ ప్రదమైన జీవనానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. దేశంలోనే బీసీలకు సంబంధించి ప్రత్యేక రక్షణ చట్టం తెస్తున్న తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలవనుందని మంత్రి సవిత తెలిపారు.

# తెలుగుజాతి గర్వించేలా అమరావతి



- మంత్రులు అనగాని సత్యప్రసాద్, సవిత ఉద్ఘాటన
- 2028 నాటికి ఐకానిక్ నిర్మాణాలు పూర్తి
- అద్భుతంగా మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల నివాసాలు
- జోరుగా రాజధాని రహదారుల నిర్మాణాలు
- ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోనున్న సీఎం చంద్రబాబు
- మంత్రి నారా లోకేశ్‌తో జగన్‌కు పోలికే లేదు
- అమరావతిలో పనులు పరిశీలించిన మంత్రులు అనగాని, నారాయణ, సవిత

అమరావతి (చైతన్యరథం): తెలుగు జాతి గర్వించేలా రాజధాని అమరావతిని సీఎం చంద్రబాబు నిర్మిస్తున్నారని, 2028 ఆగస్టు నాటికి మొదటి విడత నిర్మాణాలు పూర్తి చేస్తామని రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్,ఎస్ సవిత తెలిపారు. అబద్ధపు పునాదులపై ఏర్పడిన వైసీపీ ఆనాడు అమరావతి గ్రాఫిక్స్ అని తప్పుడు ఆరోపణలు చేసి పబ్బం గడుపుకుందన్నారు. గ్రాఫిక్స్ కు, వాస్తవాలకు జగన్ కు తేడా తెలియదా.. అని ప్రశ్నించారు. జగన్ విధ్వంసపు క్రెడిట్ ఎవ్వరికీ అక్కర్లేదని, తమ ప్రభుత్వానికి చేసిన అభివృద్దే క్రెడిట్ అని స్పష్టం చేశారు. చదువు గురించి జగన్ ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదని, స్టాన్ ఫోర్డ్ యూనివర్శిటీలో చదువుకున్న మంత్రి నారా లోకేశ్ తో ఆయనకెంటి పోలికని ఎద్దేవా చేశారు. రాజధాని అమరావతి పనులను మంత్రులు అనగాని సత్యప్రసాద్, పొంగూరు నారాయణ, ఎస్.సవిత మంగళవారం పరిశీలించారు. తొలుత మంత్రుల నివాసాలను తరవాత సచివాలయం, హెచ్ఓడీ ఐకానిక్ టవర్లను, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల టవర్లను పరిశీలించారు. ఇప్పటికే పూర్తయిన మంత్రులు,ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల నివాసాల్లో ఏర్పాటుచేసిన సౌకర్యాలపై మంత్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తమను కలిసిన విలేకరులతో మాట్లాడారు. ముందుగా మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ, అబద్ధపు పునాదులపై ఏర్పడిన వైసీపీ అమరావతిలో గ్రాఫిక్స్ నిర్మాణాలంటూ తప్పుడు ప్రచారాలు చేసిందన్నారు. గ్రాఫిక్స్ కు, వాస్తవాలకు జగన్‌కు తేడా తెలియదా.. అని ప్రశ్నించారు. చదువు గురించి జగన్ ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదన్నారు. స్టాన్ ఫోర్డ్ యూనివర్సిటీలో చదువుకున్న ఉన్నత విద్యావంతుడు మంత్రి నారా లోకేశ్ తో జగన్‌కు పోలికే లేదన్నారు. మంత్రి నారా లోకేశ్ ఎందుకు రాజీనామా చేయాలని వైసీపీనుద్దేశించి మంత్రి అనగాని ప్రశ్నించారు. విద్యా రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చినందుకా... రాష్ట్రానికి భారీ ఎత్తున పెట్టుబడులు తీసుకొస్తున్నందుకా.. అని నిలదీశారు. మెగా డీఎస్సీపై తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని వైసీపీ నేతలకు హితవు పలికారు.

### 2028 నాటికి అమరావతి సిద్ధం

తెలుగుజాతి గర్వించేలా అమరావతి నిర్మాణాన్ని సీఎం చంద్రబాబు చేపట్టారని మంత్రి సవిత తెలిపారు. సచివాలయం, హెచ్ఓడీ టవర్లతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నివాసాలు అద్భుతం నిర్మిస్తున్నారన్నారు. ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నివాసాలు పూర్తయ్యాయని, ఈ నెల 15 తేదీన జీఏడీకి అప్పగించనున్నారని తెలిపారు. 2028 నాటికి సచివాలయం, హైకోర్టు, అసెంబ్లీ తదితర ఐకానిక్ భవనాల నిర్మాణాలను పూర్తి చేయబోతున్నామన్నారు. రాజధాని పనుల్లో ముఖ్యమైన రోడ్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ప్రజలకు అన్ని సేవలు ఒకేచోట లభించేలా సచివాలయం, హెచ్ ఓడీ కార్యాలయాలను నిర్మిస్తున్నామన్నారు. గతంలో హైటెక్ సిటీ, సైబరాబాద్ ను నిర్మించిన సీఎం చంద్రబాబునాయుడు అమరావతిని కూడా పూర్తి చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని మంత్రి సవిత కొనియాడారు.

### జగన్ ది విధ్వంసం... మాది అభివృద్ధి

ప్రపంచం మెచ్చేలా గ్రీన్ ఫీల్డ్ రాజధానిని సీఎం చంద్రబాబు నిర్మిస్తుండడం చూసి జగన్ ఓర్వలేకపోతున్నారని మంత్రి సవిత మండిపడ్డారు. జగన్ ది విధ్వంసం క్రెడిట్ అని , తమ ప్రభుత్వానికి అభివృద్ధి క్రెడిట్ అని అన్నారు. రప్పా రప్పా నరకడం, విధ్వంసం, దోపిడీ, అరాచకం ఇవి జగన్ క్రెడిట్ అని అన్నారు. ఆ క్రెడిట్ ను ఎవ్వరూ ఆశించరన్నారు. ప్రజలు ఛీ కొట్టడంతో ఇప్పుడు మావిగన్ అంటూ మరో డ్రామా ఆడుతున్నారన్నారు. మావిగన్ ఎక్కడుందో కూడా తెలియని అజ్ఞాని జగన్ అని విమర్శించారు. నిరసనల పేరుతో రాష్ట్రంలో జగన్, వైసీపీ నాయకులు విధ్వంసం సృష్టిస్తున్నారని మంత్రి సవిత మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.


# మంత్రి నారాయణకు క్రెడాయ్ ప్రతినిధుల అభినందనలు

అమరావతి (చైతన్యరథం): పురపాలక మంత్రి నారాయణను క్రెడాయ్ ఏపీ ప్రతినిధులు మంగళవారం కలిశారు. మంత్రికి అభినందనలు తెలిపి సన్మానించారు. భవన నిర్మాణ అనుమతుల్లో నిబంధనలు సులభతరం చేస్తూ ఇటీవల జీవో నంబర్161 జారీ చేసిన విషయం తెలిసిందే. మునిసిపల్ శాఖ నిబంధనలు సరళతరం చేయడంలో కీలకంగా వ్యవహరించినదుకు మంత్రి నారాయణను అభినందించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రియల్ ఎస్టేట్ రంగానికి ఎంతో ఊపు వచ్చిందని తెలిపారు.

డిక్లరేషన్ విధానం నుంచి సెట్ బ్యాక్‌ల తగ్గింపు వరకూ ప్రభుత్వం ఎంతో మేలు చేసిందని క్రెడాయ్ ఏపీ ప్రతినిధులు వెల్లడించారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణ వల్లే రియల్ ఎస్టేట్ పరిశ్రమ వృద్ధి చెందిందని కొనియాడారు. తిరుపతి, రాజమండ్రిలో త్వరలో నిర్వహించే క్రెడాయ్ ఎక్స్‌పోకు ముఖ్యఅతిథిగా హాజరుకావాలని మంత్రికి ఆహ్వానం పలికారు.

కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ మాస్టర్ ప్లాన్‌ను త్వరగా ఫైనలైజ్ చేయాలని క్రెడాయ్ ఏపీ ప్రతినిధులు కోరారు. మంత్రిని కలిసిన వారిలో క్రెడాయ్ ఏపీ చైర్మన్ బుడ్డిగ శ్రీనివాసు, జనరల్ సెక్రటరీ దాసరి రాంబాబు, ఇతర ప్రతినిధులు ఉన్నారు.

# ఉపరాష్ట్రపతికి 'అమరావతి విజన్' పుస్తకాన్ని అందజేసిన టీడీపీ ఎంపీలు



న్యూఢిల్లీ (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ సభ్యుల బృందం భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌ను దేశ రాజధానిలోని ఆయన కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి విజన్, పురోగతి, భవిష్యత్తు ప్రాధాన్యతలను వివరిస్తూ రూపొందించిన ప్రత్యేక పుస్తకాన్ని ఉపరాష్ట్రపతికి అందజేశారు.

ఈ కార్యక్రమంలో లోక్‌సభ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్, లోక్‌సభ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, తెన్నేటి కృష్ణప్రసాద్, దగ్గుమళ్ల ప్రసాదరావు, బస్తిపాటి నాగరాజు పాల్గొన్నారు. ఎంపీలతో ఎంతో ఆత్మీయంగా ముచ్చటించిన ఉపరాష్ట్రపతి, అమరావతిపై వారు చేపట్టిన ఈ చొరవను ప్రత్యేకంగా అభినందించారు.

# గుంటూరు సమీపంలో... రూ.100 కోట్లతో కేంద్ర యోగా పరిశోధన సంస్థ

- స్థలాన్ని పరిశీలించి ఓకే చెప్పిన కేంద్ర బృందం
- మూడు నెలల్లో మౌలిక వసతులు పూర్తిచేసి స్థలం అప్పగింత
- 100 పడకల ఆసుపత్రితో సమగ్ర వైద్య సేవలు.. 2028లో ప్రారంభం
- మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

గుంటూరు (చైతన్యరథం): గుంటూరు నగరానికి సమీపంలో ప్రత్తిపాడు మండలం నడింపాలెంలో 15.03 ఎకరాల్లో రూ.100 కోట్లతో కేంద్ర యోగా, ప్రకృతి వైద్య పరిశోధన సంస్థ (సీఆర్ఐవైఎన్) ఏర్పాటు కానుందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ అధికారిక బృందం మంగళవారం ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించి, ఆమోదం తెలిపిందన్నారు. మూడు నెలల్లో స్థల అభివృద్ధి, రహదారి, వర్షపు నీటి కాలువ, తదితర మౌలిక సదుపాయాల పనులు పూర్తిచేసి కేంద్ర ప్రభుత్వానికి అప్పగిస్తామని, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్మాణ పనులు వేగంగా జరుగుతాయని తెలిపారు. ఈ సంస్థ కార్యకలాపాలు 2028లో ప్రారంభమవుతాయని తెలిపారు.

### ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో

కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ పరిధిలోని సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ యోగా అండ్ నేచురోపతి (సీసీఆర్‌వైఎన్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఈ సెంట్రల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా అండ్ నేచురోపతి (సీఆర్ఐవైఎన్) దేశంలో యోగా, ప్రకృతి వైద్య రంగంలో అత్యున్నత పరిశోధనా సంస్థల్లో ఒకటని మంత్రి తెలిపారు. యోగా, ప్రకృతి వైద్య విధానాలపై శాస్త్రీయ పరిశోధనలు నిర్వహించడం, వాటి ప్రభావాన్ని నిర్ధారించడం, వైద్యులు, పరిశోధకులకు శిక్షణ ఇవ్వడం, ప్రజలకు ఆధునిక వైద్య సేవలు అందించడం ఈ సంస్థ ప్రధాన లక్ష్యమని వివరించారు.

### 100 పడకల ప్రత్యేక ఆసుపత్రి

సంస్థ ప్రాంగణంలోనే 100 పడకల యోగా–ప్రకృతి వైద్య ఆసుపత్రిని ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. జీవనశైలి వ్యాధులు, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలకు యోగా, ప్రకృతి వైద్యంతో సమగ్ర చికిత్స అందించడంతో పాటు పరిశోధన, చికిత్స, శిక్షణ సేవలు ఒకేచోట అందుబాటులో ఉంటాయన్నారు. అత్యాధునిక పరిశోధనా ప్రయోగశాలలు, ప్రత్యేక చికిత్సా విభాగాలు, శిక్షణా కేంద్రాలు, అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు ఈ ప్రాజెక్టులో భాగంగా ఏర్పాటవుతాయని చెప్పారు.

### ఇప్పటికే...

దేశంలో ఇప్పటికే హర్యానాలోని జజ్జర్, కర్ణాటకలోని నాగమంగళ, అస్సాంలోని డిబ్రూగఢ్



ప్రాంతాల్లో ఇలాంటి సంస్థలు పనిచేస్తున్నాయని, ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్, ఒడిశాలోని ఝజ్జీలో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఈ సంస్థ ఏర్పాటైతే యోగా, ప్రకృతి వైద్య రంగాల్లో పరిశోధన, వైద్య సేవలు, శిక్షణకు రాష్ట్రం జాతీయ స్థాయిలో కీలక కేంద్రంగా ఎదుగుతుందన్నారు.

నడింపాలెంలోని ప్రతిపాదిత స్థలం సంస్థ ఏర్పాటుకు పూర్తిగా అనుకూలమని కేంద్ర బృందం నిర్ధారించిందని మంత్రి తెలిపారు. దీంతో మూడు నెలల్లో స్థలాన్ని చదును చేయడం, రహదారి నిర్మాణం, వర్షపు నీటి కాలువ ఏర్పాటు తదితర మౌలిక వసతుల పనులు పూర్తి చేసి కేంద్ర ప్రభుత్వానికి అందజేయనున్నట్లు చెప్పారు.

### స్థలాన్ని పరిశీలించిన కేంద్ర బృందం

ప్రతిపాదిత స్థలాన్ని గుంటూరు జిల్లా కలెక్టర్ సీఎం సాయికాంత్ వర్మ, రాష్ట్ర ఆయుష్ శాఖ సంచాలకులు గోపాలకృష్ణ రోణంకి, కేంద్ర యోగా–ప్రకృతి వైద్య పరిశోధన మండలి సంచాలకులు డాక్టర్ జ్యోతి కేస్వానీ, కేంద్ర ఆయుష్ శాఖ సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ ప్రమోద్ వర్మ, పరిశోధన అధికారి డాక్టర్ ఎన్వీ జ్ఞానదీప్ తాటవర్తితో కలిసి పరిశీలించారు. స్థలం సరిహద్దుల వెంట వర్షపు నీరు ప్రవహిస్తున్నందున మూతలతో కూడిన సిమెంట్ కాలువ నిర్మించాలని నిర్ణయించారు. జాతీయ రహదారి–16 నుంచి ప్రభుత్వ భూమి మీదుగా 40 అడుగుల వెడల్పుతో ప్రత్యేక రహదారి నిర్మించాలని సూచించారు. జాతీయ రహదారి కంటే దిగువన ఉన్న ప్రాంతాలను మట్టితో నింపి చదును చేయడంతో పాటు, ప్రజా రవాణా సౌకర్యం కోసం సమీపంలో బస్‌స్టాప్ ఏర్పాటుకు కూడా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. జాతీయ రహదారి–16కు ఆనుకుని, గుంటూరు నగరానికి అత్యంత సమీపంలో ఉండటం ఈ ప్రాజెక్టుకు ప్రధాన అనుకూలతగా అధికారులు పేర్కొన్నారు.

---

# వనరుల సమర్థ వినియోగంతో.. పర్యాటక రంగం మరింత బలోపేతం



- ఏపీటీడీసీ ఛైర్మన్ డా.నూకసాని బాలాజీ
- బద్వేల్, కర్నూలులో ఆకస్మిక తనిఖీలు

బద్వేల్/కర్నూలు (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ఆధ్వర్యంలోని ప్రతి పర్యాటక వనరును ప్రజలకు నాణ్యమైన సేవలు అందించే విధంగా, రాష్ట్ర పర్యాటక రంగ అభివృద్ధికి దోహదపడే విధంగా సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని సంస్థ ఛైర్మన్ డా. నూకసాని బాలాజీ పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణతో పాటు వాటి సమర్థ వినియోగం ద్వారా రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

ఏపీటీడీసీ ఆధ్వర్యంలోని పర్యాటక ఆస్తుల నిర్వహణ, పరిరక్షణ, సేవల నాణ్యతను ప్రత్యక్షంగా సమీక్షించేందుకు ఛైర్మన్ డా.నూకసాని బాలాజీ మంగళవారం తెల్లవారుజామున వైఎస్సార్ కడపజిల్లా బద్వేల్ సమీపంలోని గోపవరం ఏపీటీడీసీ పర్యాటక భవనాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఎలాంటి పర్యాటక కార్యకలాపాలు నిర్వహించకపోవడం పట్ల ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో లీజుకు అప్పగించిన ఈ ఆస్తికి సంబంధించి లీజు గడువు ముగిసిన అనంతరం లీజుదారుడు గడువు పొడిగింపు కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ, స్థానిక పరిస్థితులను పరిశీలించిన అనంతరం అక్కడ ఎలాంటి పర్యాటక కార్యకలాపాలు నిర్వహించడటం లేదని గుర్తించి సంబంధిత అధికార యంత్రాంగం ఆ వినతిని తిరస్కరించిన విషయం ఛైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. తనిఖీ సందర్భంగా ప్రస్తుతం సెంచరీ ప్లైవుడ్ కంపెనీకి చెందిన కార్మికులు ఏపీటీడీసీ ఆస్తిని నివాసంగా వినియోగిస్తున్నట్లు గుర్తించారు. ప్రభుత్వ పర్యాటక ఆస్తిని ఈ విధంగా అనధికారికంగా వినియోగించడం ఏపీటీడీసీ నిబంధనలకు పూర్తిగా విరుద్ధమని డా. నూకసాని బాలాజీ స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వానికి చెందిన విలువైన పర్యాటక ఆస్తులు ప్రజల ప్రయోజనాల కోసం, రాష్ట్ర పర్యాటకాభివృద్ధి కోసం వినియోగించాల్సి ఉండగా, గత ప్రభుత్వ హయాంలో వాటి అభివృద్ధిపై దృష్టిసారించకుండా లీజుల పేరుతో ప్రభుత్వ ఆస్తులు దుర్వినియోగానికి గురయ్యాయని పేర్కొన్నారు. ఇటువంటి పరిస్థితులు పర్యాటక రంగ అభివృద్ధికి ఆటంకంగా మారుతున్నాయన్నారు. ఇలాంటి పరిస్థితి ఏర్పడినప్పటికీ సంబంధిత అధికారులు సకాలంలో గుర్తించి తగిన చర్యలు తీసుకోకపోవడం పై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, పర్యవేక్షణ, ఉద్దేశిత వినియోగం విషయంలో అధికారులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

అదేవిధంగా, గోపవరం పర్యాటక ఆస్తిని తిరిగి పర్యాటకాభివృద్ధికి అనుగుణంగా వినియోగంలోకి తీసుకురావడానికి తక్షణ కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం జరుగుతున్న అనధికారిక నివాస వినియోగంపై సమగ్ర నివేదిక సిద్ధం చేసి, నిబంధనల ప్రకారం అవసరమైన పరిపాలనా, చట్టపరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

### కర్నూలు హరిత హోటల్‌లో..

అనంతరం కర్నూలులోని వెంకటరమణ కాలనీలోని ఏపీటీడీసీ హరిత యూనిట్‌ను డా. నూకసాని బాలాజీ ఆకస్మికంగా సందర్శించి, వసతి గదులు , రెస్టారెంట్‌తో పాటు యూనిట్ పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అతిథులకు అందిస్తున్న సేవలు, నిర్వహణ, పరిశుభ్రత, వసతి సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా హరిత యూనిట్‌లోని లాన్‌లు, ఉద్యానవనాలు, పరిసరాలను అత్యంత పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా నిర్వహిస్తున్న తీరుపై సిబ్బందిని ప్రశంసించారు.

అనంతరం యూనిట్ మేనేజర్‌కు పలు సూచనలు చేస్తూ, భవిష్యత్తులో యూనిట్ ఆదాయాన్ని మరింత పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించి సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. అలాగే యూనిట్ ఆక్యుపెన్సీ రేషియో 85 శాతానికి ఏమాత్రం తగ్గకుండా ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టి, అతిథులకు మరింత నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు.

ఈ సందర్భంగా ఉద్యోగులతో ఆత్మీయంగా మాట్లాడిన ఛైర్మన్ డా.నూకసాని బాలాజీ.. ఏపీటీడీసీ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 62సంవత్సరాలకు పెంచే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సానుకూల నిర్ణయం తీసుకునేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

అదేవిధంగా, ఇప్పటికే పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు గ్రాట్యుటీ చెల్లింపుల అంశాన్ని త్వరలో నిర్వహించే బోర్డు సమావేశంలో చర్చించి తగిన నిర్ణయం తీసుకునేలా చర్యలు చేపడతామని తెలిపారు. పర్యాటక రంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్న ఆయన, అహోబిలం హరిత యూనిట్‌లో ల్యాండ్‌స్కేపింగ్ పనులను తక్షణమే చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే మహానంది హరిత యూనిట్ అభివృద్ధి కోసం సమగ్ర పునరుద్ధరణ ప్రతిపాదనలను సిద్ధం చేసి వెంటనే సమర్పించాలని సూపరింటెండింగ్ ఇంజినీర్‌ని ఆదేశించారు. ఈ ఆకస్మిక తనిఖీలో ఏపీటీడీసీ డివిజనల్ మేనేజర్ జి.లక్ష్మి నారాయణ, యూనిట్ మేనేజర్, ఇంజినీరింగ్ అధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

---

### ఉప ముఖ్యమంత్రి పవన్ చొరవ.. ఏలూరు డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనాలు

- రూ.12.60 కోట్ల నిధులు మంజూరు

అమరావతి (చైతన్యరథం): ప్రజా సమస్యలపై శ్రద్ధ.. పరిష్కారంలో చిత్తశుద్ధి చూపడంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ది ప్రత్యేక శైలి. విన్న సమస్య, గుర్తుపెట్టుకుని మరీ పరిష్కారం చూపుతారు. ఏలూరు డిగ్రీ కాలేజీ తరగతి గదుల లేమి సమస్య అదే కోవకు వస్తుంది. ప్రతిపక్ష నాయకుడిగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరంతర ప్రజా ప్రస్థానంలో భాగంగా జనవాణి, వారాహి యాత్రల్లో ఏలూరు డిగ్రీ కళాశాలలో కనీసం తరగతి గదులు లేక తాము పడుతున్న అవస్థలను విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. చెట్ల కింద పాఠాలు చెబుతున్న దైన్య స్థితిపై నాడు పవన్‌కళ్యాణ్ గళం విప్పారు. అలాగే దృష్టి లోపాలు ఉన్న విద్యార్థులు పడుతున్న అవస్థలు విని చలించారు. అధికారం చేపట్టిన తర్వాత సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతానని విద్యార్థి సంఘాలకు మాటిచ్చారు. ఇచ్చిన మాట నిలుపుకొంటూ ఏలూరు ప్రభుత్వ డిగ్రీకళాశాల శాశ్వత భవన నిర్మాణానికి రూ.12.60కోట్ల నిధులు మంజూరు చేయించారు. పవన్ కళ్యాణ్ చొరవ–ఉనికిని కోల్పోతున్న ఉన్నత విద్యాలయానికి కొత్త ఊపిరి ఇచ్చింది.

ఏలూరుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకి నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి ధన్యవాదాలు తెలియజేశారు.

# కృత్రిమ నిరుద్యోగ ఉద్యమాలను అడ్డుకుంటాం

- నిరుద్యోగ, యువజన, విద్యార్థి సంఘాల జేఏసీ నాయకుల ఉద్ఘాటన
- డీఎస్సీపై వైసీపీ తీరును తప్పు పట్టిన 17 సంఘాల జేఏసీ నాయకులు
- నిరుద్యోగుల పాలిట శాపంగా మారిన ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలన
- నేడు సక్రమంగా ఉద్యోగాల భర్తీ జరుగుతుంటే అడ్డుకునే కుటిల యత్నాలు
- అలజడులు, అబద్ధాలతో తప్పుడు ప్రచారం, యువత వైసీపీ వలలో పడొద్దు
- జాబ్ క్యాలెండర్ అంశంపై కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపిన నాయకులు
- డీఎస్సీపై పిల్‌ను హైకోర్టు తిరస్కరించటంపై హర్షం



అమరావతి (చైతన్యరథం): మెగా డీఎస్సీపై వైసీపీ చేస్తున్న విష ప్రచారాన్ని ఖండిస్తూ నిరుద్యోగ సంఘాలు, యువజన, విద్యార్థి సంఘాల జేఏసీ అధ్వర్యంలో మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ విద్యార్థి సంఘాలు, యువజన సంఘాలు, నిరుద్యోగ యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా ఆరు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా 17 సంఘాల జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. డీఎస్సీపై వైసీపీ నాయకుల తీరును తప్పుపట్టారు. వైసీపీ కుట్రలకు యువత బలి కాకుండా అన్ని సంఘాలు ఒకే తాటిపై పని చేయాలని నిర్ణయం తీసుకున్నారు. పరిశ్రమలు రాకుండా కుట్రలు చేస్తున్న వైసీపీ తీరుపై జేఏసీ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు కేసులు వేసి నోటిఫికేషన్లు అడ్డుకుంటున్న వైసీపీ నేతల తీరును ఎండగట్టారు. గత ఐదేళ్ల పాలనలో పెట్టిన తప్పుడు కేసులు తొలగించినందుకు కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే మెస్ చార్జీలు పెంచినందుకు, ఇచ్చిన మాట ప్రకారం డీఎస్సీ పూర్తి చేసినందుకు, జాబ్ క్యాలెండర్ విడుదల చేసినందుకు కూటమి ప్రభుత్వానికి జేఏసీ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. నిరుద్యోగుల సంక్షేమం కోసం ఏనాడు కృషి చేయని వైసీపీ నేతలు, ఇప్పుడు నిరుద్యోగులు, విద్యార్థుల ముసుగులో 'కృత్రిమ జేఏసీలు' ఏర్పాటు చేసి కుట్రలు చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో గ్రూప్-1 మూల్యాంకనం పేరిట డిజిటల్ విధానం తీసుకొచ్చి మూడుసార్లు కరెక్షన్లు చేయించి తీవ్ర అవకతవకలకు పాల్పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించి, ఎటువంటి అవకతవకలకు తావులేకుండా అత్యంత పారదర్శకంగా పూర్తి చేసిందని కొనియాడారు. డీఎస్సీలో భర్తీ కాకుండా మిగిలిపోయిన స్పోర్ట్స్ కోటా ఖాళీలను సుమారు 51 పోస్టులు ఇతర మిగులు పోస్టులను క్యారీ ఫార్వర్డ్ చేయకుండా, అర్హులైన అభ్యర్థులకు కేటాయించాలని చర్చించారు. కానిస్టేబుల్, ఎస్ఐ ఉద్యోగాలకు పోటీపడుతున్న అభ్యర్థులను దృష్టిలో ఉంచుకుని, జనరల్ కేటగిరీ వయోపరిమితిని మరో 5 సంవత్సరాలు పెంచాలని ప్రభుత్వాన్ని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు విజ్ఞప్తి చేశారు. 'బ్రిడ్జ్ గేమ్' పై అవగాహన లేకుండా వైసీపీ నాయకులు విమర్శలు చేయడం వారి అజ్ఞానానికి నిదర్శనమని విమర్శించారు.

### తప్పుడు ప్రచారాలు నమ్మొద్దు..

డీఎస్సీ ద్వారా ఎంపికైన 16,347 మంది అభ్యర్థులు ఈ రాష్ట్ర యువతేనని, వారి ఉద్యోగాలను రద్దు చేయాలని, కోర్టుల్లో వైసీపీ నేతలు 240 కేసులు వేశారు. డీఎస్సీ అభ్యర్థుల పేరుతో వైసీపీ నేతలు వేసిన పిల్ ను హైకోర్టు తప్పు పట్టడంతో జేఏసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. వైసీపీ పాలనలో కోచింగ్ సెంటర్ల వద్ద సంవత్సరాల తరబడి మగ్గిపోయే పరిస్థితి ఉందని గుర్తు చేసుకున్నారు. ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్, డీఎస్సీ నిర్వహించి ఉద్యోగ కల్పనకు స్పష్టమైన వ్యవస్థను కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిందని తెలిపారు. జగన్ రెడ్డి పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.4,830 కోట్ల చెల్లించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, 'తల్లికి వందనం' ద్వారా ఇప్పటికే రూ.10వేల కోట్లు పంపిణీ చేశారని పేర్కొన్నారు. జీవో నెం. 77 ద్వారా ప్రైవేట్, ఎయిడెడ్ పీజీ కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ రద్దు చేసింది జగన్ రెడ్డే. నేడు వారే ధర్నాలు చేయడం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. విద్యార్థి, యువజన సంఘ నాయకులపై కూటమి ప్రభుత్వంలో ఎఫ్ఐఆర్ కూడా నమోదు కాదని, హౌస్ అరెస్టులు, నియంతృత్వ చర్యలు ఉండవని గతంలో నారా లోకేష్ హామీ ఇచ్చారని గుర్తుచేశారు.

రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులు, ఉద్యోగాలు వస్తున్న ఈ తరుణంలో వైసీపీ సృష్టిస్తున్న అలజడులు, తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని యువతకు విద్యార్థి సంఘాలు విజ్ఞప్తి చేశాయి. గతంలో వైసీపీ అధికారంలోకి వస్తే ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ ఇస్తానని చెప్పి స్కాముల క్యాలెండర్లు ఇచ్చారని, హాయ్ లాండ్ వేదికగా గ్రూప్-1 పరీక్షల్లో అవినీతి చేసి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేశారని జేఏసీ నాయకులు మండిపడ్డారు.

ఈ సమావేశంలో పాల్గొన్నవారిలో...శాప్ ఛైర్మన్ రవి నాయుడు, టీడీపీ నాలెడ్జ్ సెంటర్ ఛైర్మన్ గురుజాల మాల్యాద్రి, ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్ కుమార్, నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ షేక్ సిద్దిక్, విద్యార్థి యువజన సంఘాల జేఏసీ కన్వీనర్ రాయపాటి జగదీష్, ఆర్ఎస్‌యూ అధ్యక్షుడు వెనుతుర్ల రవిశంకర్ రెడ్డి, ఆర్‌వైఎస్ఎఫ్ స్టూడెంట్‌ఫెడరేషన్ నాయకుడు పర్చూరి రాజేంద్ర, ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ నాయకుడు రవింద్ర నాయక్, ఆంధ్ర స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు హేమాద్రి యాదవ్, ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఓబులేసు యాదవ్, బంజీర జనసంఘ్ అధ్యక్షుడు హరి చౌహన్ నాయక్, ఆదివాసి విద్యార్థి సమైఖ్య నాయకుడు మనోహర్ నాయక్, గిరిజన విద్యార్థి అసోషియేషన్ నాయకుడు విష్ణు నాయక్, ట్రైబల్ రైట్స్ ఫోరం అధ్యక్షుడు మస్తాన్ నాయక్, గిరిజన వెల్ఫేర్ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస నాయక్, గిరిజన రాష్ట్ర సమితి అధ్యక్షుడు విజయకుమార్ నాయక్, రాష్ట్ర విద్యార్థి సమాఖ్య అధ్యక్షుడు రవి కుమార్, మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ చిలకా వెంకయ్య, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు బ్రహ్మం, బీసీ స్టూడెంట్ ఫెడరేషన్ గోపయ్య, తదితరులు ఉన్నారు.

# సీమ ప్రాజెక్టులపై వైసీపీ తప్పుడు ప్రచారం

## - మంత్రి జనార్ధన్ రెడ్డి ఆగ్రహం



బనగానపల్లె (చైతన్యరథం): రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టుల కోసం సీఎం చంద్రబాబు నాయుడు వేల కోట్ల రూపాయలు కేటాయించి నిరంతరం శ్రమిస్తుంటే వైసీపీ నేతలు తప్పుడు ఉద్యమాలతో అనవసర రాద్ధాంతం చేస్తున్నారని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. నంద్యాల జిల్లా బనగానపల్లె నియోజకవర్గం సంజామల మండల కేంద్రంలో మంగళవారం "ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. వైసీపీ నేతలు చేపట్టిన రాయలసీమ సాగు నీటి ప్రాజెక్టుల రక్షణ యాత్రను తప్పు బట్టారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేక ఆ పార్టీ నేతలు ఇలాంటి చర్యలకు పాల్పడు తున్నారని ఆగ్రహించారు. ఓ పక్క నీటి ప్రాజెక్టుల అభివృద్ధి కోసం చంద్రబాబు సర్కార్ వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుంటే.. వైసీపీ నేతలు మాత్రం రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ నేతల తీరు ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉందని విమర్శించారు. రాయలసీమను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి సుభిక్షంగా మార్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ మేరకు ఉద్యానవన రంగ అభివృద్ధికి రూ.లక్ష కోట్లతో బృహత్ ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే రాయలసీమకు రెండేళ్లలోనే రూ.4.58 లక్షల కోట్ల భారీ పెట్టుబడులు తీసుకొచ్చినట్లు వెల్లడించారు. ఈ ఏడాది డిసెంబర్‌లో రూ.4వేల కోట్లతో అల్ట్రాటెక్ రెండో యూనిట్ నిర్మాణానికి సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేయనున్నారని మంత్రి తెలిపారు.

మెగా డీఎస్సీ ద్వారా 16 వేల ఉపాధ్యాయ పోస్టులను పారదర్శకంగా భర్తీ చేసినట్లు జనార్దన్‌రెడ్డి తెలిపారు. మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో విద్యాశాఖలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామని ప్రశంసించారు. పాఠశాల విద్యార్థుల కోసం సన్న బియ్యంతో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నామని ఆయన చెప్పారు. వైసీపీ నేతలకు ధైర్యం ఉంటే అన్ని అంశాలపై అసెంబ్లీకి వచ్చి చర్చించాలని ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సవాల్ విసిరారు.

### ఇంటింటికీ..

రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి - సంక్షేమంపై ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ నాయకులతో కలిసి కూటమి ప్రభుత్వం రెండేళ్లలో సాధించిన ప్రగతిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలను ఆప్యాయంగా పలకరించి, కూటమి ప్రభుత్వంలో అందుతున్న సంక్షేమ-అభివృద్ధి ఫలాలను స్వయంగా వివరించారు. ప్రజలతో మమేకమై, వారి సాధక బాధకాలు తెలుసుకొని, అందుతున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. స్థానికంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## 8,9 తేదీల్లో గుంటూరులో

# 'అమరావతి చిత్రకళా వీధి'

- పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి కందుల దుర్గేష్
- గుంటూరులో ప్రతిష్టాత్మకంగా నిర్వహణ
- రాష్ట్ర కళాకారుల ప్రతిభను విశ్వవ్యాప్తం చేయడమే లక్ష్యమని పేర్కొన్న మంత్రి




విజయవాడ(చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక సమితి కమిషన్ ఆధ్వర్యంలో గుంటూరు నగరంలో అత్యంత వైభవంగా నిర్వహించనున్న 'అమరావతి చిత్రకళా వీధి' ఉత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక,సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ విజయవాడలోని తమ క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు.

ఈసందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ... రాష్ట్ర సాంస్కృతిక వైభవాన్ని, కళాకారుల సృజనాత్మకతను ప్రపంచానికి చాటిచెప్పేలా ఈ భారీ కళా ఉత్సవాన్ని రూపకల్పన చేసినట్లు తెలిపారు. ఈనెల 8,9 తేదీల్లో ఉదయం 10:00 గంటల నుండి రాత్రి 8:00గంటల వరకు గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్డు సమీపంలోని కొరిటపాడు - విద్యానగర్ రోడ్డులో ఈ కళా ఉత్సవం జరుగుతుందన్నారు. ఇందులో ప్రధానంగా సందర్శకులు స్వేచ్ఛగా తిలకించేలా ప్రత్యేక సాంస్కృతిక వీధి నిర్మాణం, దేశం నలుమూలల నుండి విచ్చేసే వివిధరకాల చిత్రకళా ఉత్పత్తులు, హస్తకళల ప్రదర్శన, విక్రయాల కోసం 800కు పైగా స్టాల్స్, నిర్విరామంగా సాగే ప్రత్యక్ష కళారూపాలు, సంగీత విభావరి, వినోద కార్యక్రమాలకు 9 కళా వేదికలు, లైవ్ ఆర్ట్ ఇన్‌స్టాలేషన్స్, ప్రత్యేక ఫోటో బూత్‌లు, విభిన్న రుచులతో కూడిన ఫుడ్ కోర్టులు ఉంటాయన్నారు.. గత ఏడాది రాజమహేంద్రవరంలో నిర్వహించిన చిత్రకళా వీధికి అపూర్వ స్పందన లభించిందని, ఆ విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఈ ఏడాది రాష్ట్ర ప్రజారాజధాని అమరావతికి అతిసమీపంలో ఉన్న గుంటూరులో మరింత అంగరంగ వైభవంగా ఏర్పాటుచేస్తున్నామని మంత్రి దుర్గేష్ తెలిపారు. ఇలాంటి వినూత్న కార్యక్రమాలు కళాకారుల ప్రతిభను విశ్వవ్యాప్తం చేయడానికి ఎంతో తోడ్పడతాయని ఉద్ఘాటించారు. ఈఅద్భుత కళాప్రదర్శనకు కళాభిమానులు, ప్రజలు, విద్యార్థులు పెద్దఎత్తున హాజరై, ఏపీ సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించే ఈవేడుకను విజయవంతం చేయాలని మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. పోస్టర్ ఆవిష్కరణలో ఏపీ సృజనాత్మక,సాంస్కృతిక సమితి చైర్ పర్సన్ పొడపాటి తేజస్వి పాల్గొన్నారు.

# నాణ్యమైన వైద్యసేవలే లక్ష్యం

- ప్రజారోగ్యంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- రెండేళ్ల పాలనలో నిండుగా అభివృద్ధి, సంక్షేమం
- ఐదేళ్ల విధ్వంస పాలనకు, రెండేళ్ల వికాస పాలనకు ప్రజల సంతృప్తే సాక్ష్యం
- రాష్ట్ర మంత్రులు సత్య కుమార్ యాదవ్, కొలుసు పార్థసారథి




చాట్రాయి/ఏలూరు (చైతన్యరథం): ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించటమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి వై సత్య కుమార్ యాదవ్ అన్నారు. ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గం చాట్రాయి మండలం చనుబండ గ్రామంలో మంగళవారం రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథితో కలిసి రూ 1.93 కోట్లతో ప్రాథమిక ఆరోగ్యకేంద్ర భవనానికి భూమిపూజ చేసిన మంత్రి సత్యకుమార్ శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. నూతన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాన్ని ప్రారంభించారు. రాష్ట్ర మంత్రులతో పాటు జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి పాల్గొన్నారు.

అనంతరం శ్రీ కోదండ రామస్వామి కళ్యాణమండపంలో జరిగిన సభలో మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ సరైన వైద్యం అందక ఏ ఒక్కరూ మరణించ కూడదనేదే లక్ష్యంగా ఎన్డీయే ప్రభుత్వం వైద్య రంగంపై ప్రత్యేక దృష్టిపెట్టిందని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం వైద్యారంగాన్ని నిర్వీర్యం చేసి, పేదలు ఆరోగ్యానికి తూట్లు పొడిచిందన్నారు. శంకుస్థాపన చేసిన ఈ ప్రాథమిక వైద్యశాలను 2027 మార్చి నాటికి పూర్తిచేసి, ప్రజలు వాడుకులోకి తెస్తామని అన్నారు. ఇదే ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి గత ప్రభుత్వంలో మూడుసార్లు శంకుస్థాపన చేసి, మూడు జీవోలు ఇచ్చారని, కాని ఒక్కరూపాయి నిధులు మంజూరు చెయ్యలేక పోయారన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో శరవేగంగా నిర్మిస్తామన్నారు. కేంద్రప్రభుత్వ సహకారంతో రాష్ట్ర వ్యాప్తంగా రూ. 1,200 కోట్లతో 100 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, ఆరోగ్య మౌలికవసతులు అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు, గత రెండేళ్లలో 12 వేలకు పైగా ఆరోగ్య సిబ్బందిని, 3 వేల మంది వైద్యులు, స్పెషలిస్ట్ వైద్యుల నియామక ప్రక్రియ చేపట్టామని తెలిపారు. కొన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు పూర్తయ్యాయని, కొన్ని నిర్మాణ దశల్లో ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో మరో రూ. 350 కోట్లతో రాష్ట్రంలో ఆయుష్ హాస్పిటల్స్ నిర్మాణాలు చేస్తున్నామని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతినిరుపేద, మధ్యతరగతి కుటుంబానికి ఉచితమైన, నాణ్యమైన ఆరోగ్యసేవలు అందేలా కూటమి ప్రభుత్వం ప్రత్యేకకృషి చేస్తోందన్నారు. గత ప్రభుత్వంలో కన్నా ఓపి, ఇన్ పేషెంట్లు సంఖ్య డబుల్ అయ్యిందని, వైద్యసేవలపై ప్రజలు సంతృప్తస్థాయి మరింత పెరిగిందన్నారు. ఐవిఆర్ఎస్ ఫోన్‌కాల్స్ ద్వారా ప్రజాభిప్రాయం గత ప్రభుత్వ ఐదేళ్లలో 61 శాతం ఉంటే రెండు ఏళ్లలో కూటమి ప్రభుత్వ పనితీరుపై 76 శాతం ప్రజలు సంతృప్తిని వ్యక్తం చేశారని అన్నారు. మహిళలకు స్త్రీశక్తి ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యంతో నిరుపేదలకు సమీప పట్టణాలు, నగరాలకు వెళ్లి వైద్యసేవలు పొందేందుకు వెసులుబాటు దొరికిందన్నారు. ప్రభుత్వవైద్యులు, సిబ్బందిపై ప్రజలకు మంచి వైద్యసేవలు అందించవలసిన సామాజిక బాధ్యత ఉందని, అమ్మ జన్మనిస్తే మీరు పునర్జన్మనిస్తారని గుర్తుతెరగాలని కోరారు. సంజీవిని కార్యక్రమం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 950 మెడికల్ మొబైల్ వ్యాన్లు ద్వారా పట్టణ, గ్రామీణ ప్రజలకు మూడువేలు విలువచేసే వివిధ రకాలు పరీక్షలు ఉచితంగా చేయించుకోవచ్చునన్నారు. మూత్రపిండాలు వ్యాధి నుండి ప్రజలను రక్షించేందుకు డయాబెటిస్, హైపర్ టెన్షన్ సర్వేలను చేస్తున్నామని, ప్రతి ఒక్కరికి అవసరమైన పరీక్షలు చేసి సమస్యలను ముందే గుర్తించడం ద్వారా ముందస్తు వైద్యం అందించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దే అవకాశం కల్పిస్తున్నామని అన్నారు. ప్రస్తుత జీవనశైలి కారణంగా క్యాన్సర్ వంటి రోగాలను నిరోధించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా వైద్యపరీక్షలు చేసామని, అవసరమైన వారికి వైద్యసలహాలు మందులను అందజేశామని తెలిపారు. దేశప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వైద్యరంగానికి అందించే సహాయములో ప్రధాన భూమిక పోషిస్తున్నారని తెలిపారు.

## రెట్టింపు సంక్షేమం: మంత్రి పార్థసారథి

ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ విద్య, వైద్యానికి వేలాదికోట్లు వెచ్చిస్తూ కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టిందని తెలిపారు. చాట్రాయి మండలం చనుబండ చరిత్రలో ప్రాథమిక వైద్యశాల భవనం వైద్యదేవాలయంగా రూపుదిద్దు కుంటుందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రెండేళ్లలో నూజివీడు నియోజక వర్గానికి వైద్యరంగానికి రూ.10 కోట్లు వెచ్చించామని అన్నారు. ఎన్నారైలు శ్రీనివాసరావు, శేషగిరిరావు కుటుంబ సభ్యులు ప్రాథమిక వైద్యశాలకు స్థలాన్ని ఇవ్వటం అభినందనీయం అని, ఈ సందర్భంగా వారిని అభినందించారు.

రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం నిధులతో 100 ప్రాథమిక వైద్యహాస్పిటల్స్ నిర్మాణాలు చేపట్టడం ద్వారా నిరుపేదలు, మధ్యతరగతి కుటుంబాలకు వైద్యసేవలు అందించేందుకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లపాలనలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు పట్ల ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రతి ఇంటికి ఒకటి నుంచి మూడు పథకాల వరకు లబ్ధి అందుతోందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత నిస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఐదేళ్ల గొడ్డలి పార్టీ పాలనకు, రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను ప్రజలు గమనిస్తున్నారని, అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని మంత్రి ప్రజలకు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టరు బొల్లిపల్లి వినూత్న, ఏపి అగ్రికల్చర్ మిషన్ వైస్- చైర్మన్, నూజివీడు నియోజకవర్గ పరిశీలకులు మారెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.యూ శోభ, డీసీహెచ్ఎస్ డా.సీహెచ్ బేబీకమల, జిల్లా బీజేపీ అధ్యక్షుడు సీహెచ్ విక్రమ కిషోర్, నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జి బర్మా ఫణిబాబు, వివిధ శాఖల అధికారులు, స్వర్ణగ్రామ సచివాలయ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, పట్టణ ప్రముఖులు, మండల, గ్రామ నాయకులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# తక్కువ ధరకు నాణ్యమైన బియ్యం



- ప్రజలపై ఆర్థికభారం తగ్గింపే ధ్యేయం
- మంత్రి ఎన్ఎండీ ఫరూక్ స్పష్టీకరణ
- నంద్యాలలో విక్రయ కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి

నంద్యాల (చైతన్యరథం): సామాన్య, నిరుపేద ప్రజలకు ఆర్థిక భారం తగ్గించి నాణ్యమైన బియ్యాన్ని సరసమైన ధరలకే అందించాలనే లక్ష్యంతో తక్కువ ధరకే బియ్యం విక్రయ కేంద్రాలను ప్రభుత్వం ప్రారంభించిందని రాష్ట్ర న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. నంద్యాల శ్రీనివాస్ నగర్‌లోని రైతు బజార్‌లో తగ్గింపు ధరల బియ్యం విక్రయ కేంద్రాన్ని మంత్రి ఎన్ఎండి ఫరూక్ మంగళవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ స్టీమ్ బియ్యం (బీపీటీ) కిలో రూ.52రూపాయలు (బహిరంగ మార్కెట్ ధర రూ.62 రూపాయలు), రా బియ్యం (బీపీటీ) కిలో రూ.50 రూపాయలు (బహిరంగ మార్కెట్ ధర రూ.58 రూపాయలు) చొప్పున ఈకేంద్రాల్లో విక్రమిస్తున్నారన్నారు. బియ్యం కొనుగోలు చేసే ప్రతి వినియోగదారుడు తమ ఆధార్ నంబరును తప్పనిసరిగా తెలియజేయాలని. ఒక బియ్యం కార్డుకు నెలకు గరిష్టంగా 10 కిలోల బియ్యం మాత్రమే అందజేస్తారన్నారు. నంద్యాల జిల్లాలో 2 రైతు బజార్లలో, 3 గుర్తించిన రైస్ మిల్ అవుట్‌లెట్లలో ఆగస్టు 4నుండి విక్రయాలు ప్రారంభించామని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే ఎక్కువ వసూలు చేయకూడదన్నారు. నిబంధనలకు లోబడి అత్యంత నాణ్యమైన బియ్యాన్ని మాత్రమే సరఫరా చేయాలని, నాసిరకం బియ్యం అమ్మితే కఠిన చర్యలు ఉంటాయిని తెలిపారు, కేంద్రంలో ధరల పట్టిక, స్టాక్ వివరాలు, పని వేళలు స్పష్టంగా ప్రదర్శించాలని వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా స్టాక్ నిరంతరం అందుబాటులో ఉంచా లని సివిల్ సప్లైస్ అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనంజయ్ గనోర్, టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, ఆర్డీవో విశ్వనాథ్, నంద్యాల మున్సిపల్ కమిషనర్ శేషన్న, ఎమ్మార్వోలు శ్రీనివాసులు, శ్రీవాణి, ది నంద్యాల రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, పౌర సరఫరాల శాఖ అధికారులు, రైతుబజార్ అధికారులు, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# అసెంబ్లీలో మండలి వెంకట కృష్ణారావుకి ఘన నివాళి



అమరావతి (చైతన్యరథం): మాజీ మంత్రి, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు మండలి వెంకట కృష్ణారావు శత జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర శాసనసభలో ఆయనకు మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. అసెంబ్లీ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో శాసనసభ సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు పాల్గొని కృష్ణారావు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, ఇది కేవలం ఒక వ్యక్తిని స్మరించుకునే కార్యక్రమం మాత్రమే కాదని, ఒక గొప్ప ఆదర్శాన్ని గుర్తుచేసుకునే అరుదైన సందర్భమని కొనియాడారు. మండలి వెంకట కృష్ణారావు కేవలం రాజకీయ నాయకుడు మాత్రమే కాదని, నిజమైన ప్రజల మనిషి అన్నారు. నిస్వార్థ ప్రజా సేవకు అంకితమైన ఆయనను ప్రజలందరూ ఎంతో ప్రేమగా "దివిసీమ గాంధీ" అని పిలుచుకునేవారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు వేగుళ్ల జోగేశ్వరరావు, విష్ణుకుమార్ రాజు, అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర, తదితరులు పాల్గొన్నారు.

చైతన్యరథం

# రెవెన్యూ శకం

## భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం - యజమానులకు కొండంత భద్రత

## రికార్డులకు డిజిటల్ కవచం - ప్రక్షాళన దిశగా కూటమి ప్రభుత్వం

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన స్వల్ప వ్యవధిలోనే రెవెన్యూ పరిపాలనను పూర్తిగా ప్రక్షాళన చేసి నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వ హయాంలో అశాస్త్రీయ నిర్ణయాలు, భూ కుంభ కోణాలు, దళారీ వ్యవస్థతో గందర గోళంలో పడ్డ రెవెన్యూ రంగాన్ని పునర్వ్యవస్థీకరించడమే లక్ష్యంగా అడుగులు వేసింది. స్లాట్ బుకింగ్, వాట్సాప్ సేవలు, వీడియో వ-ఖేజ, ఆటోమ్యుటేషన్ వంటి అత్యాధునిక డిజిటల్ టెక్నాలజీని అందుబాటు లోకి తెచ్చి దళారీ వ్యవస్థకు చరమ గీతం పాడింది. పారదర్శకమైన, వేగవంతమైన సేవలందించడమే కాకుండా కఠినమైన చట్టాలు, పాలనా సంస్కరణలతో ప్రజల భూములకు, ఆస్తులకు కొండంత భద్రతను, నమ్మకాన్ని కల్పించింది.**

### నల్ల చట్టం రద్దు & ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్-2024


ప్రజల ఆస్తులకు భంగం కలిగించే 'ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్' అనే నల్లచట్టాన్ని రద్దు చేస్తామని ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన వెంటనే తొలి సంతకంతోనే దానికి ఆమోదం తెలిపారు చంద్రబాబునాయుడు. ఆ వెంటనే అసెంబ్లీలో ఏకగ్రీవ రద్దు బిల్లును ఆమోదించి రైతుల భూములకు పూర్తి రక్షణ కల్పించారు. మరోవైపు భూ ఆక్రమణదారుల భరతం పట్టేందుకు కఠినమైన 'ల్యాండ్ గ్రాబింగ్ (ప్రొహిబిషన్) యాక్ట్-2024' అమల్లోకి తెచ్చారు. ఈ కొత్త చట్టం ద్వారా ఆక్రమణదారులకు జైలు శిక్షను 10 నుంచి 14 ఏళ్లకు పెంచడంతో పాటు ఆక్రమించిన భూమి మార్కెట్ విలువనే జరిమానాగా విధించేలా, అక్రమాస్తుల జప్తునకు కఠిన నిబంధనలు పొందుపరిచారు.

### నాలా చట్టం రద్దు, ఆర్వోఆర్ సవరణలు & నకిలీ రిజిస్ట్రేషన్ల రద్దుకు అధికారాలు

రాష్ట్రాభివృద్ధికి బాటలు వేస్తూ 'నాలా' చట్టాన్ని రద్దు చేశారు. 'సెల్ఫ్ డిక్లరేషన్' ఆధారంగానే స్థానిక సంస్థల నుంచి ఆటోమేటిక్ అనుమతులు ఇచ్చే సులభతర విధానాన్ని తెచ్చారు. అంతే కాకుండా నాలా ఫీజును 5%నుంచి పారిశ్రామిక ప్రాజెక్టులకు 3%కి, మిగిలిన భూములకు 2%కి తగ్గించి అమరావతి రాజధాని నిర్మాణం, పారిశ్రామిక కారిడార్ల పనులను వేగవంతం చేశారు. రైతులకు ఊరటనిస్తూ ఆర్వోఆర్ చట్టంలో సవరణలు చేసి, భూ వివాదాల అప్పీళ్ల పరిష్కార అధికారాలను డివిజన్ స్థాయిలోని ఆర్డీవోలకే అప్పగించడమే కాకుండా పరిష్కార గడువును ఆరు నుంచి మూడు నెలలకు కుదించారు. మరోవైపు జీవో నెం. 2 ద్వారా నకిలీ రిజిస్ట్రేషన్లను రద్దు చేసే విశేష అధికారాలను కలెక్టర్లకే అప్పగించి, బాధితులకు దశాబ్దాల కోర్టు తిప్పలు లేకుండా వెంటనే న్యాయం జరిగేలా చర్యలు తీసుకున్నారు.

### రీ-సర్వే 1.0 ప్రక్షాళన & రాజముద్రతో క్యూఆర్ కోడ్ పాస్ పుస్తకాలు

గత ప్రభుత్వ హయాంలో రీ-సర్వే 1.0 పేరుతో తలెత్తిన 101 రకాల రికార్డుల తప్పులను కూటమి ప్రభుత్వం ప్రక్షాళనచేస్తూ రచ్చబండలు, గ్రామసభల ద్వారా స్వీకరించిన 7.5 లక్షల ఫిర్యాదులను, ప్రత్యేక రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన 2.34 లక్షల సమస్యలను 100% పరిష్కరించింది. సబ్-డివిజన్ల కోసం రైతులపై అదనపు భారం పడకుండా ఉచిత సేవలందించడమే కాకుండా రూ.660 కోట్ల ప్రజాధనాన్ని తగలేసి భూములపై వేసిన జగన్




ఫొటోలు, పేర్లను తొలగించింది. సీఎం నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో పటిష్టమైన 'రాజముద్ర', 15 రకాల సెక్యూరిటీ ఫీచర్లు, పొలానికి నేరుగా చేర్చే క్యూఆర్ కోడ్ 'నావిగేషన్' సదుపాయంతో అత్యాధునిక నూతన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే 24 లక్షల మంది రైతులకు కొత్త పాస్ పుస్తకాలు అందజేయడమే కాకుండా భవిష్యత్తులో రిజిస్ట్రేషన్ కాగానే నేరుగా ఇంటికే పాస్ పుస్తకం వచ్చేలా చర్యలు తీసుకుంటోంది.

### ఆటో మ్యుటేషన్, డిజిటల్ లాక్ & 22(ఎ) నిషేధిత జాబితా నుంచి భూములకు విముక్తి

భూ రికార్డుల అక్రమాలకు అడ్డుకట్ట వేస్తూ రైతులు తమ అడంగల్, 1(బి) రికార్డులను స్వయంగా 'డిజిటల్ లాక్' చేసుకునే వెసులుబాటు కల్పించింది. దీంతో యజమాని అనుమతి, ఓటీపీ లేనిదే ఏ అధికారీ రికార్డులను మార్చలేరు. ప్రతి పనిలోనూ ఈ-కేవైసీ తప్పనిసరి చేయడంతోపాటు ఆఫీసుల చుట్టూ తిరిగే పనిలేకుండా 'ఆటో మ్యుటేషన్' విధానాన్ని అమలు చేస్తోంది. మరోవైపు గత ప్రభుత్వం రీ-సర్వే పేరుతో 22(ఎ) నిషేధిత జాబితాలో పెట్టిన పట్టా భూములు, సైనికులు, స్వాతంత్ర్య సమరయోధులు, రాజకీయ బాధితుల భూములు, 1954కి ముందు కేటాయించిన అసైన్డ్ భూములకు 9 రకాల ఆధార పత్రాల్లో ఏ ఒక్కటి ఉన్నా నిషేధం నుంచి విముక్తి కల్పిస్తోంది. అంతే కాకుండా సీఎం చంద్రబాబు ఆదేశాలతో 1.36 లక్షల ఎకరాల బీసీల గ్రామ సర్వీసు ఈనాం భూములు, 33వేల ఎకరాల షరతులు గల పట్టా భూములు సహా మొత్తం 1.69 లక్షల ఎకరాలను 22(ఎ) నుంచి శాశ్వతంగా తొలగించి యాజమాన్య హక్కులు కల్పించగా, మిగిలిన 1.9 లక్షల ఎకరాల చుక్కల భూములకు విముక్తి కల్పించే దిశగా శరవేగంగా అడుగులు వేస్తోంది.

### అసైన్డ్ భూముల దందాలకు చెక్ గ్రామ కంఠం స్థలాలకు శాశ్వత రిజిస్ట్రేషన్ల మోక్షం

గత ప్రభుత్వ హయాంలో అసైన్డ్ భూములను పేదలకు ఇస్తామని చెప్పి స్వార్థప్రయోజనాల కోసం 'ఫ్రీ-హోల్డ్' చేసిన 13.5లక్షల ఎకరాలపై కూటమి ప్రభుత్వం విచారణ జరిపించగా ఏకంగా 5.7లక్షల ఎకరాల్లో భారీ అక్రమాలు జరిగినట్లు తేలింది. ఈ దందాలపై రెవెన్యూ సంస్కరణల ఉప సంఘం సమగ్ర కసరత్తు పూర్తి చేసి అసలైన ఎస్సీ, ఎస్టీ, పేద వర్గాలకు మాత్రమే సంపూర్ణ ప్రయోజనం చేకూరేలా త్వరలోనే సీఎం నారా చంద్రబాబు ఆమోదంతో విప్లవాత్మక విధాన ప్రకటన (Policy Statement) విడుదల చేయనుంది. మరోవైపు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న గ్రామ కంఠం ఇళ్లు, స్థలాల రిజిస్ట్రేషన్లకు ప్రభుత్వం శాశ్వత మోక్షం కల్పించింది. గ్రామ కంఠం పరిధిలో ఉన్న ఆస్తులకు లింక్ డాక్యుమెంట్లు, ఇంటి పన్ను/VLT రశీదులు లేదా యజమాని ఇచ్చే సొంత ధ్రువీకరణ (Self Declaration) ఆధారంగానే ఏ తిప్పలు లేకుండా వెంటనే సబ్-రిజిస్ట్రార్లు రిజిస్ట్రేషన్ చేసేలా నిబంధనలను సులభతరం చేసింది.

### పదేళ్ల అసైన్డ్ ఇళ్లకు సంపూర్ణ హక్కులు పేదలకు ఉచిత ఇళ్ల స్థలాల పెంపు

అసైన్డ్ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని పదేళ్లు దాటిన పేద కుటుంబాలకు 90రోజుల వ్యవధిలోనే పూర్తిహక్కులు కల్పిస్తూ కూటమి ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయంతీసుకుంది. అసైన్డ్ పట్టా, ఇంటి పన్ను రశీదు ఉంటే చాలు రిజిస్ట్రేషన్ చేయడంతోపాటు వారసుల పేరిట కూడా బదిలీ చేసే వెసులుబాటు తెచ్చింది. అలాగే అభ్యంతరం లేని ప్రభుత్వ స్థలాల్లోని ఇళ్లకు పూర్తి హక్కులు కల్పిస్తూ ఇప్పటికే 10 వేల ఇళ్లకు(ఒక్క మంగళగిరిలోనే 8,800 ఇళ్లకు) పట్టాలు అందజేసింది. త్వరలోనే మరో 25వేల ఇళ్లకు పట్టాలు ఇవ్వనుంది. గతంలో నివాసానికి పనికిరాని లోతట్టు ప్రాంతాలు, కొండలలో ఇచ్చిన మ్యాచ్ బాక్స్ తరహా చిన్న స్థలాల మోసానికి చెక్ పెడుతూ...గ్రామాల్లో 3సెంట్లు, పట్టణాల్లో 2సెంట్లు చొప్పున ఉచితంగా ఇళ్ల స్థలాలు ఇచ్చేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పాత పనికిరాని స్థలాల పట్టాలను వెనక్కి ఇస్తే కొత్త విధానంలో గౌరవప్రదమైన స్థలాలను ఉచితంగా కేటాయిస్తోంది.

**కరెంట్ అనాలిసిస్**

తెలుసుకుందాం | విశ్లేషిద్దాం | సిద్ధమవుదాం

బి.నిర్మలాజ్యోతి, అనలిస్ట్, టీడీపీ నాలెడ్జ్ సెంటర్

### స్లాట్ బుకింగ్, వాట్సాప్ సేవలు 'వీడియో ఈ-కేవైసీ' రక్షణ

రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద ఉదయం నుంచి వేచి చూసే నరకయాతనకు స్వస్తి పలుకుతూ కూటమి ప్రభుత్వం 'స్లాట్ బుకింగ్' విధానాన్ని తెచ్చింది. దీనిద్వారా ప్రజలు తమకు వీలైన సమయాన్ని ఎంచుకుని వెళ్తే స్పాట్ రిజిస్ట్రేషన్ ద్వారా కేవలం 10 నిమిషాల్లో ప్రక్రియ పూర్తయి గంట వ్యవధిలోనే ఒరిజినల్ డాక్యుమెంట్లు చేతికి అందుతున్నాయి. అత్యాధునిక టెక్నాలజీతో ఆస్తి రిజిస్ట్రేషన్ పూర్తయిన వెంటనే ఒరిజినల్ డాక్యుమెంట్లు నేరుగా కొనుగోలుదారుడి వాట్సాప్ నెంబరుకే పంపే ఆటోమేషన్ వ్యవస్థను తెచ్చింది. విదేశాల్లో ఉండే ప్రవాసాంధ్రుల ఆస్తుల ఆక్రమణలకు చెక్ పెడుతూ 'వీడియో ఈ-కేవైసీ' విధానాన్ని ప్రవేశపెట్టింది. ప్రపంచంలో ఎక్కడున్నా వర్చువల్‌గా హాజరై డిజిటల్ సైన్ ద్వారా సురక్షితంగాపవర్ ఆఫ్ అటార్నీ ఇచ్చే వెసులుబాటు కల్పించడంతో నకిలీ పత్రాల దందాలకు ఆస్కారం లేకుండా పోయింది.

### ప్రైవేట్ భూములకు 22 (ఎ) విముక్తి

రైత్వారీ పట్టా ఉన్న ప్రైవేట్ భూములను అక్రమంగా 22 (ఎ) నిషేధిత జాబితాలోకి నెట్టేసిన గత ప్రభుత్వ తప్పులను దిద్దుతూ వాటిని జాబితా నుంచి తొలగించే సంపూర్ణ అధికారాలను కూటమి ప్రభుత్వం కలెక్టర్లకే అప్పగించింది. తగిన కారణం, నోటీసు లేకుండా ఏ ప్రైవేట్ భూమినీ నిషేధిత జాబితాలో పెట్టకూడదని కఠిన ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు గతంలో అశాస్త్రీయంగా జరిగిన జిల్లాల విభజన సమస్యలను సరిదిద్దేందుకు ప్రత్యేక మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసి ప్రజల దశాబ్దాల ఆకాంక్షలకు అనుగుణంగా మార్కాపురం, పోలవరం అనే రెండు నూతన జిల్లాలను ప్రకటించింది. దీంతో పాటు పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేస్తూ అద్దంకి, మడకశిర, అడ్డరోడ్డు జంక్షన్, పీలేరు, బనగానపల్లె అనే ఐదు కొత్త రెవెన్యూ డివిజన్లను అందుబాటులోకి తెచ్చి పాలనా సమర్థతను చాటుకుంది.

### శతాబ్దాల నాటి భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

పూర్వీకుల ఆస్తుల బదిలీలు, పంపకాల కోసం భారీగా అయ్యే ఖర్చుల దోపిడీకి చెక్ పెడుతూ కూటమి ప్రభుత్వం రూ.10 లక్షలలోపు విలువైన భూములకు కేవలం రూ.100, అంతకు మించిన భూములకు రూ.1,000స్టాంపు డ్యూటీతో సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ వెసులుబాటు తెచ్చింది. గ్రామీణ ప్రాంత రైతుల సాదాబైనామా (తెల్ల కాగితాల) ఉచితరిజిస్ట్రేషన్ల గడువును 2027 డిసెంబరు 31 వరకు పొడిగించింది. గుంటూరు జిల్లా వట్టిచెరుకూరులో పొరపాటుగా 'చెరువు'గా నమోదై 120 ఏళ్లుగా 22(ఎ)లో చిక్కుకున్న సమస్యను పరిష్కరించడంతో పాటు తిరుపతి శెట్టిపల్లిలో ఎస్టేట్ సర్వే వివాదంలో ఉన్న 2,111 మంది బాధితులకు భూ సమీకరణ ద్వారా 380ఎకరాల భూసమస్యను పరిష్కరించి పట్టాలు పంపిణీచేసింది. అంతేకాకుండా ఆర్డీవోలు, తహసీల్దార్లకే కీలక రెవెన్యూ అధికారాలను అప్పగించి నిజమైన అధికార వికేంద్రీకరణతో ప్రజల ముంగిటకే వేగవంతమైన సేవలను తెచ్చింది.

### దేశంలోనే తొలిసారిగా 'సుమోటో' కుల ధ్రువీకరణ

రెవెన్యూ, రిజిస్ట్రేషన్, మున్సిపల్ శాఖల డేటాను అనుసంధానిస్తూ GIS ఆధారిత గైడ్‌లైన్స్, పక్కా జియో-కో-ఆర్డినేట్స్, ట్యాంపరింగ్ చేయడా నికి వీల్లేని వికేంద్రీకృత 'బ్లాక్‌చైన్' టెక్నాలజీతో భూ రికార్డులకు కట్టుదిట్టమైన డిజిటల్ కవచం ఏర్పాటు చేసింది. అభ్యర్థులు కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేకుండా ఆధార్ ఆధారంగా 2.7కోట్ల మంది అర్హులను క్షేత్రస్థాయిలో వెరిఫై చేసి ఇళ్ల వద్దకే ఉచితంగా కుల ధ్రువీకరణ పత్రాలు అందించే దేశంలోనే తొలి 'సుమోటో' విధానానికి శ్రీకారం చుట్టింది. వీటిని DigiLocker, AP Walletలలో కూడా భద్రపరుస్తోంది.



# ఆర్థిక యంత్రం...
# ప్రగతి చక్రం

ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి గురించి మాట్లాడేటప్పుడు పెద్ద పరిశ్రమలు, భారీ పెట్టుబడులు, మౌలిక వసతుల ప్రాజెక్టులే ఎక్కువగా చర్చకు వస్తాయి. కానీ ఒక రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు నిజమైన బలం చిన్న పరిశ్రమలు, గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారత, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రవాసాంధ్రులతో ఏర్పడే బలమైన అనుబంధంలోనే ఉంటుంది. ఈ వాస్తవాన్ని గుర్తించిన కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో గత రెండేళ్లలో MSME, SERP, APNRTS శాఖలను కేవలం సంక్షేమ శాఖలుగా కాకుండా రాష్ట్ర అభివృద్ధికి కీలకమైన ఆర్థిక యంత్రాంగాలుగా మలిచింది. 'ప్రతి కుటుంబానికి ఆదాయం-ప్రతి యువకుడికి ఉపాధి- ప్రతి మహిళకు ఆర్థిక స్వావలంబన-ప్రతి ప్రవాసాంధ్రుడికి భరోసా' అనే సమగ్ర దృక్పథంతో రూపొందించిన విధానాలు ఇప్పటికే ఫలితాలు ఇవ్వడం ప్రారంభించాయి.




## పరిశ్రమలు, మహిళా సాధికారత, ప్రవాసాంధ్రుల సమ్మేళనంతో స్వర్ణాంధ్ర దిశగా అడుగులు

ఏ రాష్ట్రమైనా పారిశ్రామికంగా బలపడాలంటే పెద్ద పరిశ్రమలతో పాటు చిన్న, మధ్య తరహా పరిశ్రమలు కూడా సమానంగా ఎదగాలి. ఈ భావనతోనే ప్రభుత్వం MSME రంగాన్ని రాష్ట్ర అభివృద్ధి వ్యూహంలో కేంద్ర స్థానంలో నిలిపింది. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 55వేల సూక్ష్మ పరిశ్రమలు, 8వేల చిన్న పరిశ్రమలు, వెయ్యికి పైగా మధ్యతరహా పరిశ్రమలు కార్యకలాపాలు నిర్వహిస్తూ లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. ఈ రంగం మరింత బలోపేతం కావడానికి ప్రభుత్వం పరిశ్రమల విస్తరణ, సాంకేతిక ఆధునికీకరణ, పెట్టుబడుల ఆకర్షణపై ప్రత్యేక దృష్టి సారించింది. MSMEలను ఉద్యోగాలు కోరే వ్యవస్థగా కాకుండా ఉద్యోగాలు సృష్టించే శక్తిగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ అమలు చేస్తోంది.

### 20కి పైగా రంగాల వారీ పారిశ్రామిక విధానాలు

టెక్స్టైల్స్, ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రిక్ మొబిలిటీ, ఎలక్ట్రానిక్స్, క్లీన్ ఎనర్జీ, ఫార్మా, మెడికల్ డివైసెస్, లాజిస్టిక్స్, డిఫెన్స్, ఏరోస్పేస్ వంటి 20కి పైగా రంగాలకు ప్రత్యేక పారిశ్రామిక విధానాలను రూపొందించడం రాష్ట్ర పారిశ్రామిక చరిత్రలో కీలక పరిణామం. అన్ని పరిశ్రమలను ఒకే విధానంతో చూడకుండా ప్రతి రంగానికీ అవసరమైన ప్రోత్సాహకాలను రూపొందించడం వల్ల పెట్టుబడిదారుల్లో విశ్వాసం పెరిగింది.

### ప్రతి నియోజకవర్గానికీ MSME పార్క్ లక్ష్యం

పరిశ్రమలు కేవలం నగరాల్లోనే కాకుండా గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా MSME పార్కుల అభివృద్ధిని చేపట్టింది. ఇప్పటికే 792 పరిశ్రమలకు భూ కేటాయింపులు జరిగాయి. వీటి ద్వారా లక్షకు పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు కల్పించే ప్రక్రియ కొనసాగుతోంది. పరిశ్రమలు గ్రామాలకు చేరితే వలసలు తగ్గడమే కాకుండా స్థానిక



Sh. N. Chandrababu Naidu
Honorable Chief Minister
Andhra Pradesh

SERP
ANDHRA PRADESH

Sh.Srinivas Kondapalli
Minister for MSME,
SERP, NRI Relations & Empowerment
Government of Andhra Pradesh





యువతకు తమ ప్రాంతంలోనే ఉపాధి లభిస్తుంది.

### ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్క్ పాలసీ-దేశానికే ఆదర్శం

భారతదేశంలోనే వినూత్నంగా ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్క్ పాలసీని ప్రభుత్వం తీసుకురావడం మరో కీలక సంస్కరణ. భూస్వాములు తమ భూములను పారిశ్రామిక పార్కులుగా అభివృద్ధి చేసుకునే అవకాశాన్ని కల్పించడం ద్వారా సుమారు రూ.1,900 కోట్ల పెట్టుబడులు, 16,500కు పైగా ఉద్యోగాల అవకాశాలు సృష్టించే పరిస్థితి ఏర్పడింది.

### మూతపడిన పరిశ్రమలకు కొత్త జీవితం

ఆర్థిక ఇబ్బందులతో నిలిచిపోయిన పరిశ్రమలకు మరో అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో MSME Revival Policy అమలు చేసింది. యాజమాన్య మార్పులు, పునర్వ్యవస్థీకరణ, పెట్టుబడుల సమీకరణ, సులభ నిష్క్రమణ వంటి అవకాశాలు కల్పించడం ద్వారా అనేక పరిశ్రమలకు పునరుజ్జీవం లభించే పరిస్థితి ఏర్పడింది.

### భారీ ఆర్థిక మద్దతు-వ్యాపారాలకు ఊతం

పెట్టుబడుల లేమి చిన్న పరిశ్రమలకు ప్రధాన సమస్య. దీనిని గుర్తించిన ప్రభుత్వం గత రెండేళ్లలో రూ.1.90 లక్షల కోట్లకు పైగా బ్యాంకు రుణాలు అందించేందుకు కృషి చేసింది. CGTMSE కింద రూ.22,448 కోట్ల కొలేటరల్ ఫ్రీ రుణాలు, PM MUDRA కింద రూ.40వేల కోట్లకు పైగా రుణాలు, PMFME, Stand-Up India వంటి పథకాల ద్వారా వేలాది యూనిట్లకు ఆర్థిక మద్దతు లభించింది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన రూ.100 కోట్ల లోన్ గ్యారంటీ ఫండ్ చిన్న పారిశ్రామికవేత్తలకు మరింత భరోసా కల్పించింది.

### CMAPతో యువతలో వ్యవస్థాపకత

యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వయంగా వ్యాపారాలు ప్రారంభించేలా చేయడానికి Chief Minister Entrepreneurship Advance ment Programme (CMAP)ను రూ.300 కోట్లతో ప్రారంభించారు. దీని ద్వారా వేలాది కొత్త పరిశ్రమలు, 17,600కు పైగా ఉద్యోగాలు సృష్టించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

### ప్రపంచ మార్కెట్ల వైపు అడుగులు

ప్రస్తుత పోటీ ప్రపంచంలో డిజిటల్ సామర్థ్యం లేకుండా చిన్న పరిశ్రమలు నిలబడలేవు. దీనిని దృష్టిలో పెట్టుకుని NSE, Zoho, Vodafone Idea Business, ERMEX, MRDC, CII వంటి ప్రముఖ సంస్థలతో ప్రభుత్వం భాగస్వామ్యాలు కుదుర్చుకుంది. ERP, ఈ-కామర్స్, డిజిటల్ చెల్లింపులు, TReDS ఫైనాన్సింగ్, ఆన్‌లైన్ వివాద పరిష్కారం, ఎగుమతి ప్రోత్సాహం వంటి సేవలను మీవీజులకు అందుబాటులోకి తీసుకువచ్చింది.

### మహిళా సాధికారతకు స్వర్ణయుగం

గ్రామీణ మహిళల అభివృద్ధి లేకుండా రాష్ట్ర అభివృద్ధి అసంపూర్ణం. ఈ భావనతో ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలను కేవలం రుణ గ్రూపులుగా కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు చోదకశక్తిగా తీర్చిదిద్దుతోంది. గత రెండేళ్లలో మహిళా సంఘాలకు రూ.63వేల కోట్లకు పైగా బ్యాంకు లింకేజీ కల్పించడం, స్త్రీ నిధి ద్వారా రూ.9,300 కోట్లకు పైగా రుణాలు అందించడం మహిళా ఆర్థిక సాధికారతకు కొత్త బలం ఇచ్చాయి.

### కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్‌కు రక్షణ

గతంలో ఇతర అవసరాలకు మళ్లించిన సుమారు రూ.2,000 కోట్ల కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్‌ను తిరిగి మహిళా సంఘాల ఖాతాల్లో జమ చేయడం ద్వారా ప్రభుత్వం మహిళలపై తన నిబద్ధతను చాటుకుంది.

### లక్షలాది మహిళా పారిశ్రామికవేత్తల సృష్టి

మహిళలు ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధి ద్వారా ఉద్యోగాలు సృష్టించే స్థాయికి ఎదగాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టింది. గత ఏడాది లక్ష మంది మహిళా పారిశ్రామికవేత్తలను తీర్చిదిద్దగా ఈ ఏడాది మరో ఐదు లక్షల మంది మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

### 'స్వయం AP-గ్రామీణ ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్

మహిళా సంఘాల ఉత్పత్తులకు బ్రాండ్ విలువ తీసుకురావడానికి "స్వయం AP" పేరుతో ప్రత్యేక బ్రాండ్ ప్రారంభించడం విశేషం. మొదటి దశలోనే వందకు పైగా ఉత్పత్తులను ఈ బ్రాండ్ కింద మార్కెట్లోకి తీసుకువస్తున్నారు. స్థానిక ఉత్పత్తులను జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానం చేయడం ద్వారా గ్రామీణ మహిళల ఆదాయం పెరగనుంది.

### డిజిటల్ మహిళా సాధికారత

రుణాలు, పొదుపు, ఆరోగ్య సమాచారం, డిజిటల్ సేవలను ఒకే వేదికపై అందించే సమగ్ర డిజిటల్ వ్యవస్థను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. జియో-ఫెన్సింగ్ ఆధారిత హాజరు, డిజిటల్ మానిటరింగ్, ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాలు మహిళా సంఘాల పనితీరును మరింత సమర్థవంతంగా మారుస్తున్నాయి.

### సామాజిక భద్రతలో దేశానికే ఆదర్శం

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 62.34 లక్షల మంది లబ్ధిదారులకు సామాజిక భద్రతా పెన్షన్లు అందుతున్నాయి. ప్రతిఏటా రూ.33వేల కోట్లకు పైగా ప్రభుత్వం ఇందుకోసం వ్యయం చేస్తోంది. పెన్షన్ మొత్తాలను పెంచడం ద్వారా వృద్ధులు, వికలాంగులు, కిడ్నీ వ్యాధిగ్రస్తులు, ఇతర బలహీనవర్గాలకు మరింత ఆర్థిక భరోసా కల్పించింది.

## ప్రవాసాంధ్రులకు APNRTS అండ

ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రవాసాంధ్రులు రాష్ట్రానికి విలువైన సంపద. వారి సంక్షేమం కోసం APNRTS ద్వారా ప్రభుత్వం సమగ్ర సేవలు అందిస్తోంది. గత రెండేళ్లలో 1,376 ఫిర్యాదులను పరిష్కరించగా DGP NRI సెల్ ద్వారా మరో 398 సమస్యలను పరిష్కరించింది. విదేశాల్లో ఇబ్బందులు ఎదుర్కొన్న 104 మంది ప్రవాసాంధ్రులను సురక్షితంగా స్వదేశానికి తీసుకురావడం ప్రభుత్వం స్పందనకు నిదర్శనం.




### NRT Icon Towers

**ప్రవాసాంధ్రుల పెట్టుబడులకు వేదిక**

అమరావతిలో నిర్మాణంలో ఉన్న NRT Icon Towers ప్రాజెక్టు ప్రవాసాంధ్రులకు రాష్ట్రంతో మరింత బలమైన అనుబంధాన్ని కల్పించనుంది. 74 కార్యాలయ స్థలాలు, 50 నివాస యూనిట్లు, ఆధునిక వాణిజ్య సదుపాయాలతో ఈ ప్రాజెక్టు అభివృద్ధి చెందుతోంది.

విదేశాలకు వెళ్లే కార్మికులకు బీమా, వీసా సహాయం, అత్యవసర సేవలు, చట్టపరమైన మద్దతు వంటి సేవలను ప్రభుత్వం అందిస్తోంది. అవసరమైన సమయంలో తక్షణ సహాయం అందేలా బలమైన సహాయక వ్యవస్థ ఏర్పాటు చేసింది.



**శశికుమార్**
తెలుగుదేశం సైనికుడు

## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత : ఎమ్మెల్యే కూన



ఆముదాలవలస (చైతన్యరథం): నియోజకవర్గం ఆముదాలవలస మండలంలో అక్కులపేట గ్రామంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన "రెండేళ్ల నమ్మకం సంక్షేమ విజయాలు ప్రజా పాలన – ఇంటింటికీ అభివృద్ధి" కార్యక్రమంలో ఆముదాలవలస ఎమ్మెల్యే, రాష్ట్ర పీయూసీ ఛైర్మన్ కూన రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పరిపాలన సాగుతోందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, వృద్ధులు, కార్మికులు సహా అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే విధంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, రహదారులు, తాగునీటి సదుపాయాలు, విద్య, వైద్యం, విద్యుత్, వ్యవసాయ రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించామని తెలిపారు. గ్రామ స్థాయిలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతోందన్నారు. అక్కుల పేట గ్రామంలో కూడా వివిధ అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు ప్రజలకు ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు.

## విశాఖ ఇంటింటి ప్రచార కార్యక్రమంలో ఎమ్మెల్యే గణబాబు

విశాఖపట్నం (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం రెండేళ్ల పరిపాలనలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ విజయాలను ప్రజలకు వివరించే లక్ష్యంతో చేపట్టిన "2 ఏళ్ల నమ్మకం ... అభివృద్ధి, సంక్షేమం" ఇంటింటి ప్రచార కార్యక్రమం విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో సాగుతోంది. ఇందులో భాగంగా ఈరోజు 57వ వార్డు పరిధిలోని సుభాష్ నగర్ నుండి తుమ్మాడిపాలెం వరకు స్థానిక ఎమ్మెల్యే గణబాబు పార్టీ శ్రేణులు, కార్యకర్తలతో కలిసి విస్తృతంగా పర్యటించారు. సుభాష్ నగర్, తుమ్మాడిపాలెం వీధుల్లో ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే గణబాబు ప్రజలను ఆత్మీయంగా పలకరిస్తూ, కూటమి ప్రభుత్వ ప్రగతి నివేదికను వారికి అందజేశారు. స్థానికంగా ఉన్న సమస్యలను, ప్రజల అభిప్రాయాలను నేరుగా అడిగి తెలుసుకుంటూ వాటిని ప్రాధాన్యత క్రమంలో నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ... ప్రచారంలో భాగంగా ప్రతి బూత్ పరిధిలోని ప్రతి ఇంటినీ క్రమబద్ధంగా సందర్శిస్తూ ప్రజలతో అనుసంధానమవుతున్నామని తెలిపారు. ప్రభుత్వ ప్రగతి నివేదికతో పాటు, సంక్షేమం మరియు అభివృద్ధిపై రూపొందించిన వీడియోలను కూడా ప్రజలకు చూపిస్తూ అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రధాని నరేంద్ర మోదీ విజయనగరం జిల్లా పర్యటన విజయవంతం

### ●అధికారులను ఘనంగా సన్మానించిన ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి



ఎల్.కోట (చైతన్యరథం): ప్రధాని నరేంద్రమోదీ విజయనగరం జిల్లా పర్యటనను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని దిగ్విజయం చేసిన అధికారులకు శృంగవరపుకోట శాసనసభ్యురాలు కోళ్ల లలితకుమారి, వారి భర్త కోళ్ల బాలాజీ అప్పల బాలాజీ రామ్ ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. ఎల్.కోట మండలం గోల్డ్ స్టార్ సమీపంలోని బుద్ధ హోమ్స్‌లో నియోజకవర్గ స్థాయి వివిధ శాఖల అధికారులకు ఎమ్మెల్యే దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక విందు (లంచ్) కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రధాని పర్యటన అత్యంత విజయవంతంగా ముగియడం వెనుక నియోజకవర్గంలోని ప్రతి శాఖ పాత్ర ఎంతో ఉందంటూ అధికారుల సమన్వయాన్ని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఈ ప్రోగ్రామ్‌ను దిగ్విజయం చేయడం కోసం అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేసి పర్యటనను విజయవంతం చేశారని కొనియాడారు. ప్రధాని పర్యటనను విజయవంతం చేయడానికి కృషి చేసిన జిల్లా కలెక్టర్, ఎస్పీ కీలక పాత్ర పోషించారంటూ వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ విందు కార్యక్రమంలో పోలీస్, రెవెన్యూ, మండల పరిషత్, విద్యుత్, వ్యవసాయ, పశు సంవర్ధక, వెలుగు, విద్యాశాఖలతో పాటు ఇతర కీలక శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విధి నిర్వహణలో ప్రదర్శించిన ప్రతిభను, చూపిన చొరవను ఎమ్మెల్యే ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. విందు అనంతరం ప్రోగ్రామ్ నిర్వహణలో క్రియాశీలకంగా వ్యవహరించిన అధికారులందరినీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, కోళ్ల బాలాజీ అప్పల బాలాజీ రామ్ ప్రసాద్ దుశ్శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ఇదే తరహా సమన్వయంతో పనిచేస్తూ నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పడాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

## ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం : కిడారి శ్రావణ్



అరకు (చైతన్యరథం): ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర గిరిజన సహకార సంస్థ ఛైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం చేపట్టిన డోర్ టు డోర్ కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన వివిధ వినతులు, సమస్యలను రాష్ట్ర గిరిజన సహకార సంస్థ ఛైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ జిల్లా కలెక్టర్ నిశాంతికి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసి ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీరు, రహదారులు, విద్యుత్, గృహాలు, సంక్షేమ పథకాల అమలు, భూ సమస్యలు, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను వివరించి, వాటిని త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, డోర్ టు డోర్ కార్యక్రమంలో వచ్చిన ప్రతి వినతిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం జరిగే వరకు నిరంతరం కృషి చేస్తామని కిడారి శ్రావణ్ కుమార్ తెలిపారు. ప్రజల సమస్యలపై సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ నిశాంతి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి వినతులను పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కార చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ ఛైర్మన్ జ్ఞాన ప్రకాష్, పీఏసీఎస్ ఛైర్మన్ ప్రసాద్, మాజీ సర్పంచ్‌లు పాండు, రంగస్వామి, శశిభూషణ్ నాయుడు, మాజీ రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి సుబ్బారావు, టీడీపీ మహిళా నాయకులు ద్రౌపతి, కళావతి, జనసేన వీర మహిళ రత్నప్రియ, టీడీపీ నాయకులు త్రినాథ్, గంగాధర్, రామారావు, అచ్చిబాబు, మల్లేష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటి ప్రచారంలో ప్రజా సమస్యలు తెలుసుకున్న మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్



విశాఖపట్నం (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో సాధించిన విజయాలు ప్రజలకు వివరిస్తూ ప్రజా సమస్యలను ప్రజలను అడిగి పరిష్కారం కోసం మంగళవారం ఉదయం 81వ వార్డులో విల్లూరి పరంధామయ్య వీధి, కోణతాల సుబ్రహ్మణ్యం కళ్యాణ మండపం వీధిలోని 30 గృహాలను మాజీ ఎమ్మెల్సీ, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు సందర్శించారు. సూపర్ సిక్స్ పథకాలు గృహాలు సందర్శించిన సందర్భంగా మహిళలతో ముఖాముఖి మాట్లాడినప్పుడు చంద్రబాబు పాలన గురించి, జగన్ రెడ్డి పాలన గురించి వ్యత్యాసాన్ని వివరించారు. చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్ర రాజధాని నిర్మాణం పిల్లలకి ఉద్యోగావకాశాలు కావాలని ప్రజలు బాహాటంగా మాట్లాడారని నాగ జగదీష్ అన్నారు. శ్రీ భోగలింగేశ్వర దేవస్థానం ఛైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ ఇంటింటి యజమానితో మాట్లాడినప్పుడు... కరెంటు చార్జీలు గత పాలనకు కూటమి పాలనకు బిల్లులు రేట్లు గురించి అడిగి తెలుసుకున్నారు. కరెంటు చార్జీలు తగ్గాయని, నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నారని, కరెంటు కోతలు లేకుండా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బాగా చూస్తున్నారని గృహణులు చెప్పారని అన్నారు. ఉచిత బస్సు ప్రయాణం ఏ విధంగా ఉందని నాగ జగదీష్ మహిళలను ప్రశ్నించినప్పుడు ఆడ, మగ ప్రయాణం చేయడం వల్ల సీట్లు కోసం గొడవలు జరుగుతున్నాయని, ప్రత్యేకంగా స్త్రీలకు మాత్రమే బస్సు ప్రయాణం చేసినట్లయితే వివాదా లేకుండా సౌకర్యవంతమైన ప్రయాణం జరుగుతుందని ఆశాభావం వ్యక్తపరిచారని నాగ జగదీష్ అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు సదరం శివ అప్పారావు పెంటకోట శివరాం తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు

### ●ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ శాసనమండలి ఛైర్మన్ ఎం.ఏ షరీఫ్



విజయవాడ (చైతన్యరథం): సెంట్రల్ నియోజకవర్గంలోని 25వ డివిజన్, ఏలూరు రోడ్డులో ది యంగ్ మెన్స్ ముస్లిం అసోసియేషన్ (లైబ్రరీ) ఆధ్వర్యంలో యువతకు డిజిటల్ నైపుణ్యాలను పెంపొందించి, ఉపాధి అవకాశాలను మెరుగుపర్చే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని మాజీ శాసనమండలి ఛైర్మన్ ఎం.ఏ. షరీఫ్, ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బొండా ఉమ మాట్లాడుతూ... నేటి పోటీ ప్రపంచంలో కంప్యూటర్ పరిజ్ఞానం ప్రతి విద్యార్థికి, యువతకు అత్యంత అవసరమని అన్నారు. ఉచితంగా నాణ్యమైన కంప్యూటర్ శిక్షణ అందించడం ద్వారా యువతలో సాంకేతిక నైపుణ్యాలు పెంపొందడంతో పాటు, మెరుగైన ఉపాధి అవకాశాలు పొందేందుకు ఈ శిక్షణ కేంద్రం దోహదపడుతుందని పేర్కొన్నారు. సమాజాభివృద్ధికి విద్య, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాభివృద్ధి కీలకమని, ఇటువంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. నిర్వాహకులు మాట్లాడుతూ... ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు, యువతకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ అందించి వారిని ఉపాధి దిశగా తీర్చిదిద్దడమే ఈ కేంద్రం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ముస్లిం సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, యువత, విద్యార్థులు, స్థానిక ప్రముఖులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## ఉప్పులూరు అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

### ● ప్రతి ఇంటికి సంక్షేమం, ప్రతి వీధికి అభివృద్ధే మా లక్ష్యం : ఎమ్మెల్యే బోడే ప్రసాద్

పెనమలూరు (చైతన్యరథం): నియోజకవర్గంలోని ఉప్పులూరు గ్రామంలో నిర్వహించిన "ఇంటింటికి తెలుగుదేశం – డోర్ టు డోర్" కార్యక్రమంలో ప్రజలు కూటమి ప్రభుత్వంపై పూర్తి విశ్వాసాన్ని వ్యక్తం చేశారని పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ తెలిపారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నామని, మహిళలు, వృద్ధులు, యువత ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై సంతృప్తి వ్యక్తం చేశారని చెప్పారు. ఉప్పులూరు గ్రామ అభివృద్ధికి గత రెండేళ్లలో సుమారు రూ. 2.90 కోట్లకు పైగా అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, హనుమాన్‌పేటలో డ్రైనేజీ పనులు కొనసాగుతున్నాయని, బీసీ కాలనీలో డ్రైనేజీ అభివృద్ధి చేపట్టామని, కమ్యూనిటీ హాల్‌కు నిధులు కేటాయించామని తెలిపారు. ఎస్సీ కాలనీలో డ్రైనేజీ సమస్యతో పాటు గ్రామ ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణాన్ని వచ్చే మూడేళ్లలో పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏపీలో గ్రీన్ ఎనర్జీ కారిడార్ ద్వారా పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల అనుసంధానానికి కేంద్రం చర్యలు

**● రాజ్యసభలో ఎంపీ సానా సతీష్ బాబు ప్రశ్నకు కేంద్రం వివరణ**



న్యూఢిల్లీ /కాకినాడ (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులను గ్రీన్ ఎనర్జీ కారిడార్‌తో అనుసంధానం చేయడం, వాటి అభివృద్ధికి కేంద్రం తీసుకుంటున్న చర్యలపై మంగళవారం రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు అడిగిన ప్రశ్నకు కేంద్ర పునరుత్పాదక ఇంధన శాఖ కీలక వివరాలను వెల్లడించింది. కేంద్ర పునరుత్పాదక ఇంధన శాఖ సహాయ మంత్రి శ్రీపాద్ ఎస్సో నాయక్ రాజ్యసభలో సమాధానం ఇస్తూ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు పలు రాష్ట్రాల నుంచి గ్రీన్ ఎనర్జీ కారిడార్ రెండో దశలో పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులను అనుసంధానం చేయాలని ప్రతిపాదనలు అందాయని తెలిపారు. ఈ ప్రతిపాదనలు ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌కో ద్వారా రాష్ట్ర విద్యుత్ ప్రసార వ్యవస్థ బలోపేతం కోసం సమర్పించినట్లు పేర్కొన్నారు. అలాగే, గ్రీన్ ఎనర్జీ కారిడార్ రెండో దశను కేంద్ర ప్రభుత్వం రూ.11,500 కోట్ల వ్యయంతో అమలు చేస్తోందని, ఇందులో కేంద్ర ఆర్థిక సహాయంతో పాటు రాష్ట్ర భాగస్వామ్య నిధులు కూడా వినియోగిస్తున్నట్లు వివరించారు. పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల అమలును వేగవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుందని తెలిపారు. పర్యావరణ అనుమతుల ప్రక్రియను సులభతరం చేయడం, అటవీ అనుమతుల నిబంధనల్లో సడలింపులు, తవ్వకాల అనంతరం పునర్వనీకరణకు సంబంధించి మార్గదర్శకాలు, అలాగే పరిశోధనాత్మక డ్రిల్లింగ్ వంటి కార్యకలాపాలకు అనుమతులు కల్పించడం ద్వారా ప్రాజెక్టుల అమలుకు ఊతమిస్తున్నట్లు వెల్లడించారు.

# జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి కార్యక్రమం కింద 20 పారిశ్రామిక నోడల్‌లకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

**● ఎంపీ కేశినేని శివనాథ్ ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం సమాధానం**



న్యూ ఢిల్లీ /విజయవాడ (చైతన్యరథం): గత ఐదు సంవత్సరాలలో జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి కార్యక్రమం కింద మొత్తం ప్రతిపాదనలు మరియు ఆమోదించబడిన ప్రాజెక్టుల వివరాలను పార్లమెంట్ వేదికగా వాణిజ్య మరియు పరిశ్రమల మంత్రిత్వ శాఖను ఎంపీ కేశినేని చిన్ని ప్రశ్నించారు. ఎంపీ చిన్ని ప్రశ్నకు వాణిజ్య మరియు పరిశ్రమల శాఖ రాష్ట్ర మంత్రి జితిన్ ప్రసాద సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వంతో సంయుక్తంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రయోజన వాహనాల ద్వారా, జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి కార్యక్రమం కింద పారిశ్రామిక టౌన్‌షిప్‌ల అభివృద్ధిని చేపట్టింది. ఈ ప్రాజెక్ట్ అభివృద్ధి కార్యకలాపాలలో, రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత ప్రకారం పారిశ్రామిక నోడ్‌లను గుర్తించడం, ఆ తర్వాత కాన్సెప్ట్ మాస్టర్ ప్లాన్ మరియు అభివృద్ధి ప్రణాళికను తయారు చేసి ఆమోదించడం, పర్యావరణ అనుమతి మరియు వివరణాత్మక డిజైన్ ప్లాన్‌ను రాష్ట్ర ప్రభుత్వం నుండి పొందడం వంటివి ఉంటాయి. ఇవన్నీ ప్రాజెక్ట్‌ను ఆమోదం కోసం పరిగణనలోకి తీసుకునే ముందు జరుగుతాయి. రాష్ట్ర ప్రభుత్వ వాటా భూమి రూపంలో ఉండగా, భారత ప్రభుత్వ వాటా ఈక్విటీ మరియు/లేదా రుణ రూపంలో ఉంటుందిఅని తెలిపారు. భారత ప్రభుత్వం NICDP కింద మొత్తం 20 పారిశ్రామిక నోడ్‌లను ఆమోదించింది. వీటిలో, గత 5 సంవత్సరాలలో 12 ప్రాజెక్టులు ఆమోదించబడ్డాయి. ఈ ప్రాజెక్టుల రాష్ట్రాల వారీ వివరాలు అనుబంధం Iలో ఉన్నాయి అని అన్నారు.

# విద్యార్థులకు తల్లికి వందనం అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిది : ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం (చైతన్యరథం): రాష్ట్రవ్యాప్తంగా 67 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదని రూరల్ శాసనసభ్యులు శ్రీ గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. ఈరోజు రూరల్ మండలం సాటిలైట్ సిటీ గ్రామంలో జిల్లా పరిషత్ హై స్కూల్ జూనియర్ కాలేజీ నందు 46.20 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన కెమిస్ట్రీ ల్యాబ్ మరియు బయాలజీ ల్యాబ్ లను ఎమ్మెల్యే గోరంట్ల ప్రారంభించారు. అలాగే "రెండేళ్ల నమ్మకం అభివృద్ధి-సంక్షేమం" డోర్ టు డోర్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వ సంక్షేమ విజయాలు కరపత్రాలను పంపిణీ చేస్తూ, ప్రజల నుండి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఆ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ సారథ్యంలో విద్యారంగంలో సమూల మార్పులు చోటు చేసుకుంటున్నాయని, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పిస్తున్నామని, పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం కూడా బాగుందని అన్నారు. జూనియర్ కాలేజీ చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించేందుకు అంచనాలు సిద్ధం చేశామని త్వరలోనే పనులు మొదలు పెడతామని హామీ ఇచ్చారు. నూతనంగా నిర్మించిన ల్యాబ్స్ నందు పరికరాలు ఏర్పాటు చేసుకునేందుకు సొంత నిధులు లక్ష రూపాయలు అందిస్తానని తెలిపారు. అలాగే స్కూల్ నందు టాయిలెట్లు నిర్మించేందుకు వాష్ ఇనిస్ట్యూట్ సంస్థ ముందుకు వచ్చిందని, నిర్మాణానికి ఏడు లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని 90% ఆ సంస్థ వారు నిధులు కేటాయిస్తారని, మిగిలిన 10 శాతం 70 వేల రూపాయలను కూడా ఎమ్మెల్యే గోరంట్ల తన సొంత నిధులు అందిస్తానని తెలిపారు.

# డ్వాక్రా మహిళలకు కూటమి ప్రభుత్వం భారీ ఊరట : ఎమ్మెల్యే ఆదిరెడ్డి

**● ఇన్‌స్పెక్షన్ ఛార్జీల మాఫీ.. ప్రాసెసింగ్ ఛార్జీల్లో రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు ఉపశమనం**



రాజమహేంద్రవరం (చైతన్యరథం): డ్వాక్రా మహిళా సంఘాల ఆర్థిక భారాన్ని తగ్గించే దిశగా కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) తెలిపారు. స్థానిక ఆనం కళా కేంద్రంలో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన "మన డబ్బులు--మన లెక్కలు" యాప్ అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ నిర్ణయాల ప్రకారం రూ.20 లక్షల రుణంపై ప్రతి మూడు నెలలకు వసూలు చేసే ఇన్‌స్పెక్షన్ ఛార్జీలను పూర్తిగా మాఫీ చేస్తున్నారని, దీంతో సంవత్సరానికి సుమారు రూ.28 వేల, మూడు సంవత్సరాల రుణ కాలానికి రూ.84 వేల, ఐదు సంవత్సరాల కాలానికి రూ.1.40 లక్షల వరకు మహిళా సంఘాలకు ఆదా కానుందన్నారు. అలాగే రుణాలపై ఒకేసారి వసూలు చేసే ప్రాసెసింగ్ ఛార్జీల్లో రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు ఉపశమనం లభించనుండగా, రుణాలపై వడ్డీని 13 శాతం నుంచి 12 శాతానికి తగ్గించినట్లు తెలిపారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ఇప్పటికే ఈ నిర్ణయాలను అమలు చేస్తున్నాయని, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా త్వరలో అధికారిక సర్క్యులర్ జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు. జూలై 1 నుంచి అమల్లోకి వచ్చిన ఈ ప్రయోజనాలను ప్రతి డ్వాక్రా మహిళ వినియోగించుకోవాలని సూచించారు. బ్యాంకుల్లో అదనపు ఛార్జీలు వసూలు చేస్తే తప్పనిసరిగా వివరాలు అడిగి తెలుసుకోవాలని మహిళలకు పిలుపునిచ్చారు. మహిళా సంఘాల్లో పారదర్శకత పెంచేందుకు రూపొందించిన "మన డబ్బులు--మన లెక్కలు" యాప్ ద్వారా సభ్యులు తమ పొదుపులు, రుణాలు, చెల్లింపుల వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడంతో పాటు ఫిర్యాదులను కూడా నమోదు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. రిసోర్స్ పర్సన్లు, మెప్మా సిబ్బంది ప్రతి సభ్యురాలికి యాప్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. పాత రుణాలు పూర్తిగా చెల్లించిన సంఘాలకు 10 నుంచి 15 రోజుల్లోనే కొత్త రుణాలు సభ్యుల బ్యాంకు ఖాతాల్లో జమయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కొత్తగా సంఘాల్లో చేరిన సభ్యులకు సంఘం ఆమోదంతో రూ.40 వేల నుంచి రూ.2 లక్షల వరకు రుణాలు అందించే అవకాశం కల్పించామని పేర్కొన్నారు.

# రైతు బజార్‌లో సన్న బియ్యం విక్రయ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే యార్లగడ్డ



యార్లగడ్డ (చైతన్యరథం): సామాన్య ప్రజలకు నాణ్యమైన బీపీటీ సన్న బియ్యాన్ని తక్కువ ధరకే అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. గన్నవరం రైతు బజార్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సన్న బియ్యం విక్రయ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. బీపీటీ స్టీమ్ సన్న బియ్యాన్ని కిలో రూ.52కు, బీపీటీ రా రైస్‌ను కిలో రూ.50కు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరికి నెలకు 10 కిలోల చొప్పున బియ్యం అందజేయనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ... గత 26 నెలలుగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమానంగా ముందుకు తీసుకెళ్తోందన్నారు. ప్రజల వద్దకే ప్రభుత్వాన్ని తీసుకెళ్లాలన్న లక్ష్యంతో పింఛన్ల పంపిణీ నుంచి ప్రజా సమస్యల పరిష్కారం వరకు ప్రజాప్రతినిధులే నేరుగా పాల్గొంటున్నారని చెప్పారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన రహదారులను పెద్దఎత్తున పునరుద్ధరిస్తున్నామని, ఇప్పటికే 70 నుంచి 80 శాతం రోడ్ల పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఇంకా కొన్ని కీలక రహదారుల పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. పట్టిసీమ ద్వారా నీటి విడుదలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకున్న చొరవ వల్లే రైతులకు ఉపశమనం లభించిందన్నారు. రైతు సమస్యలపై ప్రభుత్వం నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తోందని చెప్పారు. చిక్కవరం చెరువులో గతంలో ముగ్గురు చిన్నారులు మృతి చెందిన ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిన ఎమ్మెల్యే, అక్రమ మైనింగ్, చెరువుల భద్రత అంశాల్లో అధికారులు మరింత బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ ఘటనకు సంబంధించి కేసుల నమోదులో జరిగిన జాప్యంపై కూడా అధికారులను ప్రశ్నించినట్లు తెలిపారు. మార్కెట్‌లో బియ్యం ధరలు పెరిగిన నేపథ్యంలో సామాన్య కుటుంబాలకు ఉపశమనం కల్పించేందుకే ఈ ప్రత్యేక విక్రయ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు యార్లగడ్డ పేర్కొన్నారు. పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చొరవతో ఈ పథకం అమలులోకి వచ్చిందన్నారు. అలాగే పంచాయతీరాజ్ శాఖలో 10 వేల ఉద్యోగ పదోన్నతులు కల్పించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ధన్యవాదాలు తెలిపారు.

# రాజముద్రతో రైతుకు భరోసా... "మీ భూమి - మీ హక్కు"కు కొత్త గుర్తింపు

**●బొల్లాపల్లిలో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేసిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు**



వినుకొండ (చైతన్యరథం): పల్నాడు జిల్లా బొల్లాపల్లి గ్రామంలో "మీ భూమి - మీ హక్కు" కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ అంజనేయులు రైతులకు కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. రాజముద్రతో అందజేస్తున్న ఈ పాస్ పుస్తకాలు రైతుల భూ హక్కులకు శాశ్వత భరోసాగా నిలుస్తాయని పేర్కొంటూ, పాస్ పుస్తకాలు అందుకున్న ప్రతి రైతు సోదరుడికి అభినందనలు తెలిపారు.

**క్యూఆర్ కోడ్‌తో భూమి వివరాలు... 15 రోజుల్లో తప్పుల సవరణ**

రాష్ట్రవ్యాప్తంగా 4,783 గ్రామాల్లో 22 లక్షల 33 వేల మంది రైతులకు రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు అందిస్తున్నామని జీవీ అంజనేయులు తెలిపారు. ఈ పాస్ పుస్తకాలకు చట్టబద్ధమైన విలువ ఉందని, బ్యాంకుల్లో రుణాలు పొందేందుకు ఉపయోగపడతాయని చెప్పారు.

**రైతుల మధ్య భూ వివాదాలకు శాశ్వత ముగింపు**

రైతుల మధ్య గట్లు, హద్దులు, భూ సరిహద్దులపై ఎలాంటి వివాదాలు లేకుండా చేయాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని జీవీ అంజనేయులు అన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో రెవెన్యూ వ్యవస్థ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొందని, ఇప్పుడు వీఆర్‌వోలు, ఎంఆర్‌వోలు, సర్వే సిబ్బంది కష్టపడి రైతుల సమస్యలను పరిష్కరిస్తున్నారని చెప్పారు. ఈ కొత్త పాస్ పుస్తకం రైతుకు శ్రీరామరక్షగా నిలుస్తుందని పేర్కొన్నారు.

**సంక్షేమం - అభివృద్ధి రెండింటినీ సమానంగా ముందుకు తీసుకెళ్తున్న ఎన్డీఏ ప్రభుత్వం**

గత ప్రభుత్వంలో ప్రతి పథకంపై వ్యక్తిగత ఫోటోలకు ప్రాధాన్యం ఇచ్చారని, కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాత్రం వ్యక్తిగత ప్రచారం కాకుండా రాజముద్రతో రైతుల హక్కులను కాపాడే పాస్ పుస్తకాలు అందిస్తున్నారని జీవీ అంజనేయులు అన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో మహిళలకు ఉచిత బస్సు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, "తల్లికి వందనం", కేంద్ర సాయంతో కలిపి రైతులకు రూ.20 వేల పెట్టుబడి సాయం, దివ్యాంగులకు రూ.6 వేల పెన్షన్ వంటి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో , ప్రభుత్వాధికారులు మరియు కూటమి నాయకులు నిశ్శంకర శ్రీను, నాగేశ్వరరావు, పెసల వెంకటనారాయణ, గోవింద్ నాయక్, హనుమా నాయక్, పరిటాల చంద్రయ్య, రంగయ్య, వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ కుట్రలో భాగంగానే మెగా డీఎస్సీపై వైసీపీ ఆరోపణలు

**●నిరుద్యోగ యువతలో అపోహలు సృష్టించేలా వైసీపీ చర్యలు : మండిపడ్డ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ**



పొన్నూరు (చైతన్యరథం): మెగా డీఎస్సీ నియామకాలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా రాజకీయ లబ్ధి కోసం చేస్తున్న కుట్రలో భాగమేనని నియోజకవర్గ టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం పొన్నూరులోని మున్సిపల్ కార్యాలయం ఎదుట నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ మాట్లాడుతూ... వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్ల పాలనలో జాబ్ క్యాలెండర్ ఇవ్వకుండా నిరుద్యోగ యువతను మోసం చేసి, విధ్వంసం, అరాచకాలతో పాలన సాగించిందన్నారు. ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తొలి సంతకంతోనే మెగా డీఎస్సీ నిర్వహణకు ఆమోదం తెలిపారని గుర్తు చేశారు. మెగా డీఎస్సీ ద్వారా సుమారు 16 వేల మంది అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగిందని, ఈ నియామకాలను అడ్డుకునేందుకు దాదాపు 200 కేసులు దాఖలైనప్పటికీ, అన్ని న్యాయపరమైన అడ్డంకులను అధిగమించి ప్రభుత్వం పారదర్శకంగా డీఎస్సీని విజయవంతంగా నిర్వహించిందని చెప్పారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు ఇప్పటికే శిక్షణ పూర్తి చేసుకుని విధుల్లో చేరుతున్న సమయంలో, దొంగలు పడిన ఆరు నెలలకు కుక్కలు మొరిగినట్లు ఇప్పుడు వైకాపా నిరసనలకు దిగడం హాస్యాస్పదమని ఎమ్మెల్యే ఎద్దేవా చేశారు. విధ్వంసకర ఆలోచనలతో డీఎస్సీపై నిరసనలు చేపట్టడం అత్యంత దురదృష్టకరమన్నారు. పొన్నూరు నియోజకవర్గానికి చెందిన అన్ని వర్గాల అభ్యర్థులు కలిపి 45 మంది డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందారని, వైసీపీ నాయకులకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే క్షేత్రస్థాయిలో ఆ అభ్యర్థులను, వారి కుటుంబాలను కలిసి మాట్లాడాలని సవాల్ విసిరారు. నిరుద్యోగ యువతలో అపోహలు సృష్టించేలా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తోందని విమర్శించిన ఆయన, గత ఐదేళ్ల పాలనలో ఒక్క డీఎస్సీ కూడా ఎందుకు నిర్వహించలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# విజయవాడలో టీడీపీ శ్రేణుల ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం

విజయవాడ (చైతన్యరథం): నగరంలోని 34వ డివిజన్ పరిధిలోని పేదరాశిరావుపేట మసీద్ సెంటర్‌లోని 130,131,135 బూతుల పరిధిలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు తెలుగుదేశం పార్టీ శ్రేణులు... కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నియోజకవర్గ పరిశీలకులు వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లెల ఈశ్వరరావు పాల్గొని కూటమి ప్రభుత్వం రెండేళ్ల కాలంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ వైస్ ప్రెసిడెంట్, మాజీ ఫ్లోర్ లీడర్ కొట్టేటి హనుమంతరావు, 34వ డివిజన్ అధ్యక్షులు అద్దూరి కొండలరావు, హబీబ్, మునిష, డాక్టర్ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



# వివక్షకు తావులేకుండా ప్రతి ఇంటికి అభివృద్ధి ఫలాలు : ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు (చైతన్యరథం): రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం రెండేళ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేసేందుకు నిర్వహిస్తున్న "ఇంటింటికి కూటమి ప్రభుత్వం – సంక్షేమ విజయాలు" కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. మంగళవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 33వ డివిజన్ పండరిపురంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో ఇంటింటికి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల వివరాలతో కూడిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రవ్యాప్తంగా మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. గతంలో కనీసం ఇంటి ముందు సరైన రహదారి కూడా లేని ప్రాంతాల్లో నేడు మెరుగైన రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలు, తాగునీటి సౌకర్యాలు, విద్యుత్ దీపాలు వంటి మౌలిక వసతులు కల్పిస్తూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.

# చంద్రబాబు ప్రజల ఆదాయం పెంచుతున్నారు : ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

**●రూ.52 లక్షలతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే**



చిలకలూరిపేట (చైతన్యరథం): జగన్ అధికారంలో ఉన్నన్నాళ్లు సొంత ఆదాయం పెంచుకుంటే... చంద్రబాబు రెండేళ్లలోనే ప్రజల జీవన ప్రమాణాలు, వారి తలసరి ఆదాయ పెంపునకు ప్రత్యేక ఆర్థిక విధానాలు అమలు చేస్తున్నారని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంపై వేసిన అప్పులభారం తగ్గిస్తూనే, ప్రతినెలా ప్రజల సంతోష స్థాయి ఏమాత్రం తగ్గకుండా, సంక్షేమ పథకాలు అమలు చేయడం సామాన్య విషయం కాదన్నారు.

**3 వార్డుల్లో రూ.52లక్షల విలువైన అభివృద్ధి పనులకు ప్రత్తిపాటి శంకుస్థాపన**

మంగళవారం ఆయన చిలకలూరిపేట పట్టణంలోని 13, 14, 8 వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా 8 వ వార్డులో రూ. 29 లక్షలతో నిర్మించే సీసీ రోడ్లు, డ్రైనేజ్ పనులకు, 13వ వార్డులో రూ. 6.80 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్లు, కల్వర్టు నిర్మాణానికి, 14వ వార్డులో రూ. 16 లక్షలతో నిధులతో చేపట్టిన సీసీరోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులకు స్థానిక కూటమి నాయకులతో కలిసి ప్రత్తిపాటి శంకుస్థాపన చేశారు. అనంతరం ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా ప్రత్తిపాటి.. కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనా విజయాలను ప్రజలకు వివరించారు.

**జగన్ ఐదేళ్లు తన ఆదాయంపై దృష్టిపెట్టి, రాష్ట్ర ఆదాయానికి గండికొట్టాడు..**

గత ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థికంగా, భౌతికంగా విధ్వంసానికి గురిచేయకుండా ఉండుంటే.. నేడు ప్రజలు అభివృద్ధిపనుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితులు ఉండేవి కావన్నారు. జగన్ సృష్టించిన ఆర్థిక విధ్వంసం వల్లే, నేడు ప్రజలు మరింత మెరుగైన సంక్షేమాన్ని, అభివృద్ధి ఫలాలు పొందడానికి ఆలస్యం అవుతోందన్నారు. జగన్ తన ఆదాయ పెంపుపై దృష్టి పెట్టి.. రాష్ట్ర ఆదాయానికి గండికొట్టాడని ప్రత్తిపాటి అసహనం వ్యక్తం చేశారు.

# తెలుగు భాషా-సంస్కృతికి విశిష్ట సేవలందించిన మండలి వెంకట కృష్ణారావు

**● నివాళులర్పించిన కృష్ణా జిల్లా టీడీపీ నేతలు**



మచిలీపట్నం (చైతన్యరథం): తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడు, మాజీ మంత్రి, తెలుగు భాషా-సంస్కృతికి విశిష్ట సేవలందించిన మండలి వెంకట కృష్ణారావు జయంతి సందర్భంగా మచిలీపట్నంలోని కృష్ణ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి మాట్లాడుతూ... మండలి వెంకట కృష్ణారావు ప్రజా సేవ, విద్యా రంగం, తెలుగు భాషాభివృద్ధికి ఎనలేని సేవలందించారని అన్నారు. ఆయన నిర్వహించిన వివిధ కీలక పదవులను, ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణలో పోషించిన విశిష్ట పాత్రను స్మరించుకున్నారు. తెలుగు భాష, సంస్కృతిని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పిన మహనీయుడిగా మండలి వెంకట కృష్ణారావు చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. మండలి వెంకట కృష్ణారావు జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, ఈ నిర్ణయం ద్వారా ఆయన సేవలు భావితరాలకు మరింత చేరువ అవుతాయని తెలిపారు.

**ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ** మండలి వెంకట కృష్ణారావు తెలుగు జాతి గర్వించదగ్గ మహనీయుడని అన్నారు. ప్రజా సేవ, విద్యాభివృద్ధి, సామాజిక సంక్షేమం, తెలుగు భాషా-సంస్కృతి పరిరక్షణకు ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ప్రపంచ తెలుగు మహాసభలను అత్యంత విజయవంతంగా నిర్వహించి ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చిన ఘనత మండలి వెంకట కృష్ణారావుదేనని పేర్కొన్నారు. పదవులు ప్రజలకు సేవ చేయడానికి ఒక అవకాశంగా భావించి, జీవితాంతం ప్రజల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేసిన ఆదర్శ నాయకుడిగా ఆయన నిలిచారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మండలి వెంకట కృష్ణారావు జయంతిని అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించడం అభినందనీయమని, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిస్తూ ఘన నివాళులర్పించారు.

**కృష్ణ జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ మాట్లాడుతూ...** మండలి వెంకట కృష్ణారావు గారు నిబద్ధత, నిజాయితీ, ప్రజా సంక్షేమానికి ప్రతీకగా నిలిచారని అన్నారు. ప్రజల కోసం నిరంతరం శ్రమించిన ఆయన విధానాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

# ప్రభుత్వ శాఖల్లో నిరంతరాయంగా ఐటీ సేవలు

**● ఏపీటీఎస్ జిల్లా ఐటీ మేనేజర్లతో సంస్థ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ సమీక్ష**



విజయవాడ (చైతన్యరథం): రాష్ట్రంలో ప్రభుత్వ శాఖలకు ఏపీటీఎస్ ద్వారా అందిస్తున్న ఐటీ సేవల పనితీరు, జిల్లాల వారీగా అమలవుతున్న సాంకేతిక సేవలు, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఐటీ మేనేజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మల్లవరపు సూర్యతేజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాల వారీగా ప్రభుత్వ కార్యాలయాల్లో నెట్‌వర్క్ నిర్వహణ, సర్వర్లు, కంప్యూటర్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ నిర్వహణ, ఇంటర్నెట్ కనెక్టివిటీ, వీడియో కాన్ఫరెన్సింగ్ వ్యవస్థలు, ప్రభుత్వ శాఖలకు అందిస్తున్న సాంకేతిక మద్దతు, పెండింగ్ సమస్యల పరిష్కారం తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ప్రతి జిల్లా ఐటీ మేనేజర్ తమ పరిధిలోని సేవల పురోగతిని వివరించగా, ఎదురవుతున్న సమస్యలు, అవసరమైన మౌలిక వసతులపై చర్చించారు. ఈ సందర్భంగా చైర్మన్ మన్నవ మోహనకృష్ణ మాట్లాడుతూ... ప్రభుత్వ శాఖలకు నిరంతరాయంగా నాణ్యమైన ఐటీ సేవలు అందించడంలో జిల్లా ఐటీ మేనేజర్ల పాత్ర కీలకమని అన్నారు. సాంకేతిక సమస్యలు తలెత్తిన వెంటనే స్పందించి, నిర్ణీత సమయంలో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రతి జిల్లా ఐటీ మేనేజర్ ఫీల్డ్ స్థాయిలో నిరంతర పర్యవేక్షణ నిర్వహిస్తూ, ప్రభుత్వ శాఖలతో సమన్వయం పెంచుకుని సేవల్లో జాప్యం లేకుండా పనిచేయాలని ఆదేశించారు. అలాగే జిల్లాల్లో ఎదురవుతున్న సమస్యలకు శాశ్వత పరిష్కారాలు రూపొందించి, రాష్ట్రవ్యాప్తంగా ఒకే విధమైన సేవా ప్రమాణాలు అమలు అయ్యేలా కృషి చేయాలని మన్నవ మోహన కృష్ణ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సూర్యతేజ మాట్లాడుతూ... ప్రభుత్వ శాఖలకు సకాలంలో నాణ్యమైన సాంకేతిక సేవలు అందించేందుకు జిల్లా ఐటీ మేనేజర్లు మరింత సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సేవల నాణ్యతను పెంచుతూ, సమస్యలను వేగంగా పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

జోన్-4
(ఒంగోలు, నెల్లూరు, రాజంపేట, తిరుపతి, చిత్తూరు)
చైతన్యరథం

## హనుమంతుడి ఆశీస్సులతో ముప్పాళ్ల విజేతరెడ్డి పదవీ స్వీకారం



నెల్లూరు (చైతన్యరథం): హనుమంతుడి ఆశీస్సులతో సంతపేట శ్రీ ఆంజనేయస్వామి ఆలయ చైర్‌పర్సన్‌గా ముప్పాళ్ల విజేతరెడ్డి అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధర్మవరం సుబ్బారావు ఆహ్వానం మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ రఘురామయ్య, స్థానిక నాయకులు కప్పిరా రేవతి, అమర్తులూరు భాస్కర్, కృష్ణారెడ్డి, డా. గణేష్ కుమార్, కాలవకుంట భాస్కర్, కంచి కృష్ణ, పట్నం శ్రీనివాసులు, కళాధర్, ప్రదీప్, లతీఫ్ తదితరులు పాల్గొని నూతన చైర్‌పర్సన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆలయ అధికారులు, అర్చకులు, బోర్డు సభ్యుల సమక్షంలో ముప్పాళ్ల విజేత రెడ్డి అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల విజేత రెడ్డి మాట్లాడుతూ... హనుమంతుడి ఆశీస్సులతో మంత్రి పొంగూరు నారాయణ సార్ సహకారంతో ఛైర్మన్‌గా అదృష్టం వరించిందని, ఆలయ అభివృద్ధి, భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు. నూతన చైర్‌పర్సన్‌కు ఘన సన్మానం నిర్వహించగా, ఆలయ ప్రాంగణం భక్తులు, నాయకులు, ప్రజాప్రతినిధులతో పండుగ వాతావరణాన్ని తలపించింది.

## చట్టాన్ని అతిక్రమిస్తే అరెస్టు చేయరా?

**●మాజీ ఎమ్మెల్యే ముస్తఫాకు చట్టంపై గౌరవం ఉంటే పారిపోవడం ఎందుకు ?**

**●మన ఇంటికి- మన నసీర్ కార్యక్రమంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్**



గుంటూరు (చైతన్యరథం) :'ఒక వైపు రైతులను కిడ్నాప్‌లు చేసిన వారిని వెనకేసుకొస్తూ.. మరో వైపు అన్నదాతలను పరామర్శల పేరిట మోసగించడం ఎంత వరకు సమంజసం జగన్? మీ పార్టీ మాజీ ఎమ్మెల్యే ముస్తఫా నిజాయితీపరుడని డబ్బాలు కొడుతున్నారు.. మరి చట్టాలను గౌరవించకుండా ఇష్టమొచ్చినరీతిన ఎలా వ్యవహరించారు ? అధికారంలో ఉన్నప్పుడు తన సోదరుని అరాచకాలను ఎందుకు నిలువరించలేదు. ముస్తఫా కుటుంబం ఆగడాలను నియోజకవర్గ ప్రజలందరూ చూస్తూనే ఉన్నారు. చట్టాన్ని అమలు చేస్తోన్న పోలీసులపై ఆరోపణలు చేయడమేంటి ? చట్టం తన పని తాను చేసుకుపోతుంది' అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ ప్రశ్నించారు. రెండేళ్ల నమ్మకం-అభివృద్ధి, సంక్షేమంలో భాగంగా మంగళవారం మన ఇంటికి-మన నసీర్ కార్యక్రమాన్ని స్థానిక డివిజన్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు ఇంట్లో ఎవరికి సంక్షేమ పథకాలు అందాయో? ఇంకా ఎవరైనా అర్హులకు అందకుండా మిగిలిందా? వంటి అంశాలపై ఆరా తీశారు. ప్రతి ఒక్కరికీ పథకాలు చేరువ చేస్తామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గంలో గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అన్ని ప్రాంతాలను సర్వనాశనం చేశారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు అరాచకాలకు కొమ్ముకాశారని విమర్శించారు. ఇప్పుడు తప్పులు చేసి కూడా బుకాయిస్తున్నారని, అసలు తప్పు చేయనప్పుడు పారిపోవాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. రాష్ట్రంలో కిడ్నాపర్లు, రౌడీలకే జగన్ కొమ్ముకాస్తారని, ప్రజల అవసరాలు మాత్రం గాలికొదిలేస్తారని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే ముస్తఫాపై అక్రమ కేసులు పెట్టారని గగ్గోలు పెడుతున్నారని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే పోలీసులు చూస్తూ ఊరుకోవాలా అని ప్రశ్నించారు.

## రెండేళ్లలో 90 శాతం హామీలు అమలు చేశాం

**●ప్రతి ఇంటికి గర్వంగా వెళ్లి కూటమి ప్రభుత్వ పథకాలను వివరిస్తున్నాం**

**: పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్**

పెదకూరపాడు (చైతన్యరథం): పెదకూరపాడు మండలం కాశిపాడు గ్రామంలో నిర్వహించిన రెండేళ్ల నమ్మకం ఇంటింటి ప్రచారం కార్యక్రమంలో పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పాల్గొన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ప్రజల ముందుకు గర్వంగా వెళ్తున్నామని అన్నారు. అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల్లోనే కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో దాదాపు 90 శాతం హామీలను అమలు చేసి చూపించామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే అన్నారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తోందని తెలిపారు. ప్రతి ఒక్కరి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను గర్వంగా వివరించగలుగుతున్నామని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు.

## "విద్య... వసతి.. వికాసం"లో దాతలు భాగస్వాములు కావాలి

**●నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల పిలుపు**

**●పేద విద్యార్థుల మెరుగైన భవిష్యత్తుకు కలెక్టర్ వినూత్న ప్రయత్నం అభినందనీయం**

**●ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కాకర్ల సురేష్, వెంకట కృష్ణారెడ్డి**



నెల్లూరు (చైతన్యరథం): ప్రభుత్వ హాస్టళ్లలో చదువుకుంటున్న నిరుపేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం జిల్లాలో వినూత్నంగా చేపట్టిన విద్య.. వసతి.. వికాసం కార్యక్రమంలో జిల్లాలోని ప్రముఖ పారిశ్రామికవేత్తలు, స్వచ్ఛంద సంస్థలు, దాతలు కూడా తమ భాగస్వామ్యాన్ని పంచుకోవచ్చని, విద్యార్థులకు అవసరమైన వసతులు, సామాగ్రిని హాస్టళ్లకు సమకూర్చేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. దాతలు అందించిన సామాగ్రి, పరికరాలపై వారి పేరును చిరస్థాయిగా నిలిచేలా పొందుపరుస్తామని చెప్పారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో విద్యా.. వసతి.. వికాసం కార్యక్రమాన్ని కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించారు.

**అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...** జిల్లాలోని 155 ఎస్సీ, ఎస్టీ, బీసీ, గిరిజన, మైనారిటీ సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించేందుకు రెండు నెలల ముందు నుంచే విద్యా.. వసతి.. వికాసం కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు కసరత్తు చేపట్టినట్లు వివరించారు. జిల్లాలోని సీఎస్ఆర్ నిధులు, దాతల సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. కమర్షియల్ టాక్స్, ఎక్సైజ్, మైనింగ్, పరిశ్రమల శాఖల అధికారులు తమ పరిధిలోని సంస్థలకు, ప్రముఖ వ్యక్తులకు ఈ కార్యక్రమం ఉద్దేశాన్ని వివరించి, వారిని ఇందులో భాగస్వామ్యం చేయాలని కోరారు. పేద బిడ్డలకు మంచి చేసే ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు తమ వంతు తోడ్పాటు అందించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. పేద విద్యార్థుల హాస్టళ్ళ అభివృద్ధికి సహకారం అందించాలనుకునే దాతలు dbcweo.nlr.18@gmail.com, cpo_nlr@yahoo.co.in ఈమెయిల్స్‌ను సంప్రదించాలని కోరారు.

**సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ...** రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మంత్రి నారా లోకేష్ చొరవతో విద్యారంగంలో పలు సంస్కరణలు అమలవుతున్నాయని, అదే స్ఫూర్తితో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల హాస్టళ్ల అభివృద్ధికి "విద్య.. వసతి.. వికాసం" కార్యక్రమాన్ని ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఈ గొప్ప కార్యక్రమానికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు.

కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి కలెక్టర్ నిర్ణయాన్ని ప్రత్యేకంగా స్వాగతించారు. ఈ పథకం ద్వారా హాస్టళ్ల రూపురేఖలతో పాటు పేద విద్యార్థులకు మంచి వసతి సౌకర్యాలు లభిస్తాయని చెప్పారు. ఈ పథకంలో హాస్టళ్ల కాంపౌండ్ వాల్స్, హాస్టల్ ప్రాంగణాల్లో కాంక్రీట్ ఫ్లోరింగ్, సీసీ కెమెరాలు వంటి ఏర్పాట్లపై కూడా దృష్టి సారించాలని సూచించారు.

**ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ మాట్లాడుతూ...** కలెక్టర్ వినూత్న నిర్ణయం సర్వత్రా అభినందనీయమని కొనియాడారు. ఉదయగిరి నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లు, గండిపాళెం గురుకుల పాఠశాలలో మెరుగైన వసతులు లభిస్తాయని సంతోషం వ్యక్తం చేశారు. మరోసారి ఉదయగిరి నియోజకవర్గంలోని హాస్టళ్లలో మౌలిక వసతులను పూర్తిస్థాయిలో కల్పించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విజయ్ కుమార్, డిప్యూటీ కలెక్టర్ కేశవర్ధన్ రెడ్డి, బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటలక్ష్మి, ఎస్సీ వెల్ఫేర్ అధికారి శోభారాణి, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి సుజాత, సంక్షేమ హాస్టళ్ల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల వేళ ఉనికి కోసం వైసీపీ అలజడులు సృష్టిస్తోంది

అనంతపురం (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల వేళ తమ ఉనికి కోసం రాష్ట్రంలో వైసీపీ అలజడులు సృష్టిస్తోందని.. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతపురం నగరంలోని 35వ డివిజన్, రాంనగర్ 80ఫీట్ రోడ్డులో ఆయన ఇవాళ ఇంటింటికి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆయనకు ఘన స్వాగతం పలికారు. కూటమి నాయకులతో కలిసి ఆయన ఇంటింటికి వెళ్లి రెండేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రత్యేకంగా ఆరా తీశారు. రెండేళ్లలో రూ.1296 కోట్లతో నియోజకవర్గంలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్రం ముందుకు సాగుతుందన్నారు.

## చీరాలలో ఘనంగా ఇంటింటికి తెలుగుదేశం... పాల్గొన్న ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య

చీరాల (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న "ఇంటింటికి టీడీపీ" ప్రచార కార్యక్రమంలో భాగంగా చీరాల పట్టణం మార్కెట్ సెంటర్ దగ్గర చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ఇంటింటికి వెళ్లి ప్రజలను కలుసుకుని, కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వ విజయాలను తెలియజేస్తూ కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ప్రతి ఇంటికి అభివృద్ధి - ప్రతి కుటుంబానికి సంక్షేమం అనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ప్రజల ఆశీర్వాదంతో మరింత అభివృద్ధి దిశగా పనిచేస్తామని ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య పేర్కొన్నారు. అవసరమైన చోట విధానపరమైన చర్యలు తీసుకుంటూ, ప్రాజెక్ట్ అమలును వేగవంతం చేయడానికి, సకాలంలో పూర్తి



చేయడానికి మరియు అవసరమైన చోట అడ్డంకులను తొలగించడానికి ప్రగతి మరియు పిఎమ్‌జి పోర్టల్‌లను ఉపయోగించుకుంటారని తెలిపారు.

## కూటమి రెండేళ్ల పాలనపై గంగాధర నెల్లూరులో ఇంటింటి ప్రచారం



చిత్తూరు (చైతన్యరథం): చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు నియోజకవర్గం ఎస్ఆర్ పురం మండలం క్షీర సముద్రం గ్రామంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ఆదేశాలతో... తెలుగుదేశం ప్రభుత్వం రెండేళ్ల పరిపాలనలో అభివృద్ధి సంక్షేమం నమ్మకంపై డోర్ టు డోర్ కార్యక్రమాన్ని ఎస్ఆర్‌పురం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్‌నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా గంధమనేని జయశంకర్ నాయుడు మాట్లాడుతూ... క్షీర సముద్రం గ్రామంలో బూత్ ఇన్‌ఛార్జ్‌లు, క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లు ప్రతి ఇంటికి వెళ్లి తెలుగుదేశం కార్యకర్తలు, మై టీడీపీ యాప్‌లో పార్టీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను అప్లోడ్ చేయాలని సూచించారు. తెలుగుదేశం సంక్షేమం కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో... సహకార సంఘ చైర్మన్ నిరంజన్ రెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ బాలాజీ నాయుడు, ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు గంధమనేని నరేష్ చౌదరి, సతీష్, నవీన్ గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

## శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో అర్జిత సేవలు, ఇతర ప్రత్యేక దర్శనాల రద్దు



తిరుమల (చైతన్యరథం): తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 15 నుంచి 23 వరకు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో తొమ్మిదిరోజుల పాటు అర్జిత సేవలైన అష్టదళ పాదపద్మారాధన సేవ, తిరుప్పావడ సేవ, కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, సహస్ర దీపాలంకరణ సేవలను రద్దు చేస్తున్నట్లు టిటిడి వెల్లడించింది. వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులు, ఎన్ఆర్ఐ, దాతల దర్శనాలను సైతం రద్దు చేసినట్లు దేవస్థానం తెలిపింది.

## అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వానికే సాధ్యం : ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



అమృతలూరు (చైతన్యరథం): అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వానికే సాధ్యమని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. కొల్లూరు మండలం ఈపూరు గ్రామంలో సోమవారం 'రెండేళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమం' ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ ఫలాలు అందుతున్నాయా లేదా అని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. గత రెండేళ్ల కాలంలో ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ ఉపాధ్యక్షులు, తెనాలి రోటరీ క్లబ్ చైర్మన్ డాక్టర్ కనగాల మధుసూదన్ ప్రసాద్, వేమూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, కొల్లూరు మండల కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, యూనిట్ ఇన్‌ఛార్జ్, బూత్ ఇన్‌ఛార్జ్, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పడుగుపాడులో రెండేళ్లలో రూ.4.28 కోట్ల అభివృద్ధి : ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



కోవూరు (చైతన్యరథం): నియోజకవర్గంలోని పడుగుపాడు పంచాయతీలో గత రెండేళ్లలో రూ.4.28 కోట్ల విలువైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చిన ధైర్యంతోనే ప్రజల ముందుకు వస్తున్నామని కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం పడుగుపాడు పంచాయతీలోని చంద్రమౌళి నగర్‌లో నిర్వహించిన 'రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం' ఇంటింటి ప్రచార కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అంతకుముందు రూ. 23 లక్షలతో నిర్మించిన విలేజ్ హెల్త్ సెంటర్, రూ. 3.50 లక్షలతో నిర్మించిన సామాజిక వికాస భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ప్రభుత్వం రెండేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికీ వెళ్లి వివరించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన పనులను వివరించడంతో పాటు ప్రజల అవసరాలను తెలుసుకుని రాబోయే మూడేళ్ల అభివృద్ధి కార్యాచరణను రూపొందించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ప్రభుత్వం ఏం చేసిందని ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాలు ముందుగా ఏం చేయలేదో ప్రజలకు చెప్పాలని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను రెండేళ్లలోనే దాదాపు పూర్తిస్థాయిలో అమలు చేసి సూపర్ హిట్ చేశామని ఎమ్మెల్యే తెలిపారు. తల్లికి వందనం, సామాజిక భద్రతా పెన్షన్ల పెంపు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, దీపం–2, అన్నదాత సుఖీభవ, ఆటో సేవలో, మత్స్యకారుల సేవలో, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, మెగా డీఎస్సీ ద్వారా 16 వేల ఉపాధ్యాయ నియామకాలు వంటి కార్యక్రమాలతో అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. విద్యా రంగంలో సీఎస్ఆర్ నిధులు, వీపీఆర్ ఫౌండేషన్ సహకారంతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

# దళిత మహిళపై వైసీపీ ఎమ్మెల్యే దాడి హేయం

**●బాధిత మహిళను పరామర్శించి ధైర్యం చెప్పిన టీడీపీ నేతలు... నేరస్థులను శిక్షిస్తామని వెల్లడి**



ఆలూరు (చైతన్యరథం): దళిత మహిళపై ఆలూరు వైసీపీ ఎమ్మెల్యే వీరుపాక్షి వారి అనుచరులు దాడి చేయడం హేయమని, ఇలాంటి చర్యలపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని టీడీపీ నేతలు వ్యాఖ్యానించారు. వైసీపీ నాయకుల దాడిలో గాయపడిన బాధిత మహిళను మంగళవారం మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్‌రాజు, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య, ఆలూరు టీడీపీ ఇన్‌ఛార్జ్ వైకుంఠం జ్యోతి, కర్నూలు జిల్లా టీడీపీ అధ్యక్షురాలుగుడిసె కృష్ణమ్మతో పాటు కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి తదితరులు నేమకల్ గ్రామానికి వెళ్లి పరామర్శించారు. ఘటన వివరాలను బాధిత మహిళను అడిగి తెలుసుకుని ధైర్యంగా ఉండాలని పార్టీ అన్నివిధాలుగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... దళిత మహిళపై దాడి హేయమైన చర్యగా పేర్కొన్నారు. కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వ అభివృద్ధిని చూసి ఓర్వలేకనే వైసీపీ నాయకులు దాడులకు పాల్పడుతున్నారని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలూరు నియోజకవర్గం చిప్పగిరి మండలంలోని నెమకల్లు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త నాగరాజు భార్య అయిన సుచిత్రపై వైసీపీ ఎమ్మెల్యే వీరుపాక్షి, వారి తనయుడు, సోదరుడు వారి అనుచరులు సుమారు 200 మంది దాడి చేయడం అమానుషమని అన్నారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ కక్షలతో మహిళలు, దళితులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలపై వైసీపీ వర్గీయులు దాడులకు దిగడం దారుణమని పేర్కొన్నారు. రాజకీయంగా ఎదుర్కోలేకనే వైసీపీ నాయకులు భౌతిక దాడులకు పాల్పడటం వారి బలహీనతకు నిదర్శనమన్నారు. అంబేద్కర్ ఆశయాలను నినదించే వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు దళితులపై జరిగిన దాడులను అరికట్టడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. దళిత మహిళ వస్త్రాన్ని చించివేసి దారుణంగా ప్రవర్తించి ఆ నెపాన్ని ఆమె భర్త మీద మోపి వైసీపీ వారి సోషల్ మీడియాలో వేసుకుంటూ నిజాన్ని వక్రీకరిస్తున్నారని అన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం బాధితులకు అండగా నిలుస్తుందని, చట్టం ముందు ఎవరైనా సమానమేనని స్పష్టం చేశారు. దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరారు. గతంలో వైసీపీ ప్రభుత్వం రాజారెడ్డి రాజ్యాంగం అమలు పరచి దళితుల అణిచివేతకు గురి చేస్తే ఇప్పుడు కూటమి ప్రభుత్వం అంబేద్కర్ రాజ్యాంగాన్ని అమలు పరచి దళితులకు అండగా నిలుస్తుందన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ శాంతి భద్రతలను పరిరక్షించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

## కర్నూలు టౌన్‌లో టీడీపీ నేతల ఇంటింటి ప్రచారం



కర్నూలు (చైతన్యరథం): కూటమి ప్రభుత్వ రెండేళ్ల నమ్మకం – సంక్షేమం, అభివృద్ధి –ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా మంగళవారం కర్నూలు టౌన్ 25వ వార్డులో 79వ బూత్‌లో ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకేపోగు ప్రభాకర్, నాయిబ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పాలకవీటి విజయ కుమార్ పాల్గొని ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమాన్ని, అభివృద్ధిని ప్రజలకు తెలియజేశారు. గత రెండేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన ప్రజాసంక్షేమ పథకాలు, మౌలిక వసతుల అభివృద్ధి కార్యక్రమాలు, పారదర్శక పాలన ద్వారా సాధించిన విజయాలను డైరెక్టర్ ప్రజలకు వివరించారు. ప్రభుత్వం చేపట్టిన ప్రతి సంక్షేమ కార్యక్రమం అర్హులైన లబ్ధిదారులకు చేరేలా ఈ కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ రాజశేఖర్ యాదవ్, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ బాలు, యూనిట్ ఇన్‌ఛార్జ్ సుధాకర్‌రెడ్డి బూత్ ఇన్చార్జులు శ్రీనివాసులు గౌడ్, టి మధు ఏ భాను స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ప్రజల నుంచి విశేష ఆదరణ లభించడంతో కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది.

## తాగునీటి సమస్యకు పరిష్కారం చూపుతాను



తిరుపతి (చైతన్యరథం): తిరుపతి అబ్బన్న కాలనీలో నీటి సమస్య నెలకొని ఉందని, దీనికి తాత్కాలికంగా సొంత ఖర్చులతో వాటర్ ట్యాంక్ తోలుతామని, త్వరలో శాశ్వత పరిష్కారం చూపేందుకు చొరవ తీసుకుంటానని తిరుపతి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ జేబీ శ్రీనివాస్ అన్నారు. తిరుపతి 9 క్లస్టర్ 33వ డివిజన్ అబ్బన్న కాలనీలో ఉత్సాహంగా కూటమి ప్రభుత్వం సంక్షేమ విజయాలపై డోర్ టు డోర్ కార్యక్రమం మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడారు. స్థానికంగా నెలకొన్న సమస్యలపై ప్రజలతో మాట్లాడుతూ వారి సమస్యలపై అధికారులతో చర్చించి వెంటనే కొన్నింటిని పరిష్కరించారు.

## కప్పట్రాళ్ల గ్రామంలో ఘనంగా 'ఇంటింటికీ తెలుగుదేశం'



కప్పట్రాళ్ల (చైతన్యరథం): ప్రజలకు మరింత చేరువగా ఉంటూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి కుటుంబానికి వివరించాలనే లక్ష్యంతో కప్పట్రాళ్ల గ్రామంలో 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను వివరించారు. ప్రభుత్వ పథకాల ద్వారా తమ కుటుంబాలకు అందుతున్న ప్రయోజనాలను పలువురు ప్రజలు బొజ్జమ్మకు వివరించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామంలోని ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకుని, స్థానికంగా ఉన్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని బొజ్జమ్మ హామీ ఇచ్చారు. ప్రజలతో మమేకమై, ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడమే తెలుగుదేశం పార్టీ లక్ష్యమని ఆమె తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం –– గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని బొజ్జమ్మ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం : ఎమ్మెల్యే భూమా

ఆళ్లగడ్డ (చైతన్యరథం): కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పేర్కొన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని ఎంపీ నగర్ లో ఇంటింటికీ తెదేపా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి ప్రజలతో మమేకమై కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. ఈ క్రమంలో రూ. 29.60 లక్షలతో నూతనంగా నిర్మించిన భవిత కేంద్ర భవనాన్ని ఆమె ప్రారంభించారు. ప్రభుత్వం తరపున ఆరు మండలాలకు సంబంధించి భవిత భవనాలు మంజూరయ్యాయని తెలిపారు. దివ్యాంగుల పిల్లలకు చదువుతోపాటు మానసిక, శారీరక శిక్షణ ఇస్తూ వారి భవితకు ప్రభుత్వం బాటలు వేస్తోందన్నారు.

ప్రవాసాంధ్ర NRI TDP చైతన్యరథం

### ఏపీఎన్ఆర్టీఎస్ నైజీరియా ప్రతినిధిగా

# చంద్రశేఖర్ ధూళిపూడి



**తెనాలి టౌన్ (చైతన్యరథం):** ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ (APNRTS) నైజీరియా ప్రతినిధిగా తెనాలికి చెందిన ప్రవాస భారతీయుడు ధూళిపూడి చంద్రశేఖర్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నట్టు ఆయన వెల్లడించారు. తెనాలి పట్టణంలోని చెంచుపేటకు చెందిన చంద్రశేఖర్ 2004లో నైజీరియా వెళ్లారు. అక్కడ 'ఫ్యాషన్ డెయిరీ' సంస్థలో ఫైనాన్షియల్ కంట్రోలర్‌గా వృత్తి జీవితాన్ని ప్రారంభించిన ఆయన డెయిరీ రంగంలో విశేష అనుభవం సంపాదించారు. 2018లో నైజీరియాలోనే సొంతంగా 'నేచురల్ డెయిరీ' స్టార్టప్‌ను ప్రారంభించి విజయం సాధించారు. గత ఏడాది జూన్‌లో జిగావా రాష్ట్ర గవర్నర్ నాయకత్వంలో ఒక ఉన్నత స్థాయి ప్రతినిధుల బృందాన్ని ఆంధ్రప్రదేశ్‌కు తీసుకువచ్చి ఇక్కడ ఉన్న సంగం డెయిరీ, చిన్న పరిశ్రమలు, విత్తన కంపెనీలను చూపించి ఏపీ-నైజీరియా వ్యాపార సంబంధాలకు మార్గాన్ని సుగమం చేశారు.

"నైజీరియాలో సుమారు 7వేలకు పైగా తెలుగు ప్రజలు ఉన్నారు. APNRT ప్రతినిధిగా తెలుగు సమాజాన్ని సమన్వయం చేసుకుంటూ రెండు ప్రాంతాల నడుమ ఆర్థిక, సాంస్కృతిక, సామాజిక బంధాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా పని చేస్తాను. రాష్ట్ర ప్రభుత్వం నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను." అని చంద్రశేఖర్ పేర్కొన్నారు.






# ఆమె గాత్రం అజరామరం

## గాన కోకిల ఎస్.జానకికి డల్లాస్‌లో సంగీత నివాళి

**ఫ్రిస్కో (డల్లాస్):** తన గాన మాధుర్యంతో కోట్లాది మంది సంగీతాభిమానులను అలరించిన గాన కోకిల, ప్రముఖ నేపథ్యగాయని ఎస్.జానకికి డల్లాస్‌లోని తెలుగు కళాభిమానులు ఘనంగా నివాళులర్పించారు. డల్లాస్ గాట్ ఇండియా టాలెంట్ (DGIT) వ్యవస్థాపకుడు రామన్ వీరంరాజు ఆధ్వర్యంలో 'కళావాహిని' వ్యవస్థాపకుడు అనంత్ మల్లవరపు నిర్వహణలో ఫ్రిస్కోలోని 'శుభమ్ ఈవెంట్ సెంటర్-A2B' వేదికగా ప్రత్యేక నివాళి కార్యక్రమం ఘనంగా జరిగింది. వ్యాఖ్యాతగా వ్యవహరించిన పరిమళ మార్పాక... ఎస్.జానకి సంగీత ప్రస్థానం, ఆమె జీవిత విశేషాలను చక్కగా వివరించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ ప్రసాద్ తోటకూర మాట్లాడుతూ... "గాయని ఎస్.జానకి ఏ భావాన్నైనా తన గాత్రంతో సహజంగా పలికించగలరు. రెండేళ్ల పసిపాప నుంచి తొంభై ఏళ్ల వృద్ధురాలి వరకు ఏ స్వరాలనైనా అద్భుతంగా పలికించే అరుదైన సామర్థ్యం ఆమె సొంతం. సంగీత దర్శకుల అభిరుచికి అనుగుణంగా శాస్త్రీయ, జానపద, ప్రేమ, భక్తి గీతాలను వేలాదిగా ఆలపించారు. అనేక ప్రతిష్టాత్మక పురస్కారాలు అందుకున్నా నిత్య విద్యార్థినంటూ ఎంతో నిరాడంబరంగా జీవించారు." అన్నారు. ఆరు దశాబ్దాల పాటు 15 భాషల్లో 50వేలకు పైగా పాటలు పాడిన జానకి గాత్ర ప్రయాణం అజరామరమని కొనియాడారు. మరొక వక్త డాక్టర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జానకి గానం భారతీయ సంగీతానికి లభించిన అపూర్వ వరమని, ఆమె పాటలు సంగీతాభిమానులను ఎప్పటికీ అలరిస్తూనే ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమ నిర్వాహకులు రామన్ వీరంరాజు, అనంత్ మల్లవరపు మాట్లాడుతూ... విదేశాల్లో పెరుగుతున్న తెలుగు తరాలకు మన సంగీత, సాహిత్య, సాంస్కృతిక వారసత్వాన్ని దగ్గర చేయడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. భారతీయ కళలను ప్రోత్సహించేలా భవిష్యత్తులో మరిన్ని నాణ్యమైన కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ఆడియో సహకారం అందించిన బాల గణపవరపుతో పాటు వేదిక అందించిన A2B యాజమాన్యానికి నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.









## ప్రముఖులను కలిసిన జయకుమార్ గుంటుపల్లి

**అమరావతి (చైతన్యరథం):** ఇటీవల యూరప్ స్పెషల్ రెప్రజెంటేటివ్‌గా నియమితులైన జయకుమార్ గుంటుపల్లి అమరావతి విచ్చేశారు. మంత్రులు నారా లోకేష్, కొండపల్లి శ్రీనివాస్, చీఫ్ సెక్రటరీ సాయిప్రసాద్, ఏపీఎన్ఆర్టీఎస్ చైర్మన్ రవికుమార్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు.





### దుబాయ్‌లో భారత కాన్సుల్ జనరల్‌గా

# డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి

## బాధ్యతలు స్వీకరించిన తొలి తెలుగు వ్యక్తి





**దుబాయ్:** దుబాయ్‌లో భారత కాన్సుల్ జనరల్‌గా తెలుగు వ్యక్తి డాక్టర్ ఇమ్మడి విష్ణువర్ధన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. దీంతో దుబాయ్, ఇతర ఎమిరేట్‌ల్లోని తెలుగు ప్రవాసీల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సందర్భంగా దుబాయ్‌లోని తెలుగు ప్రవాసీ సంఘమైన తెలుగు 'రసమయి' అధ్యక్షుడు ఎస్వీ రెడ్డి ఆధ్వర్యంలో కొందరు తెలుగు ప్రముఖులు విష్ణువర్ధన్‌రెడ్డిని కలిశారు. దుబాయ్, ఉత్తర ఎమిరేట్‌లలో తెలుగు రాష్ట్రాలకు చెందిన సగటు కార్మికుల జీవన స్థితిగతులను వారు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కాగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం నిర్వహించిన తొలి అధికారిక సమావేశంలో వరల్డ్ తెలుగు ఐటీ కౌన్సిల్ చైర్మన్ సందీప్‌కుమార్ మక్తాల నేతృత్వంలోని ప్రతినిధి బృందం కాన్సుల్ జనరల్ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలియజేసింది. ఈ భేటీలో ముఖ్యంగా కృత్రిమ మేధ, సెమీ కండక్టర్లు, స్టార్టప్‌లు, డిజిటల్ టెక్నాలజీ రంగాల్లో భారత్-యుఏఈ మధ్య ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని పెంపొందించడంపై విశ్లేషించారు. డబ్ల్యూటీఐటీసీ ప్రతినిధులతో పాటు దుబాయ్‌కు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్తలు తోట రామకుమార్, ఎస్వీ రెడ్డి, వూర కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## ఇద్దరు జవాన్లను కాల్చి.. సీఆర్పీఎఫ్ ఏఎస్ఐ ఆత్మహత్య

అస్సాంలోని నాగావ్ జిల్లా కటిమారి సీఆర్పీఎఫ్ క్యాంపులో విషాద ఘటన చోటుచేసుకుంది. విధుల్లో ఉన్న ఏఎస్ఐ బల్లానీ ప్రేమాబరం తన సహచరులపై కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఇద్దరు జవాన్లు మరణించగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన అనంతరం ప్రేమాబరం ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. ప్రేమాబరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా అధికారులు గుర్తించారు. ఈ కాల్పుల్లో విష్ణు ప్రసాద్ బఘేల్, రామ్నవాల్ సింగ్ అనే జవాన్లు ప్రాణాలు కోల్పోయారని అధికారులు వెల్లడించారు. ఎఎస్ఐ మానే గోవింద్ గాయపడగా.. చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

## 'ఈ20కి వ్యతిరేకంగా పోరు ఉధృతం చేస్తాం'

ఈ20 ఇంధన విధానానికి వ్యతిరేకంగా చేపట్టిన ఆందోళనను దేశవ్యాప్తంగా మరింత ఉధృతం చేస్తామని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ స్పష్టం చేశారు. దీనినుంచి దేశ ప్రజలకు విముక్తి కలగాలంటే వందల మంది సరిపోరని.. పెద్ద సంఖ్యలో ప్రజలు రోడ్లపైకి వచ్చి పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ఈ20 ఇంధన విధానానికి వ్యతిరేకంగా సేకరించిన దాదాపు 2.3 లక్షల వినతి పత్రాలతో మంగళవారం ప్రధానమంత్రి నివాసం వైపు వెళ్తున్న కేజ్రీవాల్, ఆప్ నాయకులను ఢిల్లీ పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారు ఫిరోజ్ షా రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. తాము సేకరించిన వినతి పత్రాలను ప్రధానికి అందిస్తామని.. తమ వినతిని పీఎంఓకు చేరవేయాలని డిమాండ్ చేశారు.

కేజ్రీవాల్ మాట్లాడుతూ.. "గోవా, గుజరాత్ రాష్ట్రాల్లో ఆప్ ఎమ్మెల్యేలున్నారు. అక్కడ కూడా ఈ 20 విధానాన్ని ప్రశ్నిస్తాం. పార్లమెంట్‌లో ఈ అంశాన్ని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ ప్రస్తావించగా ఈ విధానం అమలుకే మొగ్గుచూపుతున్నట్లు కేంద్రంనుంచి సమాధానం వచ్చింది. ఈ విధానం వల్ల భారత రైతులకు కాకుండా అమెరికా రైతులకు లాభం చేకూరుతుంది. అమెరికా నుంచి ఇథనాల్ దిగుమతులు నిలిపివేసి భారత రైతుల ప్రయోజనాలను కాపాడాలి" అని ప్రధానిని కోరారు.



## బీమా లేకుంటే.. పెట్రోల్ బంద్

ఇన్సూరెన్స్ లేకుండా పెద్ద సంఖ్యలో వాహనాలు రోడ్లపై తిరగడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. ఇందుకు సంబంధించి కీలక తీర్పు వెలువరించిన సర్వోన్నత న్యాయస్థానం.. వీటిని అరికట్టేలా చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని ఆదేశించింది. ముఖ్యంగా థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ లేకపోతే పెట్రోల్ బంకుల్లో ఇంధనం నిరాకరించాలని, ఇందుకోసం ఓ పైలట్ ప్రాజెక్ట్ చేపట్టాలని సూచించింది. మోటార్ వాహనాల చట్టంలోని నిబంధనలను పాటించకపోవడాన్ని ప్రస్తావించిన జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం.. దేశంలోని రహదారులపై తిరుగుతున్న వాటిలో సగానికి పైగా వాహనాలకు బీమా లేకపోవడం ఆందోళన కలిగించే విషయమని పేర్కొంది. బీమా లేనివాటికి బంకుల్లో ఇంధనం నిరాకరించడం వల్ల రెండు ప్రయోజనాలుంటాయని సుప్రీం కోర్టు పేర్కొంది. బీమా లేని వాహనాలను గుర్తించడం, మరోవైపు చెల్లుబాటు అయ్యే ఇన్సూరెన్స్ ఉందా? లేదా అనే విషయం యజమానులకు తెలియజేయడంలో దోహదపడుతుందని అభిప్రాయపడింది. జాతీయ రహదారులపై భారీ సంఖ్యలో చోటుచేసుకుంటున్న రోడ్డు ప్రమాదాలు, టోల్ ప్లాజాల వద్ద ఏర్పడుతున్న పొడవైన క్యూల ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం.. ఇటువంటి కారిడార్లలో పైలట్ ప్రాజెక్టులను అమలు చేయాలని కేంద్రాన్ని ఆదేశించింది.

# 'మెటా'కు మరో సమన్!

### ప్రధాని మోదీ వీడియో వివాదం.. అల్గారిథమ్‌పై అనుమానం



ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటాకు కేంద్ర ప్రభుత్వం మరోసారి నోటీసులు జారీ చేసింది. ప్రధాని నరేంద్ర మోదీ వీడియో సందేశాన్ని ఫేస్‌బుక్ కొంతసేపు తొలగించిన ఉదంతంపై ఇప్పటికే ఆ సంస్థకు నోటీసులిచ్చిన కేంద్రం, తాజాగా మెటా పబ్లిక్ పాలసీ హెడ్ జో కాప్లన్‌కు రెండోసారి నోటీసులు పంపింది. బుధవారం అత్యున్నతస్థాయి ప్రతినిధులతో హాజరై ప్రభుత్వ అధికారులతో చర్చించాలని ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ మెటాను కోరింది. వీరితోపాటు ఇన్‌స్టాగ్రామ్ సాంకేతిక అధికారులను కూడా సమావేశానికి ఆహ్వానించినట్లు తెలిపింది. సామాజిక మాధ్యమ వేదికపై కొన్ని ప్రభుత్వ వ్యతిరేక పోస్టులకు అసాధారణ ఆదరణ లభిస్తోందంటూ పెద్దసంఖ్యలో ఫిర్యాదులు అందినట్లు అధికారులు వెల్లడించారు. దీంతో మెటా అల్గారిథం పనితీరును లోతుగా తెలుసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే మోదీ వీడియో తొలగింపునకు దారితీసిన సాంకేతిక లోపంపై లిఖితపూర్వక వివరణ కోరే అవకాశం ఉందని సమాచారం. గతవారం మెటా ఉన్నతాధికారులతో జరిగిన భేటీలో, ప్రధాని పోస్టులకు అదనపు భద్రతా ఏర్పాట్లు చేస్తామని, ప్రముఖుల ఖాతాలపై మరింత నిఘా ఉంచుతామని మెటా బృందం హామీ ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. వివాదం మొదలైంది ఈ నెల 23న విద్యార్థుల ఉద్యమంపై మోదీ వెలువరించిన తొలి వీడియో సందేశాన్ని ఫేస్‌బుక్ తొలగించడంతో. దీనిపై భాజపా కార్యకర్త ప్రీతీ గాంధీ 'ఎక్స్'లో తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశ ప్రధాని సెల్ఫీ వీడియోను అడ్డుకోవడమేమిటని ప్రశ్నించారు. ఈ పరిణామాల నేపథ్యంలో యూజర్ల గోప్యత పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపై వివరణ కోరుతూ మెటా (ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్), గూగుల్, ఎక్స్, స్నాప్‌చాట్‌లకు పార్లమెంటరీ స్థాయీసంఘం నోటీసులు జారీ చేసింది. దీనిపై స్పందించిన మెటా, ఆటోమేటిక్ కంటెంట్ వడపోత విధానంలో వచ్చిన సాంకేతిక సమస్య వల్లే ఇలా జరిగిందని వివరణ ఇచ్చింది. అయితే ఈ వివరణతో ప్రభుత్వం సంతృప్తి చెందకపోవడంతో, అత్యున్నత స్థాయి ప్రతినిధులతో నేరుగా హాజరై వివరణ ఇవ్వాలంటూ సంస్థకు తాజా సమన్లు జారీ చేసింది.




### యూపీఐపై ఛార్జీలు.. త్వరలో మార్పు?

యూపీఐ సేవలపై స్వల్ప ఫీజు వసూలుకు కేంద్రం సిద్ధమవుతోంది. దీనికోసం పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ యాక్ట్‌కు పార్లమెంట్‌లో సవరణలు చేయాలని భావిస్తోంది. ఇది అమలైతే, పేమెంట్ ఇండస్ట్రీ ఎప్పటినుంచో కోరుతున్న మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) అమల్లోకి వస్తుంది. ప్రతిపాదన ప్రకారం రూ.2,000కు మించిన లావాదేవీలపై 0.3 నుంచి 0.5 శాతం ఛార్జీ విధిస్తారు. అయితే ఇది వినియోగదారులపై కాకుండా, పేమెంట్ అందుకునే వ్యాపారులపైనే పడుతుంది. అది కూడా వార్షికాదాయం రూ.1.5 కోట్లు దాటిన భారీ వ్యాపారులకే వర్తిస్తుంది. చిన్న వ్యాపారులపై ప్రభావం ఉండదు. ప్రస్తుతం ఇది ప్రతిపాదన దశలోనే ఉంది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తోపాటు ఉన్నతాధికారులు దీని అమలు తీరు, చట్టబద్ధతపై పరిశీలన చేస్తున్నారు.

# ఉదయనిధి అరెస్ట్.. విడుదల.. స్టాలిన్ ఫైర్!

### రాజకీయ వివాదంగా మారిన త్రిషపై ఉదయనిధి వ్యాఖ్యలు



నటి త్రిషపై అభ్యంతరకర వ్యాఖ్యల వ్యవహారంలో డీఎంకే నేత, ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్‌ను పోలీసులు మంగళవారం ఉదయం చెన్నై నివాసంలో అరెస్టు చేసి తంజావూరుకు తరలించారు. కావేరీ జల వివాదంపై సోమవారం మాట్లాడుతూ టీవీకే ప్రభుత్వాన్ని విమర్శించే క్రమంలో, కార్యకర్తలు 'త్రిష, త్రిష' అంటూ నినదించడంతో ఆయన నటి గురించి ద్వంద్వార్థం ధ్వనించేలా వ్యాఖ్యానించారు. దీనిపై తీవ్ర రాజకీయ దుమారం రేగడంతో టీవీకే ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. బెయిల్ కోసం ఉదయనిధి మద్రాస్ హైకోర్టును ఆశ్రయించగా, అత్యవసర విచారణ చేపట్టిన ధర్మాసనం జ్యుడీషియల్ రిమాండ్ అవసరం లేదని, విచారణ ముగియగానే స్టేషన్ బెయిల్‌పై విడుదల చేయాలని ఆదేశించింది. దీంతో మంగళవారం సాయంత్రం ఆయనను విడుదల చేశారు. ఈ పరిణామాలపై డీఎంకే అధినేత, మాజీ సీఎం ఎంకే స్టాలిన్ తీవ్రంగా స్పందించారు. కావేరీ, మేకెదాటు ప్రాజెక్టుపై కేంద్రం తమిళనాడు హక్కులను అణచివేస్తోందని, దానిపై ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడితే బదులివ్వలేక దృష్టి మళ్లించేందుకే తన కుమారుడిని అరెస్టు చేయించారని సీఎం విజయ్‌పై మండిపడ్డారు. ఆయనను 'డమ్మీ సీఎం'గా, మంత్రివర్గాన్ని 'జోకర్ క్యాబినెట్'గా అభివర్ణించారు. కస్టడీ అవసరం లేదని ప్రభుత్వమే చెప్పినప్పుడు తంజావూరుకు ఎందుకు తరలించారని ప్రశ్నించిన స్టాలిన్, కోర్టు ఆదేశాలు ప్రభుత్వానికి చెంపపెట్టు అని ఎద్దేవా చేశారు. బడ్జెట్ సమావేశాలకు ముందు తన కుమారుడిని దూరంగా ఉంచేందుకే కుట్రపూరితంగా అరెస్టు చేయించారని ఆరోపించారు. తన కుమారుడు ఎవరినీ కించపరచలేదని, నిరూపిస్తే క్షమాపణ చెబుతానని పేర్కొన్న స్టాలిన్.. సీఎం విజయ్ రీల్స్ మాని బాధ్యతగా వ్యవహరించాలని విమర్శించారు.

**వివాదాల ఉదయనిధి!**

నటి త్రిషపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేసి రాజకీయంగా తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నారు ఉదయనిధి స్టాలిన్. కర్ణాటక-తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వాల మధ్య నడుస్తోన్న కావేరీ జలాల వివాదంపై మొదలు పెట్టిన ప్రసంగం కాస్తా పక్కదారి పట్టడంతో చివరకు ఆయన పోలీస్ స్టేషన్ వరకు వెళ్లాల్సి వచ్చింది. గతంలోనూ ఆయన పలుసార్లు ఇలాగే ప్రసంగాలు చేసి విమర్శలను మూటగట్టుకున్నారు. విజయ్ తమిళనాడు రాజకీయాల్లోకి ప్రవేశించినప్పటి నుంచి ఆయన విమర్శకుల నోళ్లలో నటి త్రిష పేరు ఎక్కువగా వినిపిస్తోంది. ఇప్పుడు ఆమెను ఉద్దేశించి డబుల్ మీనింగ్ డైలాగ్ ఉదయనిధి మాట్లాడటం గమనార్హం. కొన్ని నెలల క్రితం ఆయన టీవీకే ఎమ్మెల్యేలను లక్ష్యంగా చేసుకున్నారు. "త్వరలో టీవీకే ఎమ్మెల్యేలు అసెంబ్లీ ప్రాంగణంలో ఐటమ్ సాంగ్స్ ప్లే చేసి, వాటికి డ్యాన్స్ కూడా చేస్తారు" అని కించపర్చారు.

2021లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా.. అప్పటి తమిళనాడు ముఖ్యమంత్రి పళనిస్వామిని ఉద్దేశించి అమర్యాదకరంగా మాట్లాడారు. పళనిస్వామి నిస్సహాయ స్థితిలో శశికళ ముందు మోకరిల్లడానికి వెళ్లారని అనుచితంగా మాట్లాడారు. శశికళ తీరును విమర్శించడంతో మహిళా సంఘాలు, ఏఐడీఎంకే వర్గాలు తీవ్రనిరసన వ్యక్తంచేశాయి. సీనియర్ నేతలను పక్కకు నెట్టి.. ఉదయనిధి పార్టీలో ఉన్నతస్థానానికి చేరతారని 2021 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రధాని మోదీ విమర్శలు చేయగా.. వాటికి ఉదయనిధి స్పందించారు. అరుణ్ జైట్లీ, సుష్మా స్వరాజ్ మరణాలకు పని ఒత్తిడికి లింక్ పెట్టి, వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. సుష్మ, జైట్లీ కుమార్తెలు ఆ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు ఎలక్షన్ కమిషన్ ఈ డీఎంకే నేతకు నోటీసులు ఇచ్చింది. సెప్టెంబరు 2023లో తమిళనాడులో జరిగిన ఓ కార్యక్రమంలో ఉదయనిధి మాట్లాడుతూ.. 'సనాతన ధర్మాన్ని నిర్మూలించాలి' అని అన్నారు. ఇది సామాజిక న్యాయానికి వ్యతిరేకమని పేర్కొన్నారు. దీనిపై అప్పట్లో దేశవ్యాప్తంగా దుమారం చెలరేగింది.



## మంటల్లో ప్రాణాలు

- **ఇంగ్లీష్ ఛానెల్‌లో బోటు అగ్నిప్రమాదం**
- **157మంది వలసదారుల ప్రాణరక్షణ**

ఫ్రాన్స్ నుంచి బ్రిటన్‌కు అక్రమంగా వెళ్తున్న వలసదారుల బోటు మంగళవారం వేకువజామున ఇంగ్లిష్ ఛానెల్‌లో అగ్నిప్రమాదానికి గురైంది. సిబ్బంది ఇచ్చిన సమాచారంతో రెస్క్యూ టీంలు వేగంగా స్పందించి, బోటు పూర్తిగా దగ్ధమయ్యేలోపే 157 మంది వలసదారుల్ని కాపాడాయి. బ్రిటన్, ఫ్రాన్స్ సిబ్బంది సంయుక్తంగా రక్షణ చర్యలు చేపట్టారు. ఇతర బాధితుల వివరాలు వెల్లడికాలేదు. అక్రమ వలసలకు అత్యంత ప్రమాదకర మార్గంగా పేరున్న ఈ జలమార్గంలో 2018-2025 మధ్య 168 మంది ప్రాణాలు కోల్పోయినట్లు నివేదికలు చెబుతున్నాయి. బౌలోగ్నే-సుర్-మెర్ సరిహద్దు వద్ద అధికారులు నిరంతర నిఘా కొనసాగిస్తున్నారు.



## కార్చిచ్చు కాటు...

- **వాషింగ్టన్‌లో విస్తరిస్తోన్న కల్లోలం**
- **60వేల మంది జనం తరలింపు**

అమెరికా వాషింగ్టన్ రాష్ట్రంలో కార్చిచ్చు తీవ్ర విధ్వంసం సృష్టిస్తోంది. 16 ప్రాంతాల్లో మంటలు వ్యాపించగా, మరో 60 వేలమందిని అధికారులు తాత్కాలిక శిబిరాలకు తరలించారు. మంటలకు కారణమైన స్పోకేన్ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. బలమైన గాలులు, పొడి వాతావరణం మంటల నియంత్రణను సవాలుగా మారుస్తున్నాయి. ట్రంప్‌తో చర్చల అనంతరం గవర్నర్ బాబ్ ఫెర్గూసన్ రాష్ట్రవ్యాప్త అత్యవసర పరిస్థితి ప్రకటించారు. అగ్నిమాపక కార్యకలాపాలకు అంతరాయం కలిగిస్తున్న డ్రోన్‌ల వినియోగంపై నిషేధం విధించారు. ఆదివారం ఒక్కరోజే 26 సార్లు ఆటంకం ఏర్పడినట్లు అధికారులు తెలిపారు. ఉష్ణోగ్రతలు మళ్లీ పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.



## టారిఫ్‌లపై తిరుగుబాటు

- **ట్రంప్ నిర్ణయంపై కోర్టులో యుద్ధం**
- **25 రాష్ట్రాల సవాల్**

భారత్ సహా 60 దేశాలపై ట్రంప్ విధించిన కొత్త సుంకాలను సవాల్ చేస్తూ డెమొక్రటిక్ పార్టీ నేతృత్వంలోని 25 అమెరికా రాష్ట్రాలు న్యూయార్క్‌లోని 'యుఎస్ కోర్ట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ట్రేడ'ను ఆశ్రయించాయి. ప్రభుత్వం చట్టబద్ధ పరిమితులు దాటిందని ఆరోపిస్తూ దావా వేశాయి. వెట్టి చాకిరీ ద్వారా తయారైన దిగుమతులపై నిషేధం సరిగా అమలు కావడం లేదన్న కారణంతో గత నెల 10-12.5 శాతం సుంకాలు విధించారు. భారత్‌పై తొలుత 12.5 శాతం ప్రతిపాదించినా, వెట్టిచాకిరీ నిరోధక చట్టాల అమలు వేగవంతం చేయడంతో 10 శాతానికి తగ్గించారు. చమురు, ఎరువులు, ఖావీజూా వస్తువులకు మినహాయింపు ఉంది. ఇది ట్రంప్ వాణిజ్య విధానాలకు మరో కీలక న్యాయపరీక్షగా మారనుంది.

# టెహ్రాన్‌కు 'లాస్ట్ ఛాన్స్'!

### అమెరికా కొత్త వ్యూహం.. అగ్నిపరీక్షలో ఇరాన్

పశ్చిమాసియా యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా విధించిన షరతులను ఇరాన్ ఇంకా అంగీకరించడం లేదు. ఈ నేపథ్యంలో టెహ్రాన్‌ను లక్ష్యంగా చేసుకునేందుకు వినూత్న, సంప్రదాయేతర మార్గాలు సూచించాలని అమెరికా సెంట్రల్ కమాండ్ తమ బలగాలకు ఈ-మెయిల్ పంపినట్లు తెలుస్తోంది. ఇరాన్ అణు కార్యక్రమాన్ని నిలిపివేయించేలా ఒత్తిడి పెంచడమే లక్ష్యంగా, ఇప్పటివరకు అనుసరిస్తున్న దాడుల వ్యూహాన్ని సెంట్రల్ కమాండ్ అధికారులు పునఃసమీక్షిస్తున్నారని విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ అమెరికా మీడియా వెల్లడించింది. ఇరాన్‌పై భారీ దాడులకు దిగుతామని అధ్యక్షుడు ట్రంప్ గతవారం హెచ్చరించిన సంగతి తెలిసిందే. సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ జోక్యంతో తీవ్రస్థాయి దాడుల నుంచి ట్రంప్ తాత్కాలికంగా వెనక్కి తగ్గినప్పటికీ, ఆ హెచ్చరికలకు ముందే సెంట్రల్ కమాండ్ తమ బలగాలకు కొత్త వ్యూహాలపై సందేశం పంపడం గమనార్హం. ఇరాన్‌ను చర్చలకు తీసుకురావాలన్న లక్ష్యంతో అమెరికా వారాలుగా వైమానిక దాడులు కొనసాగిస్తున్నా, ఒప్పందానికి సూచనలు కనిపించకపోవడంతో టెహ్రాన్‌ను శిక్షించే దిశగా అగ్రరాజ్యం దృష్టి సారించినట్టు సమాచారం. వాస్తవానికి ఫిబ్రవరి చివరిలో మొదలైన ఈ ఘర్షణ నెలలుగా తీవ్రమవుతూనే ఉంది. గత రెండు వారాల్లోనే వరుసగా పలు రాత్రులు



అమెరికా బలగాలు ఇరాన్‌పై దాడులు కొనసాగించాయి. ఇటీవల అమెరికా స్థావరాలపై ఇరాన్ ప్రయత్నించిన దాడులకు ప్రతిస్పందనగా, ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్‌కు చెందిన సైనిక కమాండ్ కేంద్రాలు, క్షిపణి-డ్రోన్ కేంద్రాలు, తీర నిఘా స్థావరాలపై అమెరికా భారీ దాడులు జరిపింది. ఈ దాడుల్లో సాధారణ పౌరులు కూడా మృతిచెందినట్లు ఇరాన్ మీడియా వెల్లడించింది. ప్రతిగా ఇరాన్ మద్దతుగల బలగాలు జోర్డాన్, కువైట్‌లోని అమెరికా స్థావరాలపైనా, బహ్రెయిన్‌లో అమెరికా 5వ నౌకాదళ నియంత్రణ కేంద్రంపైనా దాడులకు దిగాయి. దీంతో వ్యూహాత్మక జలమార్గాలైన హోర్ముజ్, బాబ్ ఎల్ మండెబ్ జలసంధుల్లో ఉద్రిక్తతలు తీవ్రమై, ముడి చమురు ధరలు ఒక దశలో పీపా వంద డాలర్లు దాటాయి. ఈ పరిస్థితుల మధ్య అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఒప్పందంపై తుది నిర్ణయానికి రావడానికి ఇరాన్‌కు 'చివరి అవకాశం' ఇచ్చామని స్పష్టం చేశారు. రెండో ప్రపంచ యుద్ధం నాటి దాడులకంటే తీవ్రంగా ఇరాన్‌పై విరుచుకుపడేందుకు తమ దళాలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. అయితే యుద్ధ ముగింపునకు దౌత్యమార్గాలు అనుసరించాలంటూ ఇరాన్‌తో పాటు సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్ చేసిన అభ్యర్థనల మేరకు సైనిక చర్యను తాత్కాలికంగా నిలిపివేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఇరుదేశాల ప్రతినిధుల మధ్య సంప్రదింపులు కొనసాగుతున్నాయని, ఈ అవకాశాన్ని ఇరాన్ వినియోగించుకోకపోతే టెహ్రాన్‌ను వదిలే ప్రసక్తే లేదని ట్రంప్ హెచ్చరించారు. ఇదిలావుండగా, మంగళవారం తెల్లవారుజామున కువైట్, ఇరాక్‌లోని అమెరికా స్థావరాలపై ×=+జ డ్రోన్ దాడులు చేపట్టడం పరిస్థితిని మరింత జటిలం చేసింది. ప్రాంతీయ మిత్రదేశాలైన అరబ్ దేశాలు సైతం ఈ నిరంతర ఘర్షణతో సహనం కోల్పోతున్నట్లు సంకేతాలు వెలువడుతున్నాయి. మొత్తానికి, దౌత్యం-దాడుల మధ్య అమెరికా-ఇరాన్ వ్యవహారం ఎటు మలుపు తిరుగుతుందో అనే ఉత్కంఠ ప్రపంచవ్యాప్తంగా నెలకొంది.

## బంగారు కలలు.. బద్దలైన బ్లింగ్!

దుబాయ్‌లో లగ్జరీ లైఫ్‌స్టైల్‌తో నెట్టింట సంచలనం సృష్టించిన భారత సంతతి వ్యాపారవేత్త సతీశ్ సన్పాల్ ఇప్పుడు వేరే కారణంతో వార్తల్లో నిలిచారు. మనీలాండరింగ్ ఆరోపణల దర్యాప్తులో భాగంగా అతడి ఆస్తులను ఫ్రీజ్ చేయాలని యూఏఈ ప్రభుత్వం ఆదేశించింది. సతీశ్‌తో పాటు అతడి భార్య తబిందా ఆర్థిక ఖాతాలు, డిజిటల్ వాలెట్లనూ తాత్కాలికంగా నిలిపివేయాలని ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్ ఆదేశించింది. మధ్యప్రదేశ్‌లోని బజల్‌పూర్‌కు చెందిన సతీశ్ 8వ తరగతితోనే చదువు మానేసి, తల్లి దగ్గర రూ.50వేలు అప్పుతీసుకుని కిరాణా కొట్టు పెట్టారు. అది సాగకపోవడంతో స్నేహితుడి పెళ్లికి దుబాయ్ వెళ్లిన సతీశ్.. అక్కడి వాతావరణానికి ఆకర్షితులై స్టాక్ ట్రేడింగ్‌తో వ్యాపార ప్రస్థానం మొదలుపెట్టారు. తర్వాత రియల్‌ఎస్టేట్, టెక్నాలజీ, మీడియా రంగాల్లోకి విస్తరించి, 2018లో అనాక్స్ హోల్డింగ్స్ స్థాపించారు. ప్రస్తుతం ఆయన ఆస్తుల విలువ రూ.8వేల కోట్లకుపైనే ఉంటుందని అంచనా.

రూ.35 కోట్ల విలువైన బుగాటి, రోల్స్ రాయిస్ కార్లు, ఒక యాచ్‌తో పాటు కుమార్తె ఇసాబెల్లా కోసం ప్రత్యేకంగా గులాబీ రంగు రోల్స్ రాయిస్ కొనుగోలు చేశారు. బుర్జ్ ఖలీఫాలోని పెంట్‌హౌస్‌లో నివసిస్తున్న ఈ దంపతులు, రెండు నెలల క్రితం 'దేశీ బ్లింగ్' షోలో కనిపించి సందడి చేశారు. తమ వద్ద 40 కేజీల బంగారం ఉందని, ప్రతి ధన్‌తేరస్‌కు 3 కిలోల బంగారాన్ని భర్త కానుకగా ఇస్తారని తబిందా వెల్లడించడంతో ఆ వీడియోలు వైరల్‌గా మారాయి. ప్రస్తుతం సతీశ్‌పై మధ్యప్రదేశ్‌లో 8-9 కేసులు నమోదై, లుకౌట్ నోటీసు కూడా జారీ అయినట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. యూఏఈ చట్టాల ప్రకారం, గడువు పొడిగించకపోతే 30 రోజుల్లో ఈ ఆస్తుల ఫ్రీజ్‌ను ఎత్తివేయాల్సి ఉంటుంది.



## పందొమ్మిదేళ్లకే ప్రొఫెసర్ అయ్యాడు



అమెరికాకు చెందిన నాథన్ థామస్ పదేళ్ల వయసులోనే కళాశాల చదువు ప్రారంభించి, 18 ఏళ్లకే ప్రొఫెసర్‌గా గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ చోటు సాధించాడు. ఈ విషయంలో దాదాపు 300 ఏళ్ల నాటి రికార్డును థామస్ బద్దలు కొట్టాడు. అంతకుముందు 1717లో స్కాట్లాండ్ గణిత శాస్త్రవేత్త కొలిన్ మెక్లోరిన్ తన 19 ఏళ్ల వయస్సులో ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తించారు. ఆయన రికార్డును తాజాగా థామస్ అధిగమించాడు. అమెరికాలోని మియామీ కాలేజీలో ఇంజినీరింగ్ అధ్యాపకుడిగా బాధ్యతలు చేపట్టిన థామస్.. తనతో దాదాపు సమానమైన వయసున్న విద్యార్థులకు బోధించడం విశేషం. నాథన్ థామస్ పదేళ్ల వయసులోనే డ్యుయల్ ఎన్రోల్మెంట్ కార్యక్రమం కింద మియామీ కాలేజీలో చేరాడు. అనంతరం 14 ఏళ్లకే ఫ్లోరిడా ఇంటర్నేషనల్ యూనివర్సిటీలో బ్యాచిలర్, మాస్టర్స్ డిగ్రీలు పూర్తి చేశాడు. ఇప్పుడు ప్రొఫెసర్‌గా ఇంజినీరింగ్ విద్యార్థులకు పాఠాలు చెబుతున్నాడు.

చైతన్యరథం



**బుమ్రా అంటే ప్రత్యర్థి బ్యాటర్ల గుండెల్లో దడ. కానీ అతని సొంత శరీరమే అతడికి పెద్ద ప్రత్యర్థిగా మారింది. యార్కర్లతో వణికించే ఈ పేస్ మాంత్రికుడు మళ్లీ గాయాల ఉచ్చులో చిక్కుకున్నాడు. ఈ ఏడాది ఒక్క టెస్టూ ఆడని బుమ్రా.. ఇప్పుడు మోకాలి నొప్పితో శ్రీలంక పర్యటనకూ దూరమయ్యాడు. 2016 నుంచి ఇప్పటిదాకా వెన్నెముక, వెన్నునొప్పి, నడుము గాయాలతో పదే పదే మైదానానికి దూరమైన అతని కెరీర్.. ఫిట్‌నెస్ పోరాటానికి ప్రతీకగా నిలిచింది. వచ్చే ఏడాది భారీ ఈవెంట్లు ముందుండగా, బుమ్రాను ఫిట్‌గా ఉంచడమే జట్టు యాజమాన్యానికి అసలైన సవాలు!**

# మెరుపు వేగం.. మానని గాయం...

## గాయాల సుడిగుండంలో బుమ్రా.. ఆటకు మళ్లీ దూరం!

జస్‌ప్రీత్ బుమ్రా బరిలోకి దిగుతున్నాడంటే ప్రత్యర్థి బ్యాటర్ల గుండెల్లో గుబులు మొదలవుతుంది. ప్రాణాంతక యార్కర్లు, వంకర తిరిగే స్వింగర్లతో స్టార్ బ్యాటర్లను సైతం ఇబ్బందిపెట్టే ఈ పేస్ మాంత్రికుడు, కీలక మ్యాచ్‌లకు మాత్రం అందుబాటులో ఉండలేకపోతున్నాడు. కారణం ఏమిటంటే.. వరుస గాయాలు. ఈ ఏడాది ఒక్క టెస్టు కూడా ఆడని బుమ్రా, టీ20 ప్రపంచకప్ ముగిశాక టీ20ల్లోనూ కనిపించలేదు. ఐపీఎల్ తర్వాత దాదాపు నెలన్నరపాటు మైదానానికి దూరంగా ఉన్న అతను గత నెలలో ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్‌లో పునరాగమనం చేశాడు. అయితే రెండు మ్యాచ్‌లు ఆడగానే మళ్లీ గాయం బారినపడి మూడో మ్యాచ్‌కు దూరమయ్యాడు. ఆ గాయం నుంచి ఇంకా పూర్తిగా కోలుకోకపోవడంతో, త్వరలో జరగనున్న శ్రీలంకతో రెండు టెస్టుల సిరీస్‌కూ అతను దూరమయ్యాడు. 2016 జనవరిలో అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టినప్పటి నుంచి బుమ్రా కెరీర్ గాయాలతో పదే పదే అంతరాయం ఎదుర్కొంది. 2022 జులైలో ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్‌లో వెన్నెముక గాయానికి గురైన అతను, వెంటనే ఆసియా కప్‌కు దూరమయ్యాడు. అదే ఏడాది సెప్టెంబర్‌లో ఆస్ట్రేలియాతో స్వదేశీ సిరీస్‌లో జట్టులోకి తిరిగి వచ్చినా, వెన్నునొప్పి మళ్లీ తలెత్తడంతో ఏకంగా 11 నెలలపాటు క్రికెట్‌కు దూరమయ్యాడు. అతని లోటు 2022 టీ20 ప్రపంచకప్‌లో స్పష్టంగా కనిపించింది. ఆ గాయం ప్రభావంతో 2022-23 బోర్డర్-గావస్కర్ ట్రోఫీ, ఐపీఎల్ 2023 సీజన్ మొత్తం, అదే ఏడాది డబ్ల్యూటీసీ ఫైనల్‌కూ దూరమయ్యాడు. బుమ్రా లేకుండా ఆడిన ఆ ఫైనల్‌లో భారత్ ఆస్ట్రేలియా చేతిలో 209 పరుగుల భారీ తేడాతో పరాజయం చవిచూసింది. ఆ తర్వాత 2024-25 బోర్డర్-గావస్కర్ ట్రోఫీ ఐదో టెస్టులో బౌలింగ్ చేస్తుండగా మరో గాయం తగలగా, ఆ నుంచి కోలుకుంటున్న దశలోనే 2025 ఛాంపియన్స్ ట్రోఫీకి ఎంపికయ్యాడు -కానీ నడుము కింది భాగంలో గాయమవడంతో టోర్నీకి దూరమయ్యాడు.

ఇప్పుడు మోకాలి గాయం నుంచి కోలుకోకపోవడంతో శ్రీలంక పర్యటనకు దూరమవుతున్నాడు. వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్, టీ20 ప్రపంచకప్, ఒలింపిక్స్ వంటి భారీ ఈవెంట్లు ముందుండటంతో, బుమ్రా ఫిట్‌నెస్‌ను మెరుగుపరచడం, గాయాల నుంచి కోలుకునే ప్రక్రియను మరింత శాస్త్రీయంగా నిర్వహించడంపై సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం స్పష్టంగా కనిపిస్తోంది.

## లుసానెలో నీరజ్ పరీక్ష

ఇటీవల కామన్వెల్త్ క్రీడల్లో రజత పతకం సాధించిన భారత స్టార్ జావెలిన్ త్రో ప్లేయర్ నీరజ్ చోప్రా మరో పోటీకి సిద్ధమవుతున్నాడు. ఆగస్టు 21న జరగనున్న లుసానె డైమండ్ లీగ్‌లో అతడు బరిలోకి దిగనున్నాడు. ఈ ఏడాది డైమండ్ లీగ్ ఫైనల్స్‌లో పోటీ పడాలంటే నీరజ్‌కు లుసానె టోర్నీ అత్యంత కీలకం. బ్రసెల్స్ వేదికగా సెప్టెంబరు 4-5 తేదీల్లో డైమండ్ లీగ్ ఫైనల్స్ జరగనున్నాయి. దీనికి నీరజ్ ఇంకా అర్హత సాధించలేదు.



రబత్, రోమ్ లీగ్‌లకు దూరంగా ఉన్న అతడు జూన్‌లో జరిగిన దోహా డైమండ్ లీగ్‌లో జావెలిన్‌ను 85.69 మీటర్ల దూరం విసిరి నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నాడు. ప్రస్తుతం డైమండ్ లీగ్ ఫైనల్ పాయింట్ల పట్టికలో నీరజ్ ఐదు పాయింట్లతో ఏడో స్థానంలో ఉన్నాడు. ఫైనల్స్‌కు అర్హత సాధించాలంటే లుసానె లీగ్ లేదా ఆగస్టు 27న జరిగే జ్యూరిచ్ లీగ్‌లో కనీసం ఒకదానిలోనైనా మెరుగైన ప్రదర్శన చేయాల్సి ఉంది. లుసానె పోటీల్లో రుమేశ్ పతిరగె (శ్రీలంక), అర్షద్ నదీమ్ (పాకిస్థాన్), కెషోర్న్ వాల్కాట్ (ట్రినిడాడ్ అండ్ టొబాగో), అండర్సన్ పీటర్స్ (గ్రెనెడా), జులియన్ వెబర్ (జర్మనీ), కర్టిస్ థాంప్సన్ (అమెరికా) నుంచి నీరజ్‌కు గట్టిపోటీ ఎదురుకానుంది. కామన్వెల్త్ గేమ్స్ 2026లో స్వర్ణం లక్ష్యంగా బరిలోకి దిగిన నీరజ్ ఆఖరిదాకా గట్టిగానే పోరాడినా, అతడికి రజత పతకమే (85.83 మీ) లభించింది. రుమేశ్ పతిరగె 89.75 మీటర్ల త్రో వేసి స్వర్ణం ఎగరేసుకుపోయాడు.

## యాషెస్ ఆడే ఉద్దేశమే లేదు..

అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన బెన్ స్టోక్స్ యూటర్న్ గురించి వస్తున్న వార్తలను ఖండించాడు. వచ్చే ఏడాది యాషెస్ సిరీస్‌లో స్టోక్స్ ఆడే అవకాశాలున్నాయని ఈసీబీ ఎండీ రాబ్ కీ పేర్కొనడం అంతా ఉత్తిదేనని స్టోక్స్ తేల్చేశాడు. తనకు యాషెస్ ఆడాలనే ఉద్దేశం లేదని, కాకపోతే ఇంగ్లండ్ జట్టుకు ప్రధాన కోచ్‌గా సేవలందించాలని ఉందని 35 ఏళ్ల ఈ మాజీ కెప్టెన్ తన మనసులోని మాట వెల్లడించాడు. ఇటీవలే అంతర్జాతీయ క్రికెట్ నుంచి వైదొలిగిన బెన్ స్టోక్స్ కోచ్‌గా అవతారమెత్తాలని అనుకుంటున్నాడు. టెస్టు క్రికెట్‌ను ప్రాణంగా ప్రేమించే అతడు.. తిరిగి కోచ్‌గా ఇంగ్లండ్ జట్టుకు మెలకువలు నేర్పాలని ఆరాటపడుతున్నాడు. ఈ విషయాన్ని స్టోక్సే స్వయంగా చెప్పాడు.



## ఆటకు మేం రెడీ..



ఒకప్పుడు మహిళల టెన్నిస్‌ను ఏలిన 'విలియమ్స్ సిస్టర్స్' మళ్లీ జోడీ కట్టారు. కోర్టులోకి దిగారంటే తిరుగులేని ఆధిపత్యంతో రికార్డులు బద్దలుకొట్టే సెరెనా విలియమ్స్, వీనస్ విలియమ్స్‌లు నాలుగేళ్ల తర్వాత డబుల్స్‌లో జంటగా ఆడబోతున్నారు. త్వరలో జరుగనున్న సిన్సినాటి ఓపెన్‌లో ఈ అమెరికా నల్లకలువలు వైల్డ్ కార్డ్ ఎంట్రీ ఇవ్వడం ఖాయమైంది. సింగిల్స్, డబుల్స్ ఏదైనా.. టైటిల్ మాదే అన్నట్టు చెలరేగి ఆడే విలియమ్స్ సిస్టర్స్ మళ్లీ జంటగా అభిమానులను అలరించనున్నారు. వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్‌తోనే ఇద్దరూ అక్కాచెల్లెళ్లు కలిసి ఆడాలని భావించినా.. అవకాశం చేజారింది. ఇప్పుడు సిన్సినాటి ఓపెన్‌లో వీరికి వైల్డ్ కార్డ్ ఎంట్రీ లభించింది. ఆగస్టు 8న మెగా ఈవెంట్ ప్రారంభం కానుంది.

## కూల్ కేఎల్‌కూ.. కోపమొచ్చిందట!



భారత బ్యాటర్ కేఎల్ రాహుల్ మైదానం లోపలా, బయటా ఎప్పుడూ ప్రశాంతంగా కనిపిస్తాడు. ఐపీఎల్‌లో పలు ఫ్రాంఛైజీలకు సారథ్యం వహించిన అతడు, ఒత్తిడితో కూడిన ఉత్కంఠభరిత మ్యాచ్‌ల్లో సైతం చల్లగా ఉండటం అభిమానులు ఎన్నోసార్లు చూశారు. ఆటగాళ్లు తప్పులు చేసినా విసుక్కోకుండా సౌమ్యంగా మాట్లాడే స్వభావం అతడి ప్రత్యేకత. అలాంటి రాహుల్‌ను ఒకే ఒక్కసారి కోపంగా చూశానని పంజాబ్ కింగ్స్ మాజీ హెడ్ కోచ్ వసీం జాఫర్ వెల్లడించాడు. అదే మొదటిసారి, అదే చివరిసారి కూడా అని పేర్కొన్నాడు.

2018 నుంచి 2021 వరకు పంజాబ్ కింగ్స్‌కు ప్రాతినిధ్యం వహించిన రాహుల్, ఆ జట్టుకు కెప్టెన్‌గానూ సేవలందించాడు. ఆ సమయంలో పంజాబ్ కోచ్‌గా వ్యవహరించిన వసీం జాఫర్, రాహుల్‌తో కలిసి పనిచేసిన అనుభవాలను పంచుకున్నాడు. 2020, 2021 సీజన్లలో వ్యక్తిగతంగా రాహుల్ అద్భుత ప్రదర్శన కనబర్చినప్పటికీ, జట్టు మాత్రం ఆరో స్థానానికే పరిమితమైంది. అనేక మ్యాచ్‌లలో గెలిచే స్థితిలో ఉండి కూడా చివరి నిమిషాల్లో స్వల్ప తేడాతో ఓటమి పాలవడం జట్టును తీవ్ర నిరాశకు గురిచేసింది. ఇది రాహుల్ మానసిక స్థితిపైనా ప్రభావం చూపిందని జాఫర్ గుర్తుచేసుకున్నాడు.

"కేఎల్ సహజంగానే చాలా ప్రశాంతంగా ఉంటాడు. కాస్త మితభాషి, ఎవరితోనూ ఎక్కువగా కలవడు. అందుకే బయట పెద్దగా కనిపించడు. మైదానంలోగానీ, బయటగానీ అతడు సహనం కోల్పోవడం, కోప్పడటం చాలా అరుదు. కానీ నేను పంజాబ్ జట్టుకు కోచ్‌గా ఉన్నప్పుడు దాదాపు ప్రతి మ్యాచ్ మాకు తీవ్ర నిరాశను మిగిల్చింది. గెలిచే స్థితిలో ఉండి కూడా మేము మ్యాచ్‌లు ఓడిపోయాం. అలాంటి ఒక సునాయసంగా గెలవాల్సిన మ్యాచ్ చేజారడంతో రాహుల్‌కు కోపం వచ్చింది. ఆ రోజు అతడు ఎవరినీ తప్పుగా మాట్లాడలేదు, కానీ జట్టు ఆటతీరుపట్ల ఎంతగా అసహనానికి గురయ్యాడో అతడి మొహంలో స్పష్టంగా కనిపించింది. నేను రాహుల్‌ని కోపంగా చూసిన ఏకైక సందర్భం అదే" అని వసీం జాఫర్ పేర్కొన్నాడు. ప్రస్తుతం అంతర్జాతీయ క్రికెట్‌లో తన స్థిరమైన, ప్రశాంత స్వభావంతో టీమిండియాకు కీలక బ్యాటర్‌గా, సీనియర్ ఆటగాడిగా రాహుల్ కొనసాగుతున్నాడు.

చైతన్య రథం
సినిమా
బుధవారం 5 ఆగస్టు 2026 X

## రామాయణపై రణబీర్ అప్‌డేట్..?



ఒక్క ట్రైలర్‌తోనే డైరెక్టర్ నితీష్ తివారి రామాయణ సెన్సేషన్ క్రియేట్ చేసింది. అంతర్జాతీయస్థాయి సినిమాని ఈ ఏడాది, వచ్చే ఏడాది దీపావళికి రెండు భాగాలుగా రిలీజ్ చేయనున్నారు. తాజాగా ఈ సినిమాపై రణబీర్ కపూర్ బిగ్ రివీల్ చేసాడు. పార్ట్-2 షూట్ అప్పుడే 50 శాతం పూర్తి చేసుకున్నట్టు కన్ఫర్మ్ చేశాడు. అలాగే పార్ట్ 2ని కూడా అనుకున్న సమయానికే విడుదల చేసేలా అన్ని పనులు చేస్తున్నట్టు తెలిపాడు. సో రామాయణ విషయంలో ఫ్యాన్స్‌కి ఓ క్లారిటీ వచ్చినట్టేనని చెప్పాలి. ఇక ఈ గ్రాండ్ ప్రాజెక్ట్‌కి హన్స్ జిమ్మర్, ఏఆర్ రెహమాన్‌లు సంగీతం అందిస్తుండగా నమిత్ మల్హోత్రా నిర్మాణం వహిస్తున్నారు.



## డీప్ ఫేక్.. మృణాల్ సీరియస్


బాలీవుడ్, దక్షిణాదిన ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న స్టార్ హీరోయిన్ -మృణాల్ ఠాకూర్. డీప్‌ఫేక్ ఫొటోల కారణంగా ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారారు. సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న మార్ఫింగ్ ఇమేజెస్‌పై ఆమె సీరియస్ అవుతున్నారు. ఘటనపై కఠిన చర్యలు తప్పవన్న హెచ్చరికతో సోషల్ మీడియా పోస్టు పెట్టారు మృణాల్. ఇటీవల ఓ ఎంటర్‌టైన్‌మెంట్ పేజ్ మృణాల్ మార్ఫింగ్ ఫొటోలను అభ్యంతరకర రీతిలో షేర్ చేసింది. ఏఐ సాయంతో రూపొందించిన డీప్‌ఫేక్ చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో మృణాల్ స్పందించారు. 'నా పేరిట ప్రచారం చేస్తున్న మార్ఫింగ్ ఫొటోలు పూర్తిగా అనధికారికం, చట్టవిరుద్ధం. వెంటనే తొలగించాలి. ఇకపై ఎవరైనా ఆ చిత్రాలను షేర్ చేసినా, ప్రచారం చేసినా చట్టపరమైన చర్యలు తప్పవు అంటూ హెచ్చరించారు. సెలబ్రిటీల వ్యక్తిగత గౌరవాన్ని దెబ్బతీసేలా ఇలాంటి డీప్‌ఫేక్ కంటెంట్‌ను సృష్టించడం, ప్రచారం చేయడం తీవ్ర నేరమని ఆమె హితవు పలికారు. ఇంతకుముందు రష్మిక మందన్నతోపాటు పలువురు సెలబ్రిటీలు డీప్‌ఫేక్ వీడియోల బారిన పడ్డారు. అప్పట్లో ఈ ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. డీప్‌ఫేక్‌లపై కఠిన చట్టాలు అవసరమన్న డిమాండ్ వినిపించింది. ఇప్పుడు మృణాల్ ఠాకూర్ కూడా బహిరంగంగా స్పందించడంతో సోషల్ మీడియాలో జరుగుతున్న డిజిటల్ దుర్వినియోగంపై మరోసారి చర్చ మొదలైంది. ఈ ఘటనపై సంబంధిత సోషల్ మీడియా ప్లాట్‌ఫాం, అధికార యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకుంటాయన్నది ఆసక్తికరం.

# ఆ పారితోషికం.. వదంతే!




బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్‌తో వంశీ పైడిపల్లి చేస్తున్న ప్రాజెక్టు 'ఎస్‌వీసీ 63' (వర్కింగ్ టైటిల్). షూటింగ్ జరుపుకొంటున్న సినిమాకు సంబంధించిన ఓ వార్త ఇటీవల సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ చిత్రం కోసం సల్మాన్ ఖాన్ తన పారితోషికాన్ని తగ్గించుకున్నారని వార్తలు వచ్చాయి. తాజాగా వాటిని నిర్మాత దిల్ రాజు ఖండించారు. సల్మాన్ ఖాన్ సాధారణంగా రూ.120 కోట్లు రెమ్యునరేషన్ తీసుకుంటారని.. కానీ, ఈ సినిమా కోసం రూ.70 కోట్లు మాత్రమే తీసుకుంటున్నారని ప్రచారం జరిగింది. దీనిపై దిల్ రాజు స్పందిస్తూ.. "సల్మాన్ ఖాన్ పారితోషికంపై వస్తోన్న వార్తలన్నీ అవాస్తవం. నిర్మాతలుగా మేము మా ప్రాజెక్టకు సంబంధించిన ఆర్థిక, వ్యాపార వివరాలను బహిర్గతం చేయం. సినిమా బడ్జెట్, పారితోషికాలపై వస్తోన్న నంబర్లు ఊహాగానాలు మాత్రమే. ఈ సినిమా గురించి కథనాలు ప్రచురించే ముందు మీడియా ప్రతినిధులు మమ్మల్ని సంప్రదించి వివరణ కోరాలని విజ్ఞప్తి చేస్తున్నాము. ప్రేక్షకుల అంచనాలకు తగ్గట్టుగా ఒక గొప్ప సినిమాను అందించడానికి మా టీమ్ కృషి చేస్తోంది" అని చెప్పారు. ఇక ఈ సినిమా కోసం తాను 16 కిలోలు తగ్గినట్టు సల్మాన్ ఖాన్ ఇటీవల ఓ కార్యక్రమంలో వెల్లడించారు. అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న చిత్రాన్ని 2027 ఈద్ కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి సన్నద్ధమవుతున్నారు. ఇందులో సల్మాన్‌కు జోడీగా అగ్ర కథనాయిక నయనతార నటిస్తుండగా.. సీనియర్ నటుడు అరవింద్ స్వామి కీలక పాత్రలో కనిపించనున్నారు.

## ట్రైలర్‌తో.. హైపొస్తుందా?



కన్నడ రాకింగ్ స్టార్ యష్ ఇప్పుడు రెండు భారీ ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నాడు. ఒకటి టాక్సిక్ చిత్రం గ్రాండ్‌గా ముందు విడుదల కానుండగా.. తర్వాత రామాయణ రానుంది. అయితే వీటిలో ఈ ఆగష్టులోనే దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ తెరకెక్కించిన యాక్షన్ చిత్రం టాక్సిక్‌పై హైప్ మాత్రం అప్పట్లో ఉన్నంత లేదు. ఎన్నో ఏళ్ళ క్రితం మొదలుపెట్టిన సినిమా పలు వాయిదాలు అనంతరం వస్తోంది. ఈ గ్యాప్‌లో ఉన్న హైప్ కూడా తగ్గింది. ఇక అంతా ఇపుడు రానున్న ట్రైలర్ కోసమే ఎదురు చూస్తున్నారు. అదొక్కటే సినిమాకి సేవియర్‌గా మారనుంది. ఆగష్టు 8న బెంగళూరులో గ్రాండ్‌గా ట్రైలర్ విడుదల కానుండగా.. ఇది వచ్చాక ఏమన్నా హైప్ మారుతుందో లేదో చూడాలి. ఈ సినిమాలో కియారా అద్వానీ, నయనతార, రుక్మిణి వసంత్‌లు హీరోయిన్స్‌గా నటించగా కేవీఎన్ ప్రొడక్షన్స్ ప్రాజెక్టును నిర్మిస్తోంది.




## ఏకే 64 టు.. డేర్ డెవిల్!

'ఏకే 64' టైటిల్‌తో పాపులరైన అజిత్ కొత్త ప్రాజెక్టుకు.. 'డేర్ డెవిల్' టైటిల్ ఖరారు చేశారు మేకర్స్. టాప్ డైరెక్టర్ అధిక్ రవిచంద్రన్ డైరెక్ట్ చేస్తుండగా, అజిత్ సతీమణి షాలిని 'బ్రేవ్‌హార్ట్స్ ప్రొడక్షన్' బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ప్రాజెక్టు అనౌన్స్‌మెంట్‌తో విడుదల చేసిన డైస్ డిజైన్ పోస్టర్ ఆసక్తి క్రియేట్ చేస్తోంది. 'గుడ్ బ్యాడ్ అగ్లీ' సినిమా విడుదలైన 16 నెలల తర్వాత అజిత్‌నుంచి వస్తున్న ప్రాజెక్ట్ ఇదే. 'గుడ్ బ్యాడ్ అగ్లీ' షూటింగ్ సమయంలోనే దర్శకుడు అధిక్ రవిచంద్రన్ ఈ సినిమా వన్-లైనర్‌ను అజిత్‌కు వినిపించగా, ఆయన వెంటనే ఇంప్రెస్ అయి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలిపారు. తర్వాత పూర్తి స్క్రిప్ట్ సిద్ధం కావడంతో, సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను రాబోయే సెప్టెంబర్ నుంచి ప్రారంభించనున్నారు.

# పాపం.. నిద్రలేని కీర్తి



ప్రముఖ నటి కీర్తి సురేశ్ -తన వర్క్ షెడ్యూల్ ఎంత కష్టంగా ఉందో వివరిస్తూ ఓ వీడియో పోస్ట్ చేశారు. తీవ్ర అలసట కారణంగానే తాను వీడియోను ఆలస్యంగా పోస్ట్ చేస్తున్నట్టు తెలిపారు. "నిన్న ఈ వీడియోను పోస్ట్ చేసే ఓపిక కూడా లేదు. ఒక షూటింగ్‌నుంచి మరో షూటింగుకు వెళ్తూనే ఉన్నా. నిన్న ఉదయం 6 గంటలకు నా గదిలోంచి బయలుదేరాను. మళ్లీ ఇప్పుడు ఉదయం 6 గంటలైంది. దాదాపు 24 గంటల తర్వాత గదిలోకి అడుగుపెట్టాను. అందులో 20 గంటలపాటు పనిలోనే ఉన్నాను. అసలు విషయం ఏమిటంటే.. మళ్లీ ఇంకో గంటలో తర్వాతి షూటింగ్ కోసం బయలుదేరాలి. ఇలాంటి సమస్యల గురించి ఫిర్యాదు చేయడం మంచిదే. జీవితమంటే ఇదే కదా? దీన్ని నేను ఆశీర్వాదంగా భావిస్తున్నా" అని పేర్కొన్నారు. ఇటీవల సినీ పరిశ్రమలో నటీనటుల '8 గంటల పని' గురించి చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఆమె తన బిజీ షెడ్యూల్ గురించి ఇన్స్టాగ్రామ్ వేదికగా పంచుకోవడం గమనార్హం. ప్రస్తుతం కీర్తి సురేశ్ చేతిలో పలు క్రేజీ ప్రాజెక్టులు ఉన్నాయి. 'రూర్', 'అక్క', 'రౌడీ జనార్దన' చిత్రాలతోపాటు వెంకటేశ్, అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో వస్తున్న చిత్రంలో ఆమె నటిస్తున్నారు. ఇలా విభిన్నమైన పాత్రలతో భారతీయ వెండితెరపై ఆమె తనకంటూ ప్రత్యేక ముద్ర వేస్తున్నారు.